అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

శుక్రవారం 10-02-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 8 సంచిక : 356 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 10 పేజీలు వెల : 6.50



# అమృత కాలం కాదు..విష కాలం

## మతం ఆయుధంగా రాజ్యాంగంపై బీజేపీ దాడి



- ఆహార సబ్సిడీకి బడ్జెట్‌లో 90 వేల కోట్ల కోత : బృందా కరత్

న్యూఢిల్లీ : అమృత కాలం అంటూ బీజేపీ చేస్తున్న నినాదంపై సీపీఐ(ఎం) స్పందించింది. దీనిని విష కాలంగా అభివర్ణించాలని తెలిపింది. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని ఆయుధంగా వాడుకుంటూ దేశ రాజ్యాంగంపై దాడిని బీజేపీ ప్రారంభించిందని ఆరోపించింది. " తమ ప్రభుత్వం పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నదని ప్రధాని మోడీ చెప్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకి రూ. 90 వేల కోట్ల కోత విధించారు. ఇది అమృత కాలం కాదు.. విష కాలం" అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ అన్నారు. త్రిపురలోని అమర్‌పుర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. వారు (బీజేపీ) రాజకీయాలతో మతాన్ని కలుపుతున్నారని అన్నారు. వారి హిందూత్వ భావజాలానికి హిందూ మతానికి సంబంధం లేదని తెలిపారు. ఎన్నికల్లో ప్రయోజనాల కోసం మన ప్రజల మధ్య విభజన తీసుకురావడానికి ఇది ఒక రాజకీయ ఆయుధం అని అన్నారు. రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తూ అధికార బీజేపీ బుల్డోజర్ రాజకీయాలను నడిపిందని ఆరోపించారు. భారత దేశ ప్రజాస్వామ్య పునాదిని కాషాయ పార్టీ నాశనం చేస్తున్నదన్నారు. అనామక ఎలక్టోరల్ బాండ్లను జారీ చేస్తూ బీజేపీ కోట్ల రూపాయలను పోగు చేసుకుంటున్నదని బృందా కరత్ ఆరోపించారు.

"ఆదివాసుల హక్కుల కోసం ...9లో

## లోపాలుంటే సరిచేస్తాం..

# ధరణిని రద్దుచేయం

**ప్రగతిభవన్‌ను బాంబులతో పేల్చడమే కాంగ్రెస్ విధానమా? : శాసనసభలో మంత్రి కేటీఆర్**

- పద్దులపై చర్చ సందర్భంగా శ్రీధర్‌బాబుపై మంత్రి ఫైర్





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ధరణి పోర్టల్‌లో ఏమైనా లోపాలుంటే సరిచేస్తాం గానీ, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయబోమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు స్పష్టం చేశారు. ఆర్టీఐ చట్టాన్ని కమీషన్ల వసూలు కోసం వాడుకుంటున్నవారికి, దాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని, ప్రయివేటు వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేసేవాళ్లకు ధరణి పోర్టల్ ఇబ్బందిగా మారిందని ఎద్దేవాచేశారు. అందుకే వారు గొంతులు చించుకుంటున్నారని విమర్శించారు. ఆ పోర్టల్ రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉందని చెప్పారు. గురువారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకుని మాట్లాడారు. దీంతో పరిస్థితి కేటీఆర్ వర్సెస్ దుద్దిళ్ల అన్నట్టుగా తయారైంది. కేటీఆర్ మాట్లాడుతూ.. ధరణిని రద్దు ...2లో

### సింగరేణిపై కేంద్రం కుట్రలను భగ్నం చేస్తాం..

**కార్మికులు, రాజకీయ పక్షాలతో కలిసి ఐక్య ఉద్యమాలు...**

- బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తాం :అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ వివరాలు 2లో..

## జైలుకైనా పోతాం..

# జాగాలను వదలం

**ఎన్నికలకు ముందే..ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి**





- డబుల్ ఇండ్లు ఎప్పుడిస్తారో చెప్పాల్సిందే
- పోడు భూములపై దాగుడుమూతలొద్దు : ప్రజాసంఘాల పోరాట వేదిక ధర్నాలో వక్తలు
- అసెంబ్లీ ముగిసేలోపే సమస్యలు పరిష్కరించాలి :ఎస్ వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పోరాడుదాం..పేదలకు ఇండ్లు, ఇంటి జాగాలు ఇచ్చేంత వరకు.. పోరాడుదాం, పోరాడుదాం.. ఇవ్వాలి అందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు .. ఇవ్వాలీ, ఇవ్వాలి..ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలందరికీ పట్టాలు..ఇవ్వాలి.. ఇవ్వాలీ..కష్టజీవులపై పోలీసు నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడుదాం..పోరాడుదా'మంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు.. సర్కారిచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమం తప్పదంటూ హెచ్చరికలు.. ముందస్తు అరెస్టులా? సిగ్గు..సిగ్గు అంటూ స్లోగన్స్. పేదలంటే అలుసా?..పెద్దలంటే ప్రేమా? అంటూ పిడికిళ్లు బిగించి గొంతెత్తిన మహిళలు.. తమ బతుకు బాధలతో ఉయ్యాల, బతుకమ్మ పాటలు పాడుతూ ఆడిన స్త్రీలు. వెరసి..పేదల బాధలన్నీ హైదరాబాద్‌కు మోసుకొచ్చిన శ్రమజీవుల నినాదాలతో గురువారం ధర్నా చౌక్ దద్దరిల్లింది. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక పిలుపులో భాగంగా నిర్వహించిన ధర్నాలో ప్రజాసంఘాల నేతలు మాట్లాడారు. వేదిక నాయకులు చుక్కా రాములు, జి నాగయ్య, పోతినేని సుదర్శన్, కెఎన్ ఆశాలత అధ్యక్ష వర్గంగా ఉన్నారు.ఇంటి జాగాలు, సాగు భూముల కోసం పేదలు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నెలలుగా పోరాడుతున్నారని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య చెప్పారు. వరంగల్‌లో ప్రారంభమైన ...9లో

### మోగిన ఎమ్మెల్సీ నగారా

**తెలుగు రాష్ట్రాల్లో 14 స్థానాలకు ఎన్నికలు**

- తొమ్మిది స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- తెలంగాణలో చెరొక స్థానానికి పోలింగ్

వివరాలు 9లో..

### ఆయిల్ ట్యాంకు శుభ్రం చేస్తుండగా..

**ఏపీలో ఊపిరాడక ఏడుగురు కార్మికులు మృతి** 2లో..





## ఉత్తరాఖండ్‌లో పేపర్ లీక్ నిరసనపై

# లాఠీచార్జ..

**ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై సీబీఐ దర్యాప్తునకు నిరుద్యోగ యువత డిమాండ్**



- అవకతవకలపై ఆందోళనకారుల్లో పెల్లుబికిన ఆగ్రహం
- పోలీసుల వీరంగం..పలువురికి గాయాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో నిరుద్యోగ యువత ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకులకు వ్యతిరేకంగా వారు చేసిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఈ ఆందోళనల్లో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నిరుద్యోగ యువత ఆందోళన చేస్తున్న డెహ్రాడూన్‌లోని గాంధీ పార్క్ వద్దకు పోలీసులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టడానికి పోలీసులు వారిపై లాఠీచార్జ్ జరిపారు. పోలీసు చర్యతో పలువురు యువకులు గాయపడ్డారు. ఉత్తరాఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన వివిధ నియామక పరీక్షలలో చోటు చేసుకున్న అవకతవకలపై సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ యువత డెహ్రాడూన్‌లో బుధవారమే ధర్నాకు దిగింది. నియామక పరీక్షల్లో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా వారు నినాదాలు వినిపించారు. అయితే, వారి ధర్నాను బలవంతగా ఎత్తివేయడానికి పోలీసులు ప్రయత్నించారు. పోలీసుల చర్య నిరసనకారుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. తమ డిమాండ్లను వినిపించడానికే డెహ్రాడూన్ రోడ్డును దిగ్బంధించినట్టు రాష్ట్ర నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు బాబీ పన్వార్ తెలిపారు. " యువత చాలా ఆగ్రహంగా ఉన్నది. పోలీసులు లాఠీ చార్జీ చేశారు. కొందరిని నిర్బంధించి విడిచిపెట్టారు. రాష్ట్రంలో రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో, నియామక సంస్థలపై సీబీఐ దర్యాప్తునకు మేము ...9లో

## కేంద్రం ఆర్టీసీని అమ్మేయమంటోంది



**ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రశ్నకు ఆర్థికమంత్రి హరీశ్‌రావు సమాధానం**



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వరంగంలోని ఆర్టీసీని అమ్మేస్తే, ప్రోత్సాహకాలు ఇస్తామని కేంద్రప్రభుత్వం పదే పదే రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నదని ఆర్థిక మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం ఉన్నది కాబట్టే, ఆర్టీసీకి ఏటా రూ.1,500 కోట్లు గ్రాంటుగా ఇస్తూ సంస్థను పరిరక్షిస్తున్నామని చెప్పారు. గురువారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీల చెల్లింపు, కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తున్న స్క్రాప్ చట్టం ద్వారా ఆర్టీసీలో 3వేలకు పైగా బస్సులు తగ్గిపోతున్న అంశాలను సభలో ప్రస్తావించి, ఆర్థికమంత్రి సమాధానం ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి హరీశ్‌రావు పై విధంగా స్పందించారు.

రాష్ట్రంలో కేసీఆర్ లేకుండా ఇంకే ప్రభుత్వం ఉన్నా, ఆర్టీసీని ఇప్పటికే అమ్మేసి ఉండేవారని వ్యాఖ్యానించారు. కానీ సీఎం కేసీఆర్ ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కట్టుబడి ఉన్నారని చెప్పారు.

### కొక్కొరోకో..




ఈ సీజన్‌లో పసుపు ధర అమాంతం పడిపోయింది. గతేడాదితో పోల్చితే ఏకంగా సగానికి రేటు పడిపోవడం రైతన్నలను తీవ్రంగా కలిచివేస్తోంది. గతేడాది ఈ సమయానికి రూ.8,500 పలికిన క్వింటా ధర.. ప్రస్తుతం కేవలం రూ.4000-రూ.4200 పలుకుతోంది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు.. ఈ యేడాది భారీ వర్షాల వల్ల పంట దిగుబడి తగ్గిపోయిందని దిగులు చెందుతున్న రైతులకు మార్కెట్‌లో ధర తీవ్ర కలవరం పెడుతోంది.

# పసుపు రేటు ఢమాల్

## సగానికి పడిపోయిన పసుపు ధర

- రెండు విధాలుగా రైతాంగానికి నష్టం
- ఈ యేడు తగ్గిన దిగుబడి
- సాగు తగ్గించుకుంటాం : రైతన్నలు



నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రస్తుతం నిజామాబాద్ మార్కెట్‌లో గరిష్టంగా క్వింటాకు కేవలం రూ.5910 మాత్రమే పలకడం గమనార్హం. ఒక పసుపు డ్రమ్ము ఉడికించే వరకు రైతుకు అన్నీ ఖర్చులు కలుపుకుని రూ.3,700 అవుతుంటే.. మార్కెట్‌లో ప్రస్తుతం రూ.2,500 వరకు మాత్రమే వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ విధంగా డ్రమ్ము పసుపుకు రూ.1200 వరకు నష్టపోతున్నామని, ఇకపై మెల్లిమెల్లిగా సాగు తగ్గిస్తామని రైతులు పేర్కొంటున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఈ యేడాది 30 వేల ఎకరాల్లో పసుపు పంట సాగయ్యింది. సాధారణంగా 35 వేల ఎకరాల వరకు పంట సాగవ్వాల్సి ఉండగా.. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. అయితే ఈ యేడాది అధిక వర్షాలు రైతును నిండాముంచాయి. అధిక వర్షాల వల్ల పంటలోకి నీరు చేరి దుంప తెగుళ్లు సోకి ఆ ప్రభావం దిగుబడిపై పడింది. ఏదో విధంగా పంటను కాపాడుకుని తీరా మార్కెట్‌కు పంట తీసుకొస్తే మార్కెట్‌లో ధరలు అమాంతం పడిపోయాయి. ఓ వైపు పెద్దఎత్తున పంట వచ్చి మార్కెట్ చేరుతుంటే.. మరోవైపు మార్కెట్‌లో ధర తగ్గింది. ప్రస్తుతం నిజామాబాద్ ...2లో

## హైకోర్టుల్లో దాదాపు 60 లక్షల కేసులు పెండింగ్

**సుప్రీంలో 69 వేలకు పైనే : రాజ్యసభలో కేంద్రం**



న్యూఢిల్లీ : భారత్‌లోని ఉన్నత న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు లక్షల సంఖ్యలో పేరుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా 25 హైకోర్టులలో దాదాపు 60 లక్షల వరకు కేసులు, సుప్రీంకోర్టులో 69 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని పేర్కొంటూ కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజు లిఖితపూర్వక సమాధానాన్ని ఇచ్చారు. ఈ సమాచారం ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నాటికి భారత సర్వోన్నత న్యాయస్థానంలో 65,511 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే, హైకోర్టులలో 59,87,477 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టులో అత్యధికంగా 10.30 లక్షల కేసులు తుది తీర్పు కోసం ఎదురు చూస్తున్నాయి. సిక్కిం హైకోర్టులో అత్యల్పంగా 171 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

## నవతెలంగాణపై స్పందన
## ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

**అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.**

## చలో హైదరాబాద్‌కు వెళ్లకుండా అరెస్ట్
## ఎక్కడికక్కడ నాయకుల అడ్డగింత



నవతెలంగాణ- విలేకరులు

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరిన పేదలు, ప్రజాసంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డగించి ముందస్తు అరెస్టులు చేశారు. కేవీపీఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్‌ను బుధవారం రాత్రి ఇంటి వద్ద అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెనుబల్లి మండల కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజాపంథా పార్టీ నాయకులను అరెస్టు చేశారు. నల్లగొండ పట్టణంలోని కతాలగూడలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్యను అరెస్టు చేసి వన్‌టౌన్‌కు తరలించారు. నాంపల్లిలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళిని అరెస్టు చేశారు. మర్రిగూడలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ పాండురంగారావులను అరెస్టు చేశారు. దామరచర్లలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మాలోతు వినోద్ నాయక్, ప్రజా సంఘాల నాయకులు పాపానాయక్, వినోద్, సుబాని, రవి, పిచ్చయ్యను ముందస్తు అరెస్టు అయ్యారు. పెద్దపల్లి జిల్లాలో సీపీఐ(ఎం), సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, పట్నం తదితర ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల కుమార స్వామి, ఎ.ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, అధ్యక్షుడు ప్రశాంత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్‌ను అరెస్టు చేశారు. రాజ న్న సిరిసిల్ల జిల్లాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు కోడం రమణ, నాయకులు ఎలిగేటి రాజశేఖర్‌ను అరెస్టు చేశారు.

## 24 గంటల ఉచిత విద్యుత్ ఊతపదమైంది

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

'శాసనసభ సమావేశాలు వాస్తవాలకు దగ్గరగా ఉండాలి. సభాపతులు అధికార పార్టీకి వంత పాడుతున్నట్టు ఉన్నది. 24 గంటల ఉచిత విద్యుత్ కేవలం ఊత పదమైంది. కనీసం 13 గంటలు విద్యుత్ కూడా ఇవ్వడం లేదు" అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. రైతాంగం సబ్ స్టేషన్ల ముందు ధర్నా చేస్తుంటే వీరికి కనబడటం లేదు.. మీరు పెట్టిన కంటి వెలుగులో కంటి పరీక్షలు చేయించుకోండి. అప్పుడన్నా కనబడుతది అని బీఆర్ఎస్ మంత్రులకు సూచించారు. "బరితెగించి అబద్ధాలు మాట్లాడుతున్నారు. శాసన సభాపతి, శాసన మండలి అధ్యక్షులు.. మాతో రండి సమస్య ఏంటో చూపిస్తాం. పత్రికలు, టీవీల్లో నిత్యం రైతుల ఆందోళనలు వీళ్లకు కనబడటం లేదు. ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన అంశాలపై కాకుండా వాళ్ల మాటలు వాళ్లవే. 24 గంటల ఉచిత విద్యుత్‌పై శాసన మండలిలో వాయిదా తీర్మానం పెట్టాను. సభాధ్యక్షులు దాన్ని తిరస్కరించడం ఎందుకు? వాస్తవాలు వెలుగులోకి వస్తాయనా?' అని ప్రశ్నించారు.

## కరెంటు లేక రైతులు కష్టాలు పడుతున్నారు

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వం కనీసం నాలుగు, ఐదు గంటల కరెంటు కూడా ఇవ్వలేని ప రిస్థితి. ఎప్పుడు ఇస్తున్నారో, ఏ సమయంలో ఇస్తున్నారో తెలువదు. వాయి దా తీర్మానం ఇస్తే స్పీకర్ తిరస్కరించారు. ఆవేదనతో నిరసన తెలిపి బయ టికి వచ్చాం. రైతుల సమస్యలపై చర్చించే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదు.

**స్పీకర్ తీరు బాధాకరం**
**ములుగు ఎమ్మెల్యే సీతక్క**

రైతుల ఆవేదన అర్థం చేసుకుని మేము వాయిదా తీర్మానం ఇస్తే స్పీ కర్ తిరస్కరించడం బాధాకరం. మిర్చి, వరి ఇతర పంటలు వేసిన రైతులు నష్టపోతున్నారు. రైతులు ఆత్మహత్య చేసుకునే ప్రమాదం పొంచి ఉంది. రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి.'

**విద్యుత్ కొనుగోలు ప్రతిపాదన వాస్తవామా? కాదా?**
**ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు**

'విద్యుత్ కొనుగోలు చేయడానికి డిస్కంలు ప్రతిపాదన పెట్టాయా? లేదా? వాస్తవమా కాదా? చెప్పాలి. కొనుగోలు చేయకుంటే రైతులు ఇబ్బంది పడతారని పత్రికల్లో వచ్చిన వార్తలు నిజం కాదా? వివిధ రూపాల్లో వినియోగదారుల నుంచి ఏసీడీ చార్జీలు వసూలు చేస్తున్నారు. కరెంటు బిల్లుల పెంపు విషయం ఈఆర్సీ ముందు ప్రతిపాదన పెట్టారు. విద్యుత్ చార్జీలు పెంచలేదని గొప్పలు చెబుతున్నారు. రైతులకు మీరు చెపుతున్నట్టు 24 గంటలు 3 ఫేస్ కరెంట్ ఉచితంగా అందించాలి'.

## ఆన్‌లైన్ మూల్యాంకనంతో విప్లవాత్మక మార్పు

- టీజీవో ఇంటర్ విద్యాఫోరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనమనేది ఒక విప్లవాత్మక మార్పు అని టీజీవో ఇంటర్ విద్యాఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వర్లు, ఎండీ ఇస్మాయిల్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సస్పెండైన మధుసూదన్‌రెడ్డి ఇంటర్ విద్యా కమిషనర్‌పై కక్షపూరిత ధోరణితో నిరాధార ఆరోపణలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆన్‌లైన్ మూల్యాంకనంపై భయాందోళనలు సృష్టించడం సరైంది కాదని పేర్కొన్నారు. సాంకేతిక విద్యాశాఖలో మూడేండ్ల నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం కొనసాగుతున్నదని వివరించారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయ సమస్యల సాధనే మా లక్ష్యం

- పీఆర్టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తు న్నామని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి చెప్పారు. పీఆర్టీయూటీఎస్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. సంఘ పతాకాన్ని పీఆర్టీయూటీఎస్ అధ్య క్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా పంచాయతీరాజ్ టీచర్లకు పెన్షన్, గ్రామీణ ప్రాంత హెచ్ఆర్ఏ, ప్రసూతి సెలవులు, 010 పద్దు కింద వేత నాలు, ఇంగ్లీష్, ఫిజికల్ సైన్స్, పీఎస్‌హెచ్ఎం పోస్టుల మంజూరయ్యా యని వివరించారు. 40 జీవో నెంబర్ 40 ద్వారా ఎంఈవో, ప్రధానోపాధ్యా యులకు అధికారాలొచ్చాయని చెప్పారు. 30 శాతం ఫిట్‌మెంట్, 61 ఏండ్ల కు ఉద్యోగ విరమణ వయస్సు పెంపు సాధించామన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదలలో పీఆర్టీయూటీఎస్ కృషి ఉందని అన్నారు. విశిష్ట సేవలందించిన నరసింహారెడ్డి, మాలె సంజీవరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి, పీఆర్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, నాయకులు తిరుపతిరెడ్డి, గోవర్ధన్ యాదవ్, మహేందర్‌రెడ్డి, ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, విద్యాసాగర్, కృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోపాలుంటే సరిచేస్తాం.. ధరణిని రద్దుచేయం

(మొదటిపేజీ తరువాయి)

చేయడం, ప్రగతి భవన్‌ను బద్దలు కొట్టడం, బాంబులతో పేల్చేయాలనడం కాంగ్రెస్ విధానామా? అని కాంగ్రెస్ సభ్యులను ప్రశ్నించారు. ఆరేండ్లలో 30 లక్షల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అయ్యాయనీ, ధరణి తెచ్చిన ఏడాదిన్నర కాలంలోనే 23.92 లక్షల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయని వివరించారు. ధరణిలోని చిన్నచిన్న లోపాలను భూతద్దంలో పెట్టి చూపించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. ధరణిని రద్దు చేయడమే కాంగ్రెస్ పార్టీ విధానమైతే స్పష్టం చెప్పాలని అడిగారు. ఆ పార్టీ హయాంలో లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చేయకుండా రైతులను రాక్షసంగా ఇబ్బంది పెట్టినట్టే ఇప్పుడు కూడా ఇబ్బంది పెట్టాలనుకుంటున్నారా? అదే అయితే చెప్పండి? అని ప్రశ్నించారు. ఏదో అవకాశం దొరికింది..రాజకీయంగా చేయాలిగనుక విమర్శ చేద్దామనుకునే ధోరణి విడనాడి అర్థవంతంగా చర్చలో పాల్గొనాలని హితవు పలికారు. ఫార్మాసిటీకి రైతుల నుంచి రూ.8 లక్షల భూమిని తీసుకుని రూ.1.38 కోట్లకు ప్రభుత్వం ఎక్కడ అమ్మిందో ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. సభను పక్కదోవ పట్టించే వ్యాఖ్యలు చేయొద్దన్నారు. అసత్యపు మాటల్ని వెనక్కి తీసుకోవాలని దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. ఒకవేళ ఆయన వెనక్కి తీసుకోకపోతే రికార్డుల నుంచి తొలగించాలంటూ స్పీకర్‌కు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రగతి భవన్‌ను పేల్చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు దుర్మార్గంగా మాట్లాడుతున్నారనీ, ఆయన్ను సమర్థించేలా సభలో కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతున్నారని విమర్శించారు. అసలు ఆ పార్టీకి అంటూ ఒక వైఖరి ఉందా?అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల నోట్లో నుంచి ఒక్క పాజిటివ్ మాట కూడా రావడం లేదని విమర్శించారు. అందుకే అది ఎక్కడా కాకుండా పోతుందనీ, వారికి ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ఆ పార్టీ తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు.

**టైటిల్ గ్యారంటీ యాక్టు తేవాలి : దుద్దిళ్ల**

రాష్ట్రంలో టైటిల్ గ్యారంటీ యాక్టు తేవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ధరణి సమస్యల పరిష్కారంపై సూచనలు, సలహాల కోసం అఖిలపక్షం సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. మాజీ సైనికుల భూములను నిషేధితజాబితా నుంచి తొలగించాలని కోరారు. ఆధార్ అనుసంధానం లేకుండా హక్కుల మార్పిడి జరగడం లేదని చెప్పారు. ఒకే డాక్యుమెంట్ ద్వారా గిఫ్ట్ ఇచ్చేలా చూడాలన్నారు. గుంట భూమి వివాదంలో ఉన్నా మొత్తం ఆ సర్వేనెంబర్లన్నింటినీ బ్లాక్‌లిస్టులో పెట్టడం తగదన్నారు. అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన భూములను తీసుకుని ఆక్షన్ చేయడం సరిగాదన్నారు. హరితహారం కోసం అసైన్డ్ భూములు తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం భూములను లాక్కుని కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నదని ఆరోపించారు. ఫార్మాసిటీలో రూ.8 లక్షలకు సేకరించిన భూమిని రాష్ట్ర సర్కారు రూ.కోటీ 38 లక్షలకు అమ్ముకున్నదని ఆరోపించారు. ప్రభుత్వం సేకరించిన భూములను తిరిగి రైతులకు అప్పగించాలని కోరారు. ల్యాండ్ సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం రూ.83 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిందనీ, ఇంత వరకు సర్వే ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో ల్యాండ్ సర్వే దాదాపు పూర్తికావచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తరేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. రైసుమిల్లర్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతున్నదని వాపోయారు. రైతులను మిల్లర్లు దోచుకుంటున్న తీరును సభలో వివరించారు. ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలనీ, ఇసుక లారీలు తిరగటం వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతు చేయాలని కోరారు.

**ఇసుకతో రూ.800 కోట్ల ఆదాయమొచ్చింది : ప్రశాంత్‌రెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదేండ్లలో ఇసుక ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.40 కోట్ల ఆదాయమొస్తే..టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక అది రూ.800 కోట్లకు చేరిందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి వివరించారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ సభ్యులొచ్చి ఇసుక మాఫియా అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ డబ్బులు ఎక్కడకు పోయాయి? అని ప్రశ్నించారు. పద్దులపై చర్చించకుండా ప్రతిదాన్ని రాజకీయం చేయడం ఆ పార్టీ సభ్యులకు అలవాటైపోయిందని విమర్శించారు.

**దుద్దిళ్ల వ్యాఖ్యలను తొలగిస్తున్నాం : స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి**

ఫార్మాసిటీ భూములపై కాంగ్రెస్ సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఆ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని ఆయన్ను పదేపదే సూచించినా వెనక్కి తగ్గకపోవడం సరిగాదన్నారు.'సమయం ఇవ్వటం లేదంటారు. ఇస్తే వినియోగించుకోరు. నిమిషం అంటారు ఐదు నిమిషాలు మాట్లాడుతున్నరు. నేను మంత్రి ఉన్నప్పుడు భూముల సమస్యపై దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎప్పుడు, ఎక్కడ మాట్లాడాడో నాకైతే తెలియదు. మాట్లాడినట్టు చెప్పడం సరిగాదు' అని స్పీకర్ అన్నారు.

### ఆయిల్ ట్యాంకు శుభ్రం చేస్తుండగా..
# ఏపీలో ఊపిరాడక ఏడుగురు కార్మికులు మృతి



**కాకినాడ :** కాకినాడ జిల్లాలో బుధవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఆయిల్ కంపెనీకి చెందిన పరిశ్రమలో ఆయిల్ ట్యాంకర్ క్లీన్ చేయడానికి దిగి ఊపిరి ఆడక ఏడుగురు కార్మికులు మృతి చెందారు. వీరిలో ఐదుగురు అల్లూరి సీతారామరాజు జిల్లాకు, మిగిలిన ఇద్దరూ కాకినాడ జిల్లాకు చెందినవారు. తోటి కార్మికులు, స్థానికులు, మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పెద్దాపురం మండలం జి.రాగంపేటలో అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ కంపెనీకి చెందిన పరిశ్రమను ఏడాది క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఉత్పత్తిని ప్రారంభించారు. బుధవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఫ్యాక్టరీలోని ఐదో నెంబరు ఆయిల్ ట్యాంకును శుభ్రం చేసేందుకు ప్యాకింగ్ సెక్షన్‌కు చెందిన ఇద్దరు కార్మికులను అందులోకి యాజమాన్యం దింపింది. 25 అడుగుల ఎత్తున్న ఈ ట్యాంకులోకి ఎలాంటి భద్రతా పరికరాలు ఇవ్వకుండా కార్మికులను పంపింది. వారు రాకపోయే సరికి మరో ఇద్దరిని, ఆ తర్వాత మరో ఇద్దరిని ఇలా విడత విడతలుగా ఏడుగురుని ట్యాంకులోకి దింపింది. ట్యాంకులో దిగిన కార్మికుల్లో ఏ ఒక్కరూ బయటకు రాకపోవడంతో తోటి కార్మికులు అనుమానం వచ్చి చూసేసరికి అందులో వారు విగత జీవులుగా పడి ఉన్నారు. ఘాటైన వాయువుల వల్ల ఊపిరాడక మృతి చెందారని తోటి కార్మికులు తెలిపారు. ట్యాంకు కింది భాగాన్ని కట్ చేసి మృతదేహాలను బయటకు తీశారు. మృతుల్లో పాడేరుకు చెందిన వెచ్చంగి కృష్ణ (35), వెచ్చంగి నరసింహ (38), వెచ్చంగి సాగర్ (20), కురతాడు బంజుబాబు (26), కుర్ర రామారావు (43), కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన కట్టమూరి జగదీష్ (25), యల్లమిల్లి దుర్గాప్రసాద్ (27) ఉన్నారు. వీరిలో కృష్ణ, నరసింహ, సాగర్ ఒకే కుటుంబానికి చెందిన వారు. ప్రమాద విషయం తెలియగానే పొలిమేరు గ్రామం నుంచి మృతులు బంధువులు ఫ్యాక్టరీకి చేరుకున్నారు. వారి రోదనలతో అక్కడ తీవ్ర విషాదం నెలకొంది. ఘటనా స్థలాన్ని కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ రవీంద్రనాథ్ బాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తదితరులు సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు పోలీసులు తరలించారు.. ఈ ఘటనకు యాజమాన్య నిర్లక్ష్యమే సీపీఐ(ఎం) సీఐటీయూ (ఏపీ)లు కారణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మృతులకు సంబంధించి ఒక్కొక్క కుటుంబానికీ ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున, ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.25 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాయి. మొత్తంగా ఒక్కొక్క కుటుంబానికీ రూ.50 లక్షలు నష్టపరిహారం అందనుందని కలెక్టర్ తెలిపారు.

# పసుపు రేటు ఢమాల్

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్‌కు ప్రతిరోజూ ఐదు వేల క్వింటాళ్ల పసుపు వచ్చి చేరుతోంది. గతేడాది గరిష్ట ధర రూ.9800 వరకు పలకగా.. ప్రస్తుతం గురువారం రైతు లకు వచ్చిన గరిష్ట ధర రూ.5910 కావడం గమనార్హం. ఇక కనిష్టంగా రూ.4000 పలుకుతోంది. సగటున రూ.5050 వరకు ధర వస్తోంది. మెజార్టీ రైతులకు రూ.4500 నుంచి రూ.5000 వరకు మాత్రమే ధర పలుకుతోంది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారి పంట మార్కెట్‌కు రాగానే ధరలు తగ్గిపోతున్నాయని వాపోతున్నారు. ప్రస్తుత ధరతో క్రమ్ముకు రూ.1200 వరకు నష్టపోతున్నామని చెబుతున్నారు. నిజామాబాద్ మార్కెట్‌కు ఆర్మూర్ డివిజన్‌తో పాటు జగిత్యాల, మెట్‌పల్లి నుంచి కూడా రైతులు పసుపు తీసుకొస్తున్నారు. చివరకు తమకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదని చెబుతున్నారు.

**ఈ-నామ్ ఉన్నా ధరలు సున్నా..**

ఈ-నామ్ విధానంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందని అధికారులు, నాయకులు చెబుతున్నప్పటికీ.. ఆ ప్రయోజనం పసుపు రైతులకు దక్కడం లేదు. దేశంలో ఎక్కడి నుంచైనా వ్యాపారులు తమ పంటలను కొనుగోలు చేస్తారన్నది ఉత్తమాటగానే మిగిలింది. ఈ యేడాది పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**క్వింటాకు రూ.4060 మాత్రమే వచ్చింది : ఈ లింగారెడ్డి, ఇబ్రహింపట్నం, జగిత్యాల**

ఈ సంవత్సరం రెండు ఎకరాల 5 గుంటల్లో పసుపు పంట సాగు చేశాను. నిజామాబాద్ మార్కెట్‌కు పంట విక్రయానికి తీసుకొస్తే క్వింటాకు కేవలం రూ.4060 మాత్రమే పలికింది. గతేడాది క్వింటాకు రూ.8400 ధర వచ్చింది.

**పంట సాగు తగ్గిస్తాం : రాజరెడ్డి**

పసుపు పంటతో ప్రతియేడాది లాభాల కన్నా నష్టాలు ఎక్కువ అవుతున్నాయి. పంట చేతికి వచ్చిన సమయంలో రేట్లు పడిపోతున్నాయి. ఇది ఓ తంతుగా జరుగుతోంది. అందుకే పసుపు పంట సాగు తగ్గిస్తున్నాం. గతేడాది మూడు ఎకరాల్లో పంట సాగు చేస్తే.. ఈ రెండు ఎకరాలకు తగ్గించాను. వచ్చే యేడాది పూర్తిగా మానేస్తాను. క్వింటాకు రూ.4500 ధర పలికింది.

## సింగరేణిపై కేంద్రం కుట్రలను భగ్నం చేస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణి సంస్థను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు చూస్తున్న కేంద్రం కుట్రలను భగ్నం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. గురువారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనులను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలంటూ సీఎం కేసీఆర్, ప్రధాని మోడీకి లేఖ రాస్తే.. వాటిని వేలం వేస్తున్నామంటూ మోడీ చెప్పారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కార్మికుల కోసం అవసరమైతే ఎంత దూరమైనా పోతాం.. కేంద్రం కుట్రలను అడ్డుకుంటామని స్పష్టంచేశారు. కార్మికులను, అన్ని రాజకీయ పక్షాలను కలుపుకుని ఐక్య ఉద్యమానికి శ్రీకారం చుడతామని చెప్పారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ విషయంలో కేంద్రం నిస్సిగ్గుగా మాట తప్పిందని విమర్శించారు. అక్కడ ఉక్కు నిక్షేపాలు లేవంటూ కేంద్ర మంత్రి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రత్యామ్నాయాలను ఆలోచిస్తున్నామని వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన వరల్డ్ ఎకానమిక్ ఫోరంలో కూడా జిందాల్, మిట్టల్ కంపెనీలతో ప్రాథమికంగా సంప్రదింపులు జరిపామని చెప్పారు. కేంద్రం ముందుకు రాకపోతే ప్రయివేటు రంగం లేదా సింగరేణి ద్వారానైనా బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.


# రైతు, వ్యవసాయ, కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్

- దేశవ్యాప్తంగా బ్లాక్ డే విజయవంతం
- 300 జిల్లాల్లోని 12 వేలకు పైగా గ్రామాల్లో బడ్జెట్ ప్రతులు దగ్ధం

**న్యూఢిల్లీ :** రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యుయూ) ఇచ్చిన బ్లాక్ డే పిలుపు దేశవ్యాప్తంగా విజయవంతమైంది. దేశవ్యాప్తంగా వేలాది మంది రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఆందోళనలో భాగమయ్యారు. 300 జిల్లాల్లోని 12 వేలకు పైగా గ్రామాల్లో బడ్జెట్ ప్రతులను దహనంచేశారు. కొన్ని గ్రామాల్లో ప్రధాని దిష్టిబొమ్మలను కూడా దహనం చేశారు. బహిరంగ సభల్లో రైతులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని కార్పొరేట్ అనుకూల విధానాలపై పోరాడతామని కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. నిరసనలను ఉద్దేశించి ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యుయూ నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ, సామాజిక రంగాలకు బడ్జెట్ కేటాయింపులను భారీగా తగ్గించడం రైతాంగం, గ్రామీణ శ్రామిక వర్గాల బాధలను తీవ్రతరం చేస్తుందని విమర్శించారు. వ్యవసాయం కోసం బడ్జెట్ అంచనా 2022-23లో రూ.1,24,000 కోట్ల నుంచి ఈ ఏడాది రూ.1,15,531 కోట్లకు గణనీయంగా తగ్గిందని అన్నారు. అదేవిధంగా, ఉపాధి హామీ కోసం కేటాయింపులు 2022-23 సవరించిన అంచనాలో రూ.89,000 కోట్ల నుంచి ఈ బడ్జెట్‌లో రూ.60,000 కోట్లకు తగ్గించారని విమర్శించారు. సవరించిన అంచనా ప్రకారం 2022-23లో రూ.2,25,000 కోట్లుగా ఉన్న ఎరువుల సబ్సిడీలను ఈ ఏడాది రూ.1,75,000 కోట్లకు భారీగా తగ్గించారనీ, 2022-23 సవరించిన అంచనాలో మార్కెట్ జోక్యం, మద్దతు ధర పథకానికి రూ.1,500 కోట్ల కేటాయించారనీ, 2023-24 బడ్జెట్ అంచనాలో ఎలాంటి ప్రస్తావన లేదని విమర్శించారు. ఫిబ్రవరి 13న కేరళ, ఫిబ్రవరి 11న తమిళనాడులో బ్లాక్‌డేగా జరుపుతారని ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, ఏఐఏడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. విజయరాఘవన్, బి వెంకట్‌లు తెలిపారు.

# శ్రీశైలంలో 50 టీఎంసీలే..

- విద్యుత్‌కు వినియోగిస్తే.. సాగు, తాగునీటికి కష్టం
- ముచ్చుమర్రి దగ్గర ఆగని నీటి వాడకం
- కనీస స్థాయికి పడిపోయిన నీటి నిల్వలు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

వేసవితోపాటే తాగు, సాగు నీటి సమస్య దగ్గరవుతోంది.. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు రబీలో సాగునీరందించే కల్వకుర్తి ఎత్తిపోతలకు నీరు ఇచ్చే శ్రీశైలం రిజర్వాయరు వట్టిపోతోంది. 215 టీఎంసీలకు ఇప్పుడు మిగిలింది 50 టీఎంసీలు మాత్రమే. ఆవిరి, లీకేజీలు పోను మిగిలేది 40 టీఎంసీలు మాత్రమే. తెలుగు రాష్ట్రాలు ఇప్పటికీ విద్యుత్ తయారీ ఆపకపోవడం వల్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తాగు, సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో క్రమంగా రిజర్వాయర్లలో నీరు తగ్గిపోతోంది. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరిచ్చేందుకు సైతం రిజర్వాయర్లలో నీరు అందుబాటులో ఉండే అవకాశాలు లేవు. ప్రధానంగా శ్రీశైలం రిజర్వాయరులో 215 టీఎంసీలకు ప్రస్తుతం 50 టిఎంసీలు మాత్రమే మిగిలి ఉన్నాయి. గతేడాది వేసవిలో తగిన నీరు అందుబాటులో లేక శ్రీశైలం నుంచి దిగువకు పోయిన నీటిని తిరిగి పంపింగ్ చేసుకొని వాడుకొనే పరిస్థితి వచ్చింది. ఈసారి ఇప్పటికే రిజర్వాయరులో నీటిమట్టం కనీస స్థాయికి పడిపోయాయి. అయినా.. తెలుగు రాష్ట్రాలు విద్యుత్ తయారీ ఆపడం లేదు. 30 టీఎంసీల డెడ్ స్టోరేజీ దగ్గర నీటి నిల్వను నిలిపేయాల్సింది. మిగిలిన నీటిని విద్యుత్‌కు గాకుండా తాగు, సాగు నీటికి ఉపయోగించాల్సి ఉన్నది. వేసవిలో తాగునీటితోపాటు పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా శ్రీశైలం ఎగువన ముచ్చుమర్రితో పాటు పోతిరెడ్డిపాడు ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నీటిని వాడటం వల్ల వేసవిలో నీటి సమస్య వస్తుందనే విమర్శలు ఉన్నాయి.

**ప్రధాన నీటి వనరులదీ అదే పరిస్థితి**

జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులైన ఎల్లూరులో 8.865 టీఎంసీల నీరు ఉంది. జూరాల 1.4, కోయిల్ సాగర్ 1.3, రామన్‌పాడు 1.2, గోపల్‌దిన్నే 0.110, శంకర్‌సముద్రం 0.120 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఇవి ప్రస్తుతం సాగు నీటితోపాటు తాగునీటికి ఉపయోగ పడుతున్నాయి. జిల్లాలో 71 మండలాలు 2137 ఆవాసాలకు అవసరమైన తాగు నీటిని అందించాల్సి ఉంది. ఐదు జిల్లాలకు వేసవి మూడు 14 టీఎంసీల నీరు అవసరముంటుంది.

**రబీ సాగుకు తప్పని కష్టాలు**

ఉమ్మడి జిల్లాలో ఏటా రబీ సాగుకు కష్టాలు తప్పడం లేదు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో వరి పంట అధికంగా సాగువుతోంది. ఎక్కువ మంది రైతులు మిర్చి, వేరుశనగ పంటలను కెఎల్ఐ కాల్వల ద్వారా వచ్చే నీటి ఆధారంగా సాగు చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గడం వల్ల సాగు నీరు ఇవ్వడం కష్టమని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే వనపర్తి, కొల్లాపూర్ పరిధిలో ఉండే భూములకు వచ్చే జూరాల నీటికి వారబందీ పెట్టారు. వారం రోజులు సాగు నీళ్ల వస్తే.. మరో వారం రోజులు నిలిపేస్తారు. ఇక వీపనగండ్ల, పెబ్బేరు, చిన్నంబావి వంటి చివరి ఆయకట్టుకు సాగునీరు రావడం లేదు. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చేవరకు పొలాలకు సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**పాలక వర్గాలకు ముందు చూపు కరువు**
**నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే నాగం జనార్థన్‌రెడ్డి**

రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి విషయంలో ఒక విధానం అంటూ లేకుండా పోయింది. నీళ్లు ఉన్నప్పుడు విచ్చలవిడిగా వాడటం సరికాదు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి వల్ల సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా మారనున్నది. ఈ సమస్య నుంచి బయటపడే మార్గం చూడాలి.

### హెచ్‌ఈఓ పోస్టులపై
# జీవోను విడుదల చేయాలి

- కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కళాశాల ఎదుట విద్యార్థుల ధర్నా



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఉద్యాన రంగాల్లో హెచ్‌ఈఓ పోస్టుల భర్తీకై వెంటనే జీవోను విడుదల చేయాలని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కళాశాల ఎదుట విద్యార్థులు గురువారం ధర్నా నిర్వహించారు. హెచ్‌ఈఓ పోస్టుల భర్తీకై ప్రభుత్వం స్పష్టమైన హామీ వచ్చే వరకూ ధర్నా విరమించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఉద్యానవన యూనివర్సిటీ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఉద్యోగాల నియామకాలకు ఎలాంటి నోటిఫికేషన్ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగాలు లేకపోతే తాము చదివి ఏం లాభం అని వాపోతున్నారు. వ్యవసాయం, వెటర్నరీలలో విస్తరణ అధికారులను ప్రభుత్వం నియమించి ఉద్యానవన రంగంలో ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ధర్నా విరమించకపోవడంతో యూనివర్సిటీ అధికారులు హాస్టల్, మెస్‌కు తాళం వేశారు. అయినా విద్యార్థులు ధర్నా కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీ విషయం తమ పరిధిలో లేదని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు.

# హుస్సేన్‌సాగర్‌లో అతిపెద్ద ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్

- రూ.17.2 కోట్లతో ఏర్పాటు చేసిన హెచ్ఎండీఏ
- ప్రారంభించిన మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

జంట నగరాలను కలిపే చారిత్రాత్మక హుస్సేన్‌సాగర్ బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ (బిపిపి) పరిసరాలను అత్యంత ఆకర్షణీయంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. హుస్సేన్‌సాగర్, లుంబినీ పార్క్ సమీపంలో రూ.17.2 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ రూపొందించిన ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్‌ను మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ గురువారం ప్రారంభించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయరెడ్డి, ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అరవింద్ కుమార్‌తో కలిసి మ్యూజికల్ ఫౌంటెన్‌ను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి అపూర్వ ఆదరణ ఉందని, ట్యాంక్ బండ్ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంత్రి కేటీఆర్ ఆలోచనలకనుగుణంగా హెచ్ఎండీఏ అధికారులు ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారని అభినందించారు. ఇప్పటివరకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మంత్రి కేటీఆర్ ఆదేశాలతో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మెట్రోపాలిటన్ కమిషనర్ అరవింద్‌కుమార్ పర్యవేక్షణలో అతి తక్కువ సమయంలో హుస్సేన్‌సాగర్‌లో అతిపెద్ద ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్ రూ.17.2 కోట్లతో హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే ట్యాంక్‌బండ్ సుందరీకరణ (బ్యూటిఫికేషన్) పనులను హెచ్ఎండీఏ విజయవంతంగా పూర్తి చేసిన విషయం తెలిసిందే. పీవీ మార్గ్ (నెక్లెస్ రోడ్)వెంట మరికొన్ని ఆకర్షణీయమైన అంశాలను చేకూర్చేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోందన్నారు.

## గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- కేంద్రాన్ని డిమాండ్ చేసిన శంకర్‌నాయక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ ఇచ్చిందనీ, దానికి కేంద్రం ఆమోదం తెలపడం లేదని బీఆర్ఎస్ శాసనసభ్యులు శంకర్‌నాయక్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన బంధు పథకాన్ని అమలు చేయాలని కోరారు. గురువారం బడ్జెట్ పద్దులపై చర్చలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ గిరిజనులకు 101 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నారని తెలిపారు. బంజారాహిల్స్‌లో 'బంజారాభవన్' నిర్మించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## వక్ఫ్‌బోర్డుపై సీబీసీఐడీ విచారణ జరిపించాలి

### ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వక్ఫ్‌బోర్డు అవినీతి, అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మూడేండ్ల కిందటే సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల అద్దెలపై కలెక్టర్లు సమీక్షించాలని కోరారు. పాత అద్దెలు వసూలు చేయడం ద్వారా వక్ఫ్‌బోర్డుకు ఆదాయం రావడం లేదన్నారు. శాఖలో కొంత మంది అధికారులు పాతుకుపోయారనీ, ముఖ్యంగా అకౌంట్ ఆఫీసర్ 15 ఏండ్లుగా ఏ ప్రతిపాదికన కొనసాగుతున్నారని ప్రశ్నించారు. నూతన వక్ఫ్‌బోర్డు నిర్మాణానికి స్థలం కేటాయించినప్పటికీ ఎందుకు పనులు మొదలు పెట్టడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో ముస్లింలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింలకు పూర్తి రక్షణ కల్పిస్తున్నదని చెప్పారు. ఎంఐఎం ముస్లిం హక్కుల కోసం మాత్రమే కాకుండా హిందూ, సిక్కు, క్రిష్టియన్ మతాలకు చెందిన పౌరుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నదని చెప్పారు. స్కాలర్‌షిప్‌లు సమానంగా ఇవ్వడంలో ముస్లిం పట్ల వివక్ష కనిపిస్తున్నదన్నారు. ఆలయాలు, మసీదు, మఠాలకు సంబంధించిన భూముల రికార్డులు పరిషయన్ భాషలో ఉన్నాయనీ, ఆ రికార్డులను తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లోకి తర్జుమా చేయాలని కోరారు. సివిల్ సర్వీస్ విద్యార్థుల కోసం కోచింగ్ సెంటర్‌ను నిర్మించాలని తెలిపారు.

## రేషన్ డీలర్లకు ఔట్‌సోర్సింగ్ వేతనం ఇవ్వాలి

### బీఆర్ఎస్ శాసనసభ్యులు నన్నపనేని నరేందర్

రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు ఔట్‌సోర్సింగ్ కార్మికుల తరహాలో వేతనాలు చెల్లించాలనీ, లేదంటే కమీషన్ పెంచాలని బీఆర్ఎస్ శాసనసభ్యులు నన్నపనేని నరేందర్ డిమాండ్ చేశారు. కరోనా కాలంలోనూ వారు పేదలకు బియ్యాన్ని అందించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో బీసీలు ఆత్మగౌవరంతో బతుకుతున్నారని చెప్పారు. నామినేటేడ్ పదవులకు కూడా ఎన్నో ఇచ్చారని తెలిపారు. గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి పెరిగిందన్నారు. వివిధ కారణాలతో వృత్తిదారులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ 6 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నదని చెప్పారు.

## సాధాబైలామా దరఖాస్తులపై తగిన నిర్ణయం తీసుకోవాలి

### బీజేపీ శాసనసభ్యులు రఘునందన్‌రావు

భూముల క్రయ విక్రయాల కోసం సాధాబైలామా దరఖాస్తులపై తగిన నిర్ణయం తీసుకోవాలని బీజేపీ శాసనసభ్యులు రఘునందన్‌రావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అసైన్డ్ భూములను లాక్కుంటుందన్నారు. చాలా గ్రామాల్లో రైతుల భూములను అడవిగా చూపించారని తెలిపారు. ధరణిలో భూములు నమోదు కాలేదనీ, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనాథ పిల్లలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. వివిధ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని కోరారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు కేటాయించిన వెయ్యి కోట్ల రూపాయాల్లో ఎంత ఖర్చైయింది. లబ్దిదారులు ఎంత మంది ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్ కిట్ అద్భుతం

### బీఆర్ఎస్ శాసనసభ్యులు ఆనంద్

మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేసీఆర్ కిట్ అద్భుతమని బీఆర్ఎస్ శాససనభ్యులు ఆనంద్‌కుమార్ చెప్పారు. కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. మహిళలు, పిల్లల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ చేసుకున్న చర్యలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రులకు గర్భిణీలు వస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో పేదలకు న్యాయం జరుగుతున్నదని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ విమర్శలు చేస్తున్నాయి తప్ప అధికారంలో ఉన్న సమయంలో పేదల గురించి ఆలోచించలేదని విమర్శించారు.

## రేవంత్‌రెడ్డికి వస్తున్న నష్టం ఏంది?

### మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'నిజాం రాజులు నిర్మించిన నిర్మాణాలు మనం వాడుకుంటున్నాం. సెక్రటేరియట్‌లాంటి గొప్ప నిర్మాణం కడితే రేవంత్‌రెడ్డికి వస్తున్న నష్టం ఏంది? రంగులు వేసి బతికేటోనివి. రియల్ ఎస్టేట్ వాళ్లను భయపెట్టి సొమ్ము చేసుకునే వాడివి నువ్వు. నీకు క్యారెక్టర్ లేదు. అప్పుడు టీడీపీని, ఇప్పుడు కాంగ్రెస్‌ను తుంగలో తొక్కుతున్నవు. నువ్వు మావోయిస్టువా? నేను సైగ చేసి ఉంటే మానుకోట రాళ్ల రుచి చూసే వానివి. శంకర్ నాయక్ చరిత్ర తెలుసా నీకు? 70 ఏండ్లు ఓట్లను దండుకున్న మీరు రైతులు, గిరిజనుల గురించి ఆలోచించలేదు. దేశంలో ఎక్కడికి పోదామో చెప్పు 70 యేండ్ల మీ ప్రభుత్వం ఏ అభివృద్ధి చేసిందో చూపెట్టు. ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టినందుకు రాజశేఖర్‌రెడ్డిని పొగిడిన చరిత్ర కేసీఆర్‌ది. ఒక ఇంజినీర్‌గా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. ఎర్రబెల్లి గురించి నీకు ఏం తెలుసని మాట్లాడుతున్నావు. వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ఆయనది. గొప్ప చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి నీలాంటి సన్యాసులు వచ్చి ఆ పార్టీని నాశనం చేశారు. భట్టి, ఉత్తమ్‌లాంటి వారు కాంగ్రెస్ పార్టీని బతికించే ప్రయత్నం చేస్తున్నారు. నువ్వేం చేస్తావో అది మాట్లాడు. కేసీఆర్ గురించి, కుటుంబం గురించి మాట్లాడితే ఖబడ్దార్..'

# ఏప్రిల్ 6న చలో పార్లమెంట్

## అఖిల భారత చెరుకు రైతుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డి.రవీంద్రన్




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు చెరుకు ధర నిర్ణయించాలనీ, టన్నుకు రూ.5వేలకు తగ్గకుండా ధర కల్పించాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 6న చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నామని అఖిల భారత చెరుకు రైతుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డి. రవీంద్రన్ చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 10.25 శాతం రికవరీ కోసం టన్ను చెరుకు ధరను రూ.3050, 9.5 శాతం రికవరీకి టన్నుకు రూ.2821 ధరను ప్రకటించిందని తెలిపారు. కేంద్రం ఈరకంగా టన్నుకు రూ.150 ధర పెంచిందనీ, రికవరీ రేటును కూడా 0.25శాతం పెంచిందన్నారు. అయితే డీజిల్, యంత్రాలు, ఎరువుల ధరల పెరుగుదల కారణంగా చెరుకు ఉత్పత్తి ఖర్చు పెద్ద ఎత్తున పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కేంద్రం పెంచిన ధర ఏ మూలకూ సరిపోవడం లేదన్నారు. ఈ రకంగా మోడీ సర్కారు చెరుకు రైతులకు ద్రోహం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేశవ్యాప్తంగా ఐదు కోట్ల మందికి పైగా చెరుకు రైతులకు, 50 లక్షల మంది కార్మికులకు నిరాశే మిగిలిందని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం టన్ను చెరుకుకు రూ.5,000 ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ చెరుకు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బొంతు రాంబాబు మాట్లాడుతూ...రాష్ట్రంలో చెరుకు సాగు విస్తీర్ణం సగానికి పడిపోయిందన్నారు. సాగుదారుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో మూడు చక్కెర పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. డ్రిప్ ఇరిగేషన్, రోటవేటర్, హార్వెస్టర్లను సబ్సిడీ ద్వారా అందించాలనీ, సమగ్ర చెరుకు విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కేటీఆర్ భూ కబ్జాకోరు

- ఆరోపణలపై విచారణ జరిపించాలి
- అరెస్టులకు భయపడేది లేదు
- ప్రగతి భవన్‌ను.. అంబేద్కర్ స్టడీ సెంటర్‌గా మారుస్తాం: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఆర్ఐ కంపెనీలను బెదిరించి వంద ఎకరాల భూమిని తన మిత్రులు, దళారుల పేర్లతో బదలాయించి వేలకోట్లు కొల్లగొట్టిన ఐటీ, పురపాలక శాఖ మంత్రి (డ్రామారావు (కేటీఆర్) తనని దందాలకు పాల్పడుతున్నాడని అసెంబ్లీ వేదికగా అనటం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ధరణి పేరుతో ఎన్నో కుంభకోణాలకు అడ్డాగా మారిన తెలంగాణను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విముక్తులను చేస్తామని తెలిపారు. రేవంత్‌రెడ్డి చేపట్టిన 'హాత్ సే హాత్' జోడో యాత్ర మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి గురువారం చేరుకుంది. అసెంబ్లీలో మంత్రి కేటీఆర్, ఢిల్లీలో ఎంపీ మాలోత్ కవిత తనపై చేసిన ఆరోపణలకు రేవంత్‌రెడ్డి మీడియా ముఖంగా కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి అనే వ్యక్తి సమాచార చట్టాన్ని వాడుకుని భూదందాలకు పాల్పడుతున్నాడని మంత్రి డ్రామారావు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ధరణి లోపాలను, దందాలను త్వరలోనే బయట పెడతామని, తాము అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామని స్పష్టంచేశారు. ఆర్టీఐ చట్టం ద్వారా ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న కబ్జాలు, దందాలు వెలికితీస్తున్న తనపై అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు కొడుకు చేసే అక్రమాలు తెలియకుండా ఉన్నాయా ? ధృతరాష్ట్రుడిలా కండ్లు మూసుకుని ఉన్నాడా? అంటూ కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కేసీఆర్ కుటుంబం 2014 నుంచి ఇప్పటి వరకు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రయివేటు భూములుగా మార్చారని, వీటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవినీతి, కుంభకోణాలకు పాల్పడిన ప్రతి కలెక్టర్‌ను కటకటాల్లోకి నెడుతుందన్నారు. ధరణి పోర్టల్ అనేది ఐఅండ్ఎఫ్ఎస్ కంపెనీకి ఇచ్చి ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేశారన్నారు. ధరణి పోర్టల్ ద్వారా సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కేటీఆర్ చేసిన భూదందాలపై విచారణ జరిపించాలన్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో కేసులు పెట్టారని, ఎన్నోసార్లు అరెస్టులు చేశారని, అరెస్టులకు ఎన్నడూ భయపడలేదన్నారు. యాత్ర విజయవంతం అయితే కేసీఆర్ ప్రభుత్వం కూలడం ఖాయమని భయపడి ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు కుట్రలు పన్నుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ప్రగతి భవన్‌ను.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌గా మార్చి తెలంగాణలోని యువతకు విజ్ఞాన కేంద్రంగా మారుస్తామని తెలిపారు.

#### మూడు నిర్దిష్ట ఆరోపణలపై విచారణ జరపాలి..

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న తెల్లపూర్ భూములు టిస్మన్‌స్పియర్ అనే అమెరికన్ కంపెనీని 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లకు పిలిచింది. ఆ సందర్భంలో రూ.460కోట్లు చెల్లించి కంపెనీ కొనుగోలు చేయగా, స్థానిక వివాదంతో ప్రాజెక్టు నిలిచిపోయిందన్నారు. అనంతరం తెలంగాణ ఏర్పడ్డాక 2021లో కేటీఆర్ అండ్ కంపెనీ బెదిరింపులకు పాల్పడి రూ.260కోట్లకు ప్రతిమ శ్రీనివాస్ పేరుతో కొనుగోలు చేయలేదా అని ప్రశ్నించారు. ఢిల్లీలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలన్నారు.

మియాపూర్ ప్రాంతంలో రూ.500కోట్ల విలువైన భూమి ఎలా వచ్చిందంటూ ప్రశ్నించారు. సర్వే నెం.80లో ఐదెకరాల భూమి ఎక్కడినుంచి వచ్చిందని, రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పలేదని, డాక్యుమెంట్ ప్రూఫ్‌తో మాట్లాడుతున్నానని, మీరు ఎక్కడికి రమ్మన్నా వచ్చి నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానంటూ అధికారులు ధ్రువీకరించిన పత్రాలు చూపిస్తూ సవాల్ విసిరారు.

# మధుసూదన్‌రెడ్డి అవినీతిపై సీఐడీ విచారణ చేపట్టాలి

- కార్పొరేట్ కాలేజీలకు అక్రమ ర్యాంకులపై 'లై డిటెక్టర్' నిర్వహించాలి
- ఇంటర్ పరీక్షలపై విద్యార్థుల్లో నమ్మకం కలిగించాలి
- సీఎం కేసీఆర్‌కు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మార్చిలో నిర్వహించబోయే ఇంటర్ వార్షిక పరీక్షలను నిజాయితీగా, నిక్కచ్చిగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టీఎస్‌జీసీసీఎల్ఏ-475) కోరింది. పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల్లో నమ్మకం కలిగించాలని సూచించింది. ఇంటర్ విద్య, బోర్డు కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు పి మధుసూదన్‌రెడ్డి చేసిన అవినీతిపై సీఐడీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు, ఇంటర్ బోర్డు చైర్మెన్, విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ గురువారం ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేట్ కాలేజీలకు అక్రమంగా ర్యాంకులు, మార్కులు రావడంపై మధుసూదన్‌రెడ్డిపై 'లై డిటెక్టర్' పరీక్షలను నిర్వహించాలని కోరారు. ఆయనకు సహకరించిన అధికారుల పాత్రను బహిరంగపర్చాలని డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ సీసీ కెమెరాల ట్యాంపరింగ్ జరిగిందంటూ ప్రకటించారని గుర్తు చేశారు. కార్యాలయ కంప్యూటర్ పాస్‌వర్డ్ ప్రైవేటుగా వాడుతున్నట్టు చెప్పారని పేర్కొన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు రాష్ట్రంలో పది లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. ఈ దశలో సస్పెండైన మధుసూదన్‌రెడ్డి ఇంటర్ బోర్డు ప్రతిష్టను మంటగలుపుతూ, అధికారులపై ఆరోపణలు చేయడం సరైంది కాదని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ చూపకుంటే ఇంటర్ పరీక్షలు, ఫలితాల్లో మళ్లీ గందరగోళం ఏర్పడే ప్రమాదముందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ గౌరవాన్ని దెబ్బతీయాలనుకుంటున్న ఇలాంటి కుట్రలను అరికట్టాలని కోరారు.

## కృష్ణానదిలో పడి ముగ్గురు యువకులు మృతి

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నల్లగొండ జిల్లా నాగార్జున్‌సాగర్ పైలాన్ కాలనీలోని వీఐపీ శివాలయం ఘాట్ వద్ద కృష్ణానదిలో గురువారం ముగ్గురు యువకులు మృతిచెందారు. వారు కుటుంబ సభ్యులతో కలిసి శివాలయంలో మూడ్రోజులపాటు పూజలు చేశారు. శుక్రవారం ఒడుగు కార్యక్రమంలో భాగంగా సాయంత్రం శివాలయం ఘాట్ వద్ద యువకులు స్నానానికి దిగారు.

అదే సమయంలో పవర్‌హౌజ్ టర్బైన్లు వదిలి పెట్టడంతో ఒక్కసారిగా నది ప్రవాహం పెరిగి ముగ్గురూ గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో నాగార్జునసాగర్ పైలాన్ కాలనికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఉప్పల చంద్రకాంత్(26), హరి కీర్తి నాగరాజు(39), వార్షత్‌పతి (26) ఉన్నారని పోలీసులు తెలిపారు. పోలీసులు, జెన్‌కో, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రికి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు.



# పంటలు ఎండుతున్నాయ్..

## కరెంటు కోతలపై రైతన్న ఆగ్రహం

- సబ్‌స్టేషన్ల ముట్టడి



నవతెలంగాణ-దిలావర్‌పూర్/ బెజ్జంకి

విద్యుత్ కోతలతో పైర్లు వాడుబడుతున్నాయి.. వారం పది రోజులుగా కరెంట్ కోతలపై రైతులు ఆందోళన చెందుతున్నారు.. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేస్తే.. నీరందక పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కోతలను నిరసిస్తూ గురువారం నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడించారు.

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌ను రైతులు ముట్టడించగా.. వారికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. అధికారులను నిలదీశారు. రోడ్డుపై బైటాయించి రెండు గంటల పాటు ధర్నా నిర్వహించి, ప్రజా రవాణాను అడ్డుకున్నారు. వారికి నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు దొడ్డికింది ముత్యంరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కోతలు లేని విద్యుత్ అందిస్తామని చెప్పినా ఆచర ణలో మాత్రం సాధ్యం కావడం లేదన్నారు. విచ్చల విడిగా కరెంట్ కోతలు విధి స్తోందని, పగటిపూట ఆరు గంటలు కూడా సరైన కరెంటు ఇవ్వలేని దుస్థితి నెల కొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమ యాల్లో కరెంటు ఇవ్వడంతో రైతులందరూ పంట పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. కరెంటు బిల్లులేమో సర్‌చార్జీల పేరుతో ఇష్టారీతిన వసూలు చేస్తున్నార న్నారు. సర్ చార్జీల పేరుతో అధిక విద్యుత్ బిల్లుల వసూలు చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కోతలు లేని విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ పాకాల గీత, ఏఈ శ్రీనివాస్ నిరసనకారులను బుజ్జగించే ప్రయత్నం చేసినా ధర్నా విరమించలేదు. సీఐ వెంకటేష్, డీఈ నాగరాజు ధర్నా స్థలానికి చేరుకుని ఇక నుంచి పగటిపూట విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమిం చారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ విరేష్‌కుమార్, రాంపూర్ సర్పంచ్ గోవింద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మంద మల్లేష్, భాగ్యారావు, ఉమాశంకర్, అరవింద్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

#### బేగంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా

సమయపాలన లేని విద్యుత్ సరఫరాతో వరిపైరు ఎండిపోతోందని రైతులు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని బేగంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. లక్ష్మీపూర్ గ్రామ రైతులు ధర్నా చేపట్టగా కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. తెగుళ్లు సోకిన పైరును కాపాడుకోవడానికి తంటాలు పడుతుంటే.. విద్యుత్ అధికారుల తీరువల్ల మొత్తానికే ఎండిపోతున్నాయని రైతులు అవేదన వ్యక్తం చేశారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసె వాసుల నిరసన దీక్షలు



నవతెలంగాణ-ఇల్లందు

ఖమ్మం జిల్లా ఇల్లందు పట్టణంలోని రాజీవ్ నగర్ శివారు ప్రాంతంలో మూడేండ్ల కిందట గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరవధిక దీక్షలు చేపట్టారు. దీక్షలను సామాజిక సంఘాల నేతలు ఈసం నరసింహారావు, కున్సోత్ రాము నాయక్, ఎస్కే ఖాదర్ (ఆవాజ్), మహ్మద్ రజాక్, మన్యం మోహన్ రావు, తాళ్లూరి కృష్ణ, కూకట్ల శంకర్, ఆర్‌బీ జనార్ధన రాజు, ఆలెటి కిరణ్ కుమార్, సుల్తానాలు ప్రారంభించి మాట్లాడారు. తాగునీరు, కరెంటు, ఇంటి నంబర్లు, ఇండ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రభుత్వ అధికారులు, పాలకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ నబీ, రాజీవ్ నగర్ పార్టీ శాఖ కార్యదర్శి దారావత్ రాందాస్, నాయకులు, గుడిసెవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రార్థనామందిరాలపై ప్రత్యేక చట్టం

- రక్షణశాఖ స్థలాల్లో కేంద్రం అనుమతులు ఇవ్వట్లేదు
- అసెంబ్లీలో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రార్థనా మందిరాల నిర్మాణంపై త్వరలో ప్రత్యేక చట్టం తెస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. గుజరాత్‌లో అప్పటి ముఖ్యమంత్రి, ఇప్పటి ప్రధాని నరేంద్రమోడీ ఈ తరహా చట్టాన్ని తెచ్చారనీ, దాన్ని అధ్యయనం చేసి, మార్పులు చేర్పులతో కొత్త చట్టాన్ని రూపొందిస్తామని తెలిపారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో గ్రేటర్ హైదరాబాద్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ సందర్భంగా ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా స్పందించారు. రోడ్ల విస్తరణకు ప్రార్థనామందిరాలు ప్రధాన అడ్డంకిగా ఉంటున్నాయనీ, దాన్ని అధిగమించేందుకు గుజరాత్ తరహా చట్టం తేవాలని సుధీర్‌రెడ్డి సభలో ప్రస్తావించారు. దానిపై మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ...'ఏ దేవుడూ, భక్తులు దుమ్మూ ధూళిలో ఉండాలని కోరుకోరు. రోడ్లకు అడ్డంగా ఉన్న ప్రార్థనామందిరాలను తొలగించి, మరో ప్రాంతంలో వాటిని ఏర్పాటు చేస్తాం' అని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ అభివృద్ధి పనులకు రక్షణ శాఖ స్థలాల్లో అనుమతులు ఇవ్వకపోవడంపై సభలో ప్రస్తావించారు. దీనిపై కూడా మంత్రి సమాధానం చెప్పారు. గడచిన ఎనిమిదన్నరేండ్లలో కంటోన్మెంట్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకోసం కేంద్ర రక్షణ శాఖ మంత్రుల్ని పలు దఫాలు కోరినా, సహకరించలేదని అన్నారు. 'నలుగురు కేంద్ర రక్షణ శాఖ మంత్రులు మారారు. వారందరికీ విన్నవించాం. ఎవరూ సహకరించలేదు. సమస్యను వివాదాస్పదం చేయదలుచుకోలేదు. రాష్ట్రంలోని రక్షణ శాఖ స్థలాలను కేంద్ర ప్రభుత్వానికి బదలాయించలేదనే వాస్తవాన్ని గమనించాలి' అని చెప్పారు. దేశరక్షణకు సంబంధించిన అంశం కాబట్టే తాము సంయమనంతో ఉంటున్నామనీ, అవసరమైతే దీనిపై న్యాయపోరాటానికీ సిద్ధంగా ఉన్నామన్నారు. రక్షణశాఖ స్థలాలు ఉన్న చోట్ల ఇతర పట్టణాలతో అభివృద్ధి పనుల అనుసంధానం జరగట్లేదన్నారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ) కింద జీహెచ్ఎంసీ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులను మంత్రి వివరించారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తమ నియోజకవర్గంలోని పనులను ప్రస్తావిస్తూ, వాటిని వేగవంతం చేయాలని కోరారు.

## తల్లి తలనరికిన తనయుడు

- ఆస్తి తగాదాలే కారణం..



నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

ఆస్తి తగాదాలతో తల్లిని అతికిరాతకంగా నరికి చంపిన సంఘటన జనగామ జిల్లా మరిగడి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూరాకుల రమణమ్మ (62)కు కుమారుడు కన్నప్ప, కూతురు లావణ్య ఉన్నారు. కొడుకు గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తూ జీవితాన్ని సాగిస్తున్నాడు. దాదాపు దశాబ్దం కిందటే ఆమె భర్త చనిపోగా ఉన్న వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ కూతురు, కొడుకులను పెంచి పెద్ద చేసి పెళ్లిండ్లు చేసింది. తనకున్న 10 ఎకరాల వ్యవసాయ భూమి నుంచి నాలుగెకరాలను కూతురు లావణ్య పేరిట ఇటీవల రిజిస్ట్రేషన్ చేసింది. అసలే చెల్లెలు కులం కాని వ్యక్తిని వివాహం చేసుకుందన్న కోపంతో ఉన్న కన్నప్పకు తన తల్లి చెల్లికి వ్యవసాయ భూమిని పంచి ఇవ్వడం నచ్చలేదు. అప్పటినుంచి తరచూ తల్లి, చెల్లెతో గొడవ పడుతుండేవాడు. ఇప్పటికే పలుమార్లు పోలీసులను ఆశ్రయించగా వారు సర్ది చెప్పి పంపారు. రెండు మూడు రోజులుగా ఇరువురు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ క్రమంలో కన్నప్ప తన చికెన్ సెంటర్లో ఉపయోగించే కత్తితో తల్లి తల నరకగా ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి తల పట్టుకొని ఇంటి ముందు గల్లీలో కొంతసేపు హాహాకారాలు చేశాడు. గ్రామస్తులు గమనించడంతో ద్విచక్రవాహనంపై జనగామకు వచ్చి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ యాదవ్, ఎస్ఐ రఘుపతి సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. క్లూస్ టీం రక్త నమునాలు సేకరించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా తగాదాల గురించి పలుమార్లు పోలీసులకు విన్నవించినా పట్టించుకోలేదని మృతురాలి కూతురు లావణ్య ఆరోపించింది. స్పందించిన ఏసీపీ.. కుటుంబ ఆస్తుల కలహాలతో వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చింది నిజమేనని, రెండు మూడు రోజులుగా ఇరువురికి కౌన్సెలింగ్ చేస్తున్నామని, చట్టపరంగా తాము తీసుకోవలసిన చర్యలు తీసుకున్నామని ఏసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు.

## పాఠశాలలో చెప్పులు వేసుకుంటుండగా.. పాము కాటుతో చిన్నారి మృతి

నవతెలంగాణ - పర్వతగిరి

పాము కాటుతో ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామ శివారు బట్టు తండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బట్టు మోహన్, పార్వతిలకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురు మన్విత (6) ఎప్పటిలాగే స్థానిక ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళింది. మధ్యాహ్నం బాలిక తరగతి గది నుంచి బయటకు వచ్చి చెప్పులు వేసుకుంటుండగా అక్కడే ఉన్న పాము కాటేసింది. వెంటనే తోటి విద్యార్థులు పాము కరిచిన విషయం ఉపాధ్యాయులకు తెలపగా హుటాహుటిన బాలికను హాస్పిటల్‌కు తరలించారు. మార్గమధ్యలోనే విద్యార్థిని మృతిచెందింది. బాలిక మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, పాఠశాల శిథిలావస్థకు చేరుకుని, ప్రహరీ, మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోవడంతో పాములు, తేళ్లకు నిలయాలుగా మారుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.


(ఫైల్)

సంపాదకీయం

# మాంద్యం మేఘాలు

'పెట్టుబడి'కి పుట్టినిల్లు అయిన ఇంగ్లండ్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలతో పాటు ప్రపంచమంతటా మాంద్యం మేఘాలు ఆవరించాయి. సంపద కేంద్రీకరణ వినాశకర విధానాల వల్ల ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న దశలో కోవిడ్ మహమ్మారి ముంచెత్తడం, లాక్‌డౌన్లు తదితర పరిణామాలతో మళ్లీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే

> ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి దారీ దేశాలను కుదిపేస్తున్న ప్రజాందోళనలకు కారణం ఆయా దేశాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలే. సంక్షోభం అనేది 'పెట్టుబడి' విత్తులోనే దాగుందన్నది మార్క్సిజం ఏనాడో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సంక్షేమ రాజ్య విధానాలు అనుసరించిన పెట్టుబడిదారీ దేశాలు.. ఆ తర్వాత థాచర్-రీగన్ సూత్రీకరణలతో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మార్కెట్‌కు దోచిపెట్టడమే ప్రధాన బాధ్యతగా నయా ఉదారవాద దోపిడీ మంత్రాంగాన్ని జపిస్తూవచ్చాయి.

ఎత్తుగడలనే పాలకులు అవలంబించడంతో ఎక్కడికక్కడ ఆర్థిక అసమానతలు పెరిగి సంక్షోభం మరింతగా ముదిరింది. బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం కారణంగా, రైల్వే సిబ్బంది, వైద్యులు, ఉపాధ్యాయులు, ఇతర రంగాల ఉద్యోగులు సమ్మెలతో హోరెత్తిస్తున్నారు. లక్షలాది మంది ప్రజానీకం వీధుల్లోకి వచ్చి సంఘీభావం తెలియజేస్తూ ప్రజా ఐక్యత చాటుతుండటం హర్షణీయం. ఫ్రాన్స్‌లో పెన్షన్ వయస్సును 64ఏండ్లకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ 11లక్షల మందికి పైగా కార్మికులు రెండు వారాల్లో రెండోసారి నిరసన చేపట్టారంటే ఆర్థిక సంక్షోభ ప్రభావాలు వారిపై ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆస్ట్రేలియాలో రవాణా కార్మికుల సమ్మె సైతం పెట్టుబడిదారీ దోపిడీపై వెల్లువెత్తుతున్న




ప్రజాగ్రహంలో నుంచి పుట్టుకొచ్చిందే. శ్రీలంక, ఆ తరువాత పాకిస్థాన్ ఇలా ఒక్కొక్కటిగా ఆసియా దేశాలు కూడా సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలతో భారత్ కూడా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోంది. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిందే దరిమిలా మౌలిక, సేవా, ఆహార రంగాలన్నింటిని అంబానీ, అదానీలకే దోచిపెడుతున్న వైనాన్ని చూస్తున్నాం. ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తున్న అదానీ కుంభకోణం... దానికి బ్యాంకులు, ఎల్ఐసీ వంటి విత్త సంస్థలు రూ.వేలాది కోట్లు రుణాలు కుమ్మరించినందున దేశ ఆర్థిక వ్యవస్థపై ఇంకెంతటి ప్రభావం చూపనుందో!

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి దారీ దేశాలను కుదిపేస్తున్న ప్రజాందోళనలకు కారణం ఆయా దేశాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలే. సంక్షోభం అనేది 'పెట్టుబడి' విత్తులోనే దాగుందన్నది మార్క్సిజం ఏనాడో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సంక్షేమ రాజ్య విధానాలు అనుసరించిన పెట్టుబడిదారీ దేశాలు.. ఆ తర్వాత థాచర్-రీగన్ సూత్రీకరణలతో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మార్కెట్‌కు దోచిపెట్టడమే ప్రధాన బాధ్యతగా నయా ఉదారవాద దోపిడీ మంత్రాంగాన్ని జపిస్తూవచ్చాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థల మాటున రుణాలు ఎరగా వేసి పేద, వర్ధమాన దేశాలను పెట్టుబడిదారీ దేశాలు నడ్డివిరుస్తూ వస్తున్నాయి. విత్త సంస్థల షరతులతో పాలకులు మోకరిల్లడంతో శ్రామికులు, రైతులు, సాధారణ ప్రజానీకం బతుకులు అగమ్యగోచరంగా మారిన సంగతి విదితమే. స్వేచ్ఛా వాణిజ్యం మాటున పెట్టుబడిదారీ గుత్తాధిపత్యానికి అన్ని రంగాలలో స్వేచ్ఛను అనుమతించడంతో ప్రపంచంలో అసమానతలను ఆకాశమంత పెరిగిపోయాయి.

ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలతో సహా ప్రస్తుత ఆర్థిక మాంద్యం మేఘాలు ఆవరించడానికి కోవిడ్‌ను, రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని పెట్టుబడిదారీ దేశాలు సాకుగా చెబుతున్నాయి. వాస్తవానికి 2008లో అమెరికాలో మొదలైన ప్రపంచ సంక్షోభానికి ఇది కొనసాగింపే తప్ప కొత్తగా పురుడుపోసుకున్నది కాదు. గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి పెద్ద టెక్ కంపెనీలన్నీ ఉద్యోగుల తొలగింపును ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. గత ఏడాది టెక్ కంపెనీలు లక్షన్నర మందికి పైగా ఉద్యోగులను ఇళ్లకు పంపినట్లు అంచనా. రోబోల కంటే హీనంగా వేతనజీవులను అమెజాన్ రాచిరంపాన పెడుతోందంటూ గతవారం బ్రిటన్‌లోని అమెజాన్ కార్మికులు సెంట్రల్ ఇంగ్లండ్‌లోని కంపెనీ గిడ్డంగి వద్ద సమ్మె చేపట్టారు. ఒక్క అమెజానే కాదు... కార్పొరేట్ కంపెనీలన్నీ ఇదే తీరుతో శ్రమదోపిడీకి పాల్పడుతున్నా..పాలకులు నోరు మెదపడం లేదు. సులభ వ్యాపార ర్యాంకింగ్‌లో పోటాపోటీగా కార్పొరేట్ సేవలో పునీతమవుతున్నారే మినహా కష్టజీవుల గోడుపట్టడం లేదు. భారత్‌లో ఆర్థిక సంక్షోభాన్ని కప్పిపుచ్చేందుకు జాతియత, మెజారిటీ మతోన్మాద ఆగడాల కత్తి దూస్తోంది. ఈ దరిమిలా విశాల ఐక్య వేదికలు నిర్మించి అటు కార్పొరేట్ దోపిడీనీ, ఇటు మతోన్మాద దాడులను తిప్పికొడితోనే ప్రజానీకానికి మనుగడ.

# కుల రక్కసి కరాళ నృత్యం అంతం చేద్దాం!

> నేను విప్లవ కారుణ్ణి. అన్ని దేశాలూ నావే. నిజమైన విప్లవ కారుడు ఓ అద్భుతమైన ప్రేమికుడై ఉంటాడని నేను చెప్తే మీకు కాస్త ఆశ్చర్యంగానే ఉండొచ్చు. కానీ, ప్రేమించే గుణాన్ని కోల్పోయిన వాడు ఎన్నటికీ గొప్ప విప్లవకారుడు కాలేడు. ప్రపంచంలో ఎక్కడ ఎవరికీ అన్యాయం జరిగినా మనం గాఢంగా ప్రతి స్పందించడం చాలా అవసరం. ప్రతి వారికీ ఉండి తీరాల్సిన అద్భుతమైన లక్షణం అదే!
>
> - చే గువేరా



డాక్టర్ దేవరాజు మహారాజు

కర్నూలు జిల్లాలో కులరక్కసి కరాళ నృత్యం చేస్తోంది. కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో వళ్ళు గగుర్పొడిచే నిజాలు బయటపడ్డాయి. సుమారు ఎనభైతొమ్మిది గ్రామాల్లో పదిహేను రకాల కులవివక్షలు కనిపించాయి. అరవైనాలుగు గ్రామాల్లో దళితులకు దేవాలయ ప్రవేశంలేదు. ముప్పయి గ్రామాల్లో దళితులు రచ్చబండపై కూర్చోవడానికి వీల్లేదు. ఇప్పటికీ అక్కడ ఏడు గ్రామాల్లో టీ కొట్లలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతూ ఉంది. ఆరు గ్రామాల్లో దళితుల్ని హోటళ్ళలోకి అసలే అనుమతించరు. ఇరవైఏడు గ్రామాల్లో చాకలివారు దళితుల బట్టలు ఉతకరు. తొమ్మిది గ్రామాల్లో క్షురకులు దళితులకు క్షవరం చేయరు. ఈ పనుల కోసం వారు సమీపంలోని పట్టణాలకు వెళుతున్నారు.

"జుట్టు కత్తిరించడం మంగలి యొక్క పవిత్రమైన ధర్మం కాదు. ఇది ఒక వ్యాపారం. చెప్పులు కుట్టడం మాదిగవాడి పవిత్ర ధర్మం కాదు. అది కూడా వ్యాపారమే! ప్రదర్శించే పూజలు, హోమాలు, ఉత్సవాలలో కూడా అది జరుగుతోంది. ఇది బ్రాహ్మణుడి పవిత్రమైన ధర్మమేమీ కాదు. అలా అనుకోవడం మన అజ్ఞానం. మన అజ్ఞానం మీదే బ్రాహ్మణుడికి తిని కూర్చునే పెద్ద వ్యాపారం జరుగుతూ ఉంది!" అని అన్నారు మహాత్మా జ్యోతిరావు పూలే. ఆధునికులుగా మనకు తోచకపోతే పోయింది. కనీసం కొందరు మహానుభావులు చెప్పిన దాంట్లోంచి సారాంశమైన గ్రహించాలి కదా? ఇదే విషయం మీద డాక్టర్ రామ్ మనోహర్‌లోహియా ఏం చెప్పారో గమనించండి... "బ్రాహ్మణులు, కోమట్లు, షేక్‌లు, సయ్యద్‌లు పెద్ద కులాలకు చెందినవారు. కమ్మరి, కుమ్మరి, మంగలి, చాకలి, సాలె, మాల, మాదిగలు చిన్న కులాల వారు. వీరి సంఖ్య 90శాతం దాకా ఉంది. కుల భేదాల వల్ల వీరి మేధస్సు బందీ అయిపోయింది. వీరిని పైకి తెస్తే తప్ప, దేశ పునర్నిర్మాణం జరగదు. కాళ్ళూ, చేతులూ కదిలించకపోతే శరీరానికి పక్షవాతం వచ్చినట్లు... దేశానికీ పక్షవాతం వచ్చింది. దేశంలోని ఈ 90శాతం ప్రజలకు రెండువేల సంవత్సరాలుగా పక్షవాతం వచ్చింది. సమాజంలో వీరిని ఎక్కడికక్కడ పాతరేసి స్థిరపరిచారు. కదలిక లేకుండా చేశారు. బానిసత్వానికి మూల కారణం ఇదే. ఇప్పటికైనా మారకపోతే మరోసారి బానిసలమయ్యే ప్రమాదముంది." ఇలాంటి హెచ్చరికల్ని మనం ఇప్పటికైనా పట్టించుకోవాలా? వద్దా? ఇరవై ఒకటవ శతాబ్దపు అత్యాధునికులమని గొప్పలు పోవడం కాదు, అందుకు తగిన విధంగా ఆలోచనా సరళిని మార్చుకోవాల్సి ఉంది.

మంత్రాలయ మఠంలో- చదువుకున్న దళితులైనా సరే, కేవలం ఉడ్చడానికే అర్హులు! ఆ పని తప్ప మరో పని చేయనివ్వరు. బిల్లులు రాయడానికి గానీ, రిసెప్షనిస్టులుగా పని చేయడానికి గానీ వారికి అవకాశమివ్వరు. అక్కడవారు చదువుకున్న చదువు వృథా కావల్సిందే! కొన్ని ఊళ్ళలో దళితులు మోటారు వాహనాలపై తిరగకూడదు. పెళ్ళి ఊరేగింపులు సైతం వాహనాలపై చేసుకోగూడదు. కాలి నడకన వెళ్ళాల్సిందే. మంచి నీటి బావుల్లోకి సైతం దిగనివ్వరు. బావిలోంచి నీరే తోడుకోనివ్వనప్పుడు, ఇక నీళ్ళలోకి దిగి పనులు చేయనిస్తారా? దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేయడమన్నది ఊహకు అందని విషయం. మంత్రాలయ మండలంలోని బసాపురంలో పెత్తందార్ల కార్లు వెళుతూ ఉంటే ఎంతటి విద్యావంతులైన, దళితులయినా సరే... టక్కున లేచి నిలబడి వంగి నమస్కారం పెట్టాల్సిందే. కర్నూలు మండలం దేవమడ గ్రామంలోనూ ఇంకా కొన్ని చుట్టుపక్కల గ్రామాల్లోనూ గ్రామ వాలెంటీర్‌లు దళితుల ఇండ్లకు వెళ్ళరు. వాళ్ళనే తమ ఇళ్ళకు పిలిపించుకుంటారు. ఊళ్ళోని ప్రతి ఇల్లూ తిరగడమన్నది గ్రామ వాలంటీర్ల ఉద్యోగ ధర్మం. దాన్ని పక్కన పెట్టి వ్యవహరించడం ఎంత తప్పూ? అయితే వారిని అడిగేవారు లేరు. మన తెలుగు రాష్ట్రాల్లోనే ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇంతటి వివక్ష కొనసాగుతూ ఉందంటే... మనుషులుగా మనమంతా తలవంచుకోవాలి. అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వోద్యోగులు, పరిపాలకులు సిగ్గుపడాలి!

కర్నాటకలో కొప్పల్ జిల్లా మయాపూర్ గ్రామంలో అగ్రవర్ణం వారు దళిత కుటుంబానికి ఇరవై అయిదు వేల రూపాయల జరిమాన విధించారు. ఎందుకంటే ఒక దళితుడు గుడి బయట నిలబడి, కళ్ళు మూసుకుని దేవుడికి దండం పెట్టుకుంటున్నాడు. ఆ సమయంలో వెంట ఉన్న అతని రెండేండ్ల కొడుకు గబుక్కున గుళ్ళోకి వెళ్ళిపోయాడు. తను దళితుడినని, తను గుళ్ళోకి వెళ్ళకూడదని ఆ పసివాడికి తెలియదు. ఆ రోజు ఆ పసివాడి పుట్టిన రోజు. అందుకే వాణ్ణి తీసుకుని తండ్రి గుడికి వెళ్ళాడు. వాణ్ణి చల్లగా చూడమని కోరుకుంటూ ఆ దళితుడు దండం పెట్టుకుంటూ ఉండగా... ఆ "ఘోర ప్రమాదం" జరిగిపోయింది. ఒక దళితుడు గుళ్ళోకి జొరబడ్డాడని, గుడి మైల పడిందనీ, దాన్ని ప్రక్షాళన చేయాలని... అందుకు 25వేలు ఖర్చు అవుతుందనీ పూజారులు బెదిరించారు. తనకు అంతశక్తి లేదని, తను ఒక నిరుపేదనని దళితుడు ఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. అగ్రవర్ణ అహంకారం తగ్గలేదు. పెద్ద గలాటా జరిగింది. ప్రభుత్వాధికారుల చొరవతో విషయం సద్దుమణిగింది. ఇంగిత జ్ఞానం లేక, మానవత్వం లేక మనుషులు ప్రవర్తిస్తున్నప్పుడు - గోరుతో పోయేది గొడ్డళ్ళదాకా వస్తుంది. ఇది 2021 సెప్టెంబర్ సంఘటన. ఇలాంటి సంఘటనే తమిళనాడులో జరిగింది. ఒక గుళ్ళోకి దళిత మహిళను రానియ్యలేదు. ఆ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తెలిసింది. వెంటనే ఆ గుడికి సంబంధించిన ఇరవైమంది పూజారుల మీద ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టించి వారిని జైలుకు పంపాడు. ఇతర రాష్ట్రాలలో కూడా అలా చేయగలిగే అవకాశం ఆయా మంత్రులకు, ముఖ్యమంత్రులకు ఉంటుంది. రాజ్యాంగం



గురించి అందరూ గొప్పగా మాట్లాడుతారు కానీ, ఎవరైనా అలా చేస్తున్నారా?

మహిళల అభ్యున్నతికై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్త్రీలకు బస్సు ప్రయాణం ఉచితం చేశాడు. ఒకరోజు కన్యాకుమారి జిల్లా వాణీయం కుడి గ్రామానికి చెందిన సెల్వం అనే డెబ్బయేండ్ల మహిళ తన చేపల బుట్టతో బస్సు ఎక్కింది. చేపలు వాసన వస్తున్నాయంటూ కండక్టర్ బలవంతంగా ఆమెను బస్సు నుండి దింపేశాడు. అవి నిలువ చేపలు కావని, ఆ రోజు పట్టినవేనని, చేపలన్నాక కొంచెం వాసననొస్తాయనీ, అయినా తను ఎక్కువ దూరమేమీ రావడం లేదని ఆ వృద్ధురాలు ఎంత మొత్తుకున్నా కండక్టర్ వినలేదు. 'పాపం పోనీయండి' - అని తోటి ప్రయాణీకులు చెప్పినా, అతను వినిపించుకోలేదు. బలవంతంగా దింపేశాడు. ఆమె కుళచ్చళ్ బస్టాండ్‌లో అందరికీ తనకు జరిగిన అన్యాయం చెప్పుకుంది. ఆనోటా ఆనోటా అది సోషల్ మీడియాకెక్కింది. రవాణాశాఖ అధికారులకు, తర్వాత ముఖ్యమంత్రికీ తెలిసింది. ఆ వృద్ధురాలి హక్కును కాదన్నందుకు ఆ బస్సు కండక్టర్, డ్రైవర్‌లను సస్పెండ్ చేశాడు స్టాలిన్. అణగారిన వర్గాలకు ఎక్కడికక్కడ న్యాయం జరగాలంటే

> మనుస్మృతి ప్రకారం మహిళలందరూ శూద్రులే. మహిళలకు పుట్టిన వారంతా శూద్రులే అవుతారు కానీ, మళ్ళీ అందులో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఎలా పుట్టగలరూ? పుట్టిన వాళ్ళందరూ శూద్రులే అయినప్పుడు అగ్ర-నిమ్న వర్ణాలెందుకూ? ఇదంతా బుద్ధి తక్కువ వ్యవహారంగా అనిపించడం లేదూ? అది అలా ఉండనిచ్చి మరొక విషయం చూద్దాం. హిందూ దేవుళ్ళలో బ్రాహ్మణులు లేరు. అధిక భాగం క్షత్రియులే. అలా అయినప్పుడు బ్రాహ్మణ వర్ణానికి మొదటి స్థానం ఎవడిచ్చాడు? ఇదంతా కాదు. మహిళలు శూద్రులయినప్పుడు, ఉన్న జనాభా అంతా శూద్రులే - అందరూ సమానులే. విజ్ఞాన శాస్త్రం అదే చెప్పింది - మానవజాతి అంతా ఒక్కటే కాబట్టి, అందరూ సమానులే - అని అంది. మనుధర్మ శాస్త్ర ప్రకారం కూడా మనుషులంతా సమానులే- అని మనం అర్థం చేసుకోవాలి.

చిత్తశుద్ధి ఉన్న నాయకులు కావాలి. ఉట్టి 'భాషణ్'లిచ్చే నాయకులు వృథా కదా మిత్రోఁ?

మనుస్మృతి ప్రకారం మహిళలందరూ శూద్రులే. మహిళలకు పుట్టిన వారంతా శూద్రులే అవుతారు కానీ, మళ్ళీ అందులో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఎలా పుట్టగలరూ? పుట్టిన వాళ్ళందరూ శూద్రులే అయినప్పుడు అగ్ర-నిమ్న వర్ణాలెందుకూ? ఇదంతా బుద్ధి తక్కువ వ్యవహారంగా అనిపించడం లేదూ? అది అలా ఉండనిచ్చి మరొక విషయం చూద్దాం. హిందూ దేవుళ్ళలో బ్రాహ్మణులు లేరు. అధిక భాగం క్షత్రియులే. అలా అయినప్పుడు బ్రాహ్మణ వర్ణానికి మొదటి స్థానం ఎవడిచ్చాడు? ఇదంతా కాదు. మహిళలు శూద్రులయినప్పుడు, ఉన్న జనాభా అంతా శూద్రులే - అందరూ సమానులే. విజ్ఞాన శాస్త్రం అదే చెప్పింది - మానవజాతి అంతా ఒక్కటే కాబట్టి, అందరూ సమానులే - అని అంది. మనుధర్మ శాస్త్ర ప్రకారం కూడా మనుషులంతా సమానులే- అని మనం అర్థం చేసుకోవాలి. మనమంతా బాల్యంలో బాలకులం. యవ్వనంలో యువకులం. వృద్ధాప్యంలో పండుటాకులం... అంతే! మనువును తిరస్కరిస్తేనే ఎవరికైనా కాస్త బుద్ధిజ్ఞానం పెరుగుతుంది. రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఒక పెద్దాయన పక్కనున్న యువకుణ్ణి ఊహించని ప్రశ్న అడిగాడు. మీ కేస్ట్ ఏమిటీ అని! యువకుడు అందగాడే కాదు తెలివైనవాడు కూడా. విషయం గ్రహించి వెంటనే 'సాఫ్ట్‌వేర్' అండీ అన్నాడు.

"భలే జోకులేస్తావు బాబూ నేను అడిగింది వేరు. నువ్వు చెప్పేది వేరు. పోనీ, మీ నాన్నగారి కులమేమిటీ" అని మళ్ళీ అడిగాడు పెద్దాయన.

"ఆయనా? ఆయన ఎలక్ట్రికల్ అండీ" అన్నాడు యువకుడు.

'పోనీలే - నీకు చెప్పాలని లేనట్లుంది! ఈ మధ్య ఏమిటో కుర్రవాళ్ళు చిత్రమైన జవాబులు చెపుతున్నారు. కులం చెప్పుకుంటే నామోషీయేమో" - అని ముఖం మాడ్చుకుని, ముఖం కూడా తిప్పుకున్నాడు.

"మీరు పెద్దవారు. మీకు తిక్కతిక్కగా సమాధానాలు చెప్పాలని నాకు లేదు. విషయేమిటంటేనండీ... భగవద్గీతలోని నాలుగో అధ్యాయంలో పదమూడవ శ్లోకం ఒకసారి నెమరు వేసుకోండి. మీకే అర్థమవుతుంది!" అన్నాడు.

"అవునూ ఏముందు అందులో?" ఈ కుర్రాడికి గీతలోని విషయాలు కూడా తెలుసా? అని ఆశ్చర్యపోతూ అడిగాడు.

"గుర్తులేకపోతే ఫరవాలేదు. ఇంటికెళ్ళాక చూసుకోండి!" నవ్వుతూ బదులిచ్చాడు యువకుడు.

"సరే బాబూ చెబుదూ అందులో ఏముందో" అన్నాడు పెద్దాయన.

"ఏముందంటే... కులమనేది పుట్టుకతో కాదు, చేసే వృత్తితో వస్తుంది- అని ఉంది. దాని ప్రకారమే చెప్పానండీ అంతే - మిమ్మల్ని ఆటపట్టించాలని కాదు - మీకేమో కోపం వచ్చేసింది" అని నవ్వుకొనసాగించాడు. పెద్దాయనకు ఎక్కడో కలుక్కుమంది. 'జ్ఞానం' వయసు పెరిగితే రాదు - బుద్ధి పెరిగితేనే వస్తుందని అప్పుడే తెలుసుకున్నాడు. పాత తరహాలో ఇక మాట్లాడగూడదని కూడా అనుకున్నాడు.

మనుస్మృతి ప్రకారం- (త్రిన్ష:9/93) పురుషులు 24-30ఏళ్ళ వయసులో 8-12ఏళ్ళ వయసులో ఉన్న బాలికల్ని పెండ్లి చేసుకోవాలి. ఇదే కాదు 3-4 ఏళ్ళ బాలికలకు 7-8ఏళ్ళ బాలురకు కూడా పెళ్ళిళ్ళు చేసిన ఆచారం ఈ దేశంలో కొనసాగింది. మరి సమకాలీనంలో దాన్ని కొనసాగించడం లేదు కదా? అందుకే సంప్రదాయం ముసుగులో పనికిరాని ఆచారాల్ని వదిలేయాలి. అన్నీ ఆలోచించే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనుస్మృతిని దహనం చేశాడన్న విషయం గుర్తుంచుకోవాలి!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



## ధనిక రాష్ట్రంలో వేతన కష్టాలు

తెలంగాణ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2.90 లక్షల కోట్లతో బాహుబలి బడ్జెట్‌ను శాసనసభలో ఈనెల 6న ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం గురించి ఆర్థికశాఖ మంత్రి కితాబునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు కీలక భాగస్వామ్యం వహిస్తున్నారని, వారి సంక్షేమమే పరమావధి అని చెప్పారు. దేశంలో ఎక్కడలేని విధంగా అత్యధిక వేతనాలు ఇస్తున్నామని, వారి ప్రయోజనాల విషయంలో ఏనాడు తక్కువ చేయలేదంటూ పేర్కొ న్నారు. ఎక్కువ జీతాలేమోగానీ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతినెల జీతంకోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత రెండేండ్లుగా వేతనాల చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతున్నది. మరోపక్క ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక బిల్లులన్ని నిలిచిపోయాయి. రుణాలు, అడ్వాన్సులు, రీయంబర్స్‌మెంట్ బిల్లులకు గత కొన్ని నెలలుగా మోక్షం లభించడం లేదు. ఖజానా కార్యాలయం నుంచి టోకెన్లు జనరేట్ అవుతున్నాయే తప్ప 'ఈ-కుబేర్' నుంచి డబ్బులు మాత్రం ఉద్యోగుల ఖాతాల్లో జమ కావడం లేదు.

ఒకప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదీన జీతాలు వచ్చేవి. సాధారణ పరిపాలన శాఖ ఏప్రిల్ 1990లో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వు నెం.223 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతభత్యాలు చెల్లించాలి. కానీ గత రెండేండ్లుగా ధనిక రాష్ట్రంలో జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో సచివాలయం ఉద్యోగులకు ఒకటో తేదీన జీతంవస్తే ఆయా శాఖాధిపతి కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు 2వ తేదీ నుండి 5వ తేదీ లోపు జీతాలు అందుతాయి. కానీ మిగతా జిల్లాల్లో ఏ తేదీన జీతాలు జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి నెలా పలాన తేదీన జీతం వస్తుందని నమ్మకాన్ని ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించడం లేదు. వివిధ మార్గాల ద్వారా వస్తున్న రాబడులు సంక్షేమ పథకాల సబ్సిడీలు, వడ్డీల చెల్లింపులకే సరిపోతుండడంతో ఉద్యోగులకు ప్రతినెలా జీతాలు చెల్లించడం కష్టమవుతున్నది. సరైన సమయానికి జీతాలురాక ఇంటి అద్దెలు, నిత్యావసర వస్తువుల కొనుగోళ్ళు, ఈఎంఐల చెల్లింపులకు ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురించింది.

### ఉద్యోగుల బిల్లులన్నీ పెండింగ్...

ఉద్యోగుల సరెండర్ లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్, టీఎస్ జీఎల్ఐ క్లైములు, జీపీఎఫ్, పిఆర్సీ బకాయిలు మొదలైన బిల్లులన్నీ ట్రెజరీశాఖలో గత కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జిపిఎఫ్) కింద ప్రతి ఉద్యోగ మూలవేతనం నుంచి ప్రభుత్వం 6శాతం మినహాయింపులు చేస్తుంది. దీని సొమ్ము రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీశాఖలో జమవుతుంది. 20ఏండ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగ ఉపాధ్యాయులు జిపిఎఫ్ ఖాతాల నుండి పాక్షిక ఉపసంహరణ కింద సొమ్ము తీసుకుంటారు. ఈ విధంగా తీసుకుంటున్న జిపిఎఫ్ బిల్లులు గత కొన్ని నెలలుగా అనేక జిల్లాల్లో నిలిచిపోయాయి. ఫలితంగా గృహ నిర్మాణం, ఆరోగ్య సంబంధ విషయాలు, వివాహ శుభకార్యాలు, పిల్లల చదువులు మొదలైన వాటికి ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు జమ చేసుకున్న సొమ్ము ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడం వల్ల అవసరాల నిధి అక్కరకు రాకుండాపోయింది. అలాగే పిఆర్సీ ఏరియర్స్ బిల్లులు, సిపిఎస్ ఉద్యోగుల డి.ఏ బకాయిలు చాలా నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. సమయం ముగిసిన లైఫ్ ఇన్సూరెన్స్ బాండ్ల క్లైముల యొక్క బిల్లులు అందక రిటైరైన ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉద్యోగుల వైద్యానికి సంబంధించిన రూ.2లక్షల లోపు అత్యవసర మెడికల్ బిల్లులు కూడా మంజూరు కావడం లేదు.

### నూతన పద్ధతిలో నేరుగా ఖాతాలోనికే...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల కోసం ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) రూపొందించింది. దీని ప్రకారం ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులను డిడిఓలు తయారుచేసి ఎస్‌టిఓ కార్యాలయాలకు పంపిస్తారు. ఆ వెంటనే టోకెన్ నెంబర్ జనరేట్ అవుతుంది. దాని ఆధారంగా సొమ్ము మంజూరు కావాలి. ఇంతకు ముందు టోకెన్ జనరేట్ అయినా కొన్ని రోజులకే ఉద్యోగుల ఖాతాల్లో బిల్లుల సొమ్ము జమయ్యేది. కానీ ప్రస్తుతం బిల్లు క్లియర్ కావాలంటే ఆర్థికశాఖ అనుమతి ఉండాల్సిందే. ట్రెజరీశాఖకు చెందిన ఆడిట్ అధికారులు ఆడిట్ చేసిన అనంతరం బిల్లులు ఈ-కుబేర్ పోర్టల్‌లో అప్ లోడ్ చేస్తారు. ఖజానా శాఖకు వస్తున్న రాబడుల ఆధారంగా బిల్లులను మంజూరు చేస్తారు. ఓ నెలలో రైతుబంధు... ఇంకో నెలలో ఇంకో పథకం... ఇలా ప్రతి నెలలో సంక్షేమ పథకాలకే వచ్చిన నిధులన్నీ ఖర్చవుతున్నాయి. జీతాల కోసం నిధులు సమకూర్చుకోవడంలో ఆలస్యం జరగడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమయానికి వేతనాలు రావడం లేదు. ప్రయివేట్ సెక్టార్‌లో పనిచేసే ఉద్యోగులకు ఆయా సంస్థలు ఒక తేదీని నిర్ణయించి జీతాలు జమ చేస్తాయి. కానీ ప్రభుత్వోద్యోగులకు అలా ఎందుకు ఇవ్వడంలేదనే ప్రశ్నలు వారి నుండి వ్యక్తమవుతున్నాయి. ధనిక రాష్ట్రంలో జీతాల కోసం, బిల్లుల మంజూరు కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిని ప్రభుత్వం గుర్తించి వేతన జీవుల వెతలు తీర్చాల్సిన అవసరమున్నది.



అంకం నరేష్

సెల్: 6301650324

# ప్రభుత్వ బీమా రంగంపై ముప్పేట దాడి... ఉద్యోగుల ముందున్న కర్తవ్యం



పి. సతీష్
9441797900

దేశానికి ఏటా దాదాపు రూ.4లక్షల కోట్ల మేరకు నిధులు అందించే ప్రభుత్వ బీమా పరిశ్రమకు 2023-24 బడ్జెట్ ప్రతిపాదనలు ఏమాత్రం ఉపయోగకరంగా లేవు. ఎల్.ఐ.సి సంస్థకు, పాలసీ దారులకు భారంగా మారిన బీమా ప్రీమియం పైన అన్యాయంగా విధిస్తున్న 18శాతం జీఎస్‌టీ ఏమాత్రం తగ్గించలేదు. పైపెచ్చు ఏప్రిల్, 2023 తరువాత తీసుకునే పాలసీల ఏడాది ప్రీమియమ్ రూ.5 లక్షలు దాటితే, వాటి మెచ్యూరిటీపై పన్ను వేసే విధంగా పద్ధతి ప్రతిపాదించారు. అంటే దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇఇఇ పద్ధతికి స్వస్తి పలికి, ఈఈటీ (Exempt, Exempt, Tax) పద్ధతి తీసుకొస్తున్నారు. ఆరోగ్య బీమా చేస్తే ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితులు మరింత పెంచాలన్న విజ్ఞప్తులను పెడచెవిన పెట్టారు. దేశీయ పొదుపు ప్రస్తుతం దేశ జీడీపీలో 28శాతం నుండి 29శాతం మధ్యలో ఉంది. కొన్ని ఏండ్ల క్రితం ఇది 37శాతం ఉండేది. ప్రజల పొదుపు సామర్థ్యం పడిపోవడం, ఉద్యోగాల లేమి, మితిమీరిన ద్రవ్యోల్బణం, గ్యారెంటీలేని ఉద్యోగాల వలన దేశీయ పొదుపు క్రమేపీ క్షీణిస్తూ వస్తోంది. దేశీయ పొదుపు మూడు విధాలుగా ఉంటుంది. 1. కుటుంబ పొదుపు 2. కార్పొరేట్ పొదుపు 3. ప్రభుత్వ రంగ సంస్థల పొదుపు.


1. కుటుంబ పొదుపు - ఇది మొత్తం దేశీయ పొదుపులో సుమారు 60శాతం ఉంటుంది. ఇందులో రెండు భాగాలు. ఆర్థిక పొదుపు (అంటే బ్యాంక్, బీమా, పీఎఫ్, పెన్షన్, పోస్ట్ ఆఫీస్‌లలో చేసే పొదుపు). భౌతిక పొదుపు (బంగారం, భూములు, రియల్ ఎస్టేట్ తదితర పొదుపు)

2022-23లో సుమారు రూ.17లక్షల కోట్లు ఆర్థిక పొదుపు రూపేణా సమీకరించబడగా, 2023-24 నాటికి అది రూ.25 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఈ సొమ్మంతా ప్రభుత్వ పెట్టుబడులకు ఉపయోగపడతాయి. కార్పొరేట్ పొదుపు - ఇది మొత్తం దేశీయ పొదుపులో 34శాతం ఉంటుంది. ఇది ఆయా కార్పొరేట్‌ల సొంత ప్రయోజనాల కోసం వినియోగించబడుతుంది. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సమీకరించబడే పొదుపు-ఇది కేవలం 5శాతం మాత్రమే. ప్రజల పొదుపు ప్రభుత్వ నియంత్రణలో ఉంటేనే, ప్రజా సంక్షేమం కోసం దానిని ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ప్రజా పొదుపు, వారికి విపరీతమైన లాభాలు తెచ్చిపెడుతుంది తప్ప, సమాజానికి ఎటువంటి ఉపయోగం లేదు. అందుకే కుటుంబ పొదుపుని ప్రోత్సహించాలి. కానీ, దానికి విరుద్ధంగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి.

బీమా రంగానికి ప్రత్యేక ఆదాయపు టాక్స్ స్లాబ్‌ను కల్పించాలన్న బీమా రంగ విజ్ఞప్తులను ఆర్థికమంత్రి ఏమాత్రం పట్టించుకోలేదు. పైపెచ్చు ఆదాయపు పన్ను కట్టేవారిని నూతన టాక్స్ విధానంలోకి తీసుకువచ్చే విధంగా ఈ బడ్జెట్‌లో స్లాబ్స్‌లో మార్పులు ప్రతిపాదించారు. ఈ చర్య ఆదాయపు పన్ను రాయితీ కోసం జీవిత బీమా పాలసీలు తీసుకునే వారిని నిరుత్సాహ పరిచినట్టే అవుతుంది. సార్వత్రిక సామాజిక భద్రత లోపించిన మన దేశంలో, ఇటువంటి చర్యలు ప్రజలు స్వచ్ఛందంగా కల్పించుకునే సామాజిక భద్రతను, పొదుపు అలవాటుని దెబ్బ తీస్తాయి.

### ప్రభుత్వ బీమా రంగంపై అలుపెరగని దాడి!!

2021-22 బడ్జెట్‌లోనే రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులను, ఒక ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీని ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయబోతున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. జీఐబీఎస్ఎ చట్టం-2021 ద్వారా ప్రభుత్వానికి అపరిమితమైన అధికారాలు లభించాయి. ప్రభుత్వం అనుకుంటే ఏ పీఎస్, జీఐ కంపెనీలోనైనా ప్రభుత్వ ఈక్విటీని 51శాతం కన్నా దిగువకు తగ్గించవచ్చు. అందువల్ల ఈ చట్టం ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీల ప్రయివేటీకరణకు మార్గం సుగమం చేసింది. అయితే, ఏఐఐఐఏ మడమ తిప్పకుండా చేసిన పోరాటాల వల్ల ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీ అమ్మకం తాత్కాలికంగా నిలుపుదల అయ్యింది. అయితే, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలలోని కొన్ని బ్రాంచ్‌లు, డివిజనల్ కార్యాలయాలను మూసివేయడానికి లేదా విలీనం చేయడానికి ఇటీవలి జరుగుతున్న ప్రయత్నాలు ప్రయివేటీకరణ దిశగా అడుగులు మాత్రమే అని గమనించాలి.




స్విస్ రే సిగ్మా అధ్యయనం ప్రకారం... ప్రపంచంలోనే పది అతిపెద్ద బీమారంగ మార్కెట్లలో ఇండియా ఒకటిగా నిలిచింది. భారతదేశంలో బీమా రక్షణ అంతరం (ఇన్సూరెన్స్ ప్రొటెక్షన్ గాప్)16.5 ట్రిలియన్ డాలర్లుగా గుర్తించింది. ఈ బీమా అంతరంలో అత్యధిక వాటాను చేజిక్కించుకోవడానికి మార్కెట్లో తీవ్రమైన పోటీ నడుస్తోంది. 2015లో మొదటిసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు బీమా రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని 26 నుంచి 49శాతానికి పెంచారు. 2021లో దానిని 74శాతానికి పెంచారు. విదేశీ యాజమాన్యాన్ని, ప్రయివేటు బీమా కంపెనీలపై వారి నియంత్రణను కూడా అనుమతించారు.

### మన దేశీయ కంపెనీలపై విదేశీ పెట్టుబడి

నియంత్రణ సాధించడం వల్ల, మన దేశీయ కుటుంబ పొదుపులో అధిక వాటాను పొందాలని, తద్వారా లాభాలు పోగేసుకోవాలని వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బీమారంగ పరిశ్రమలో ఈ మధ్య జరుగుతున్న పరిణామాలను గమనిస్తే రాబోయే రోజులలో దేశీయ బీమా రంగంలో కంపెనీల మిళితాలు బాగా పెరుగుతాయని తెలుస్తోంది. ఇటీవల హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఎక్సైడ్ లైఫ్‌ను రూ.6687 కోట్ల ఒప్పందం మేరకు కొనుగోలు చేసింది. ఐసిఐసిఐ లాంబార్డ్, భారతి ఆక్సా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని కొనుగోలు చేసింది. అమెరికా ఆధారిత బీమా సంస్థ మెట్ లైఫ్, ఐజిఐ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఎర్లో లో 15.27శాతం వాటాను పొందింది. ప్రయివేటు బీమా కంపెనీల మెర్జర్స్ ప్రభుత్వ రంగ బీమా కంపెనీల మార్కెట్ ఆధిపత్యానికి పెద్ద సవాలుగా పరిణమిస్తోంది.

### సాంకేతిక అంశాల్లో నూతన సవాళ్లు!!

సాంకేతిక ఆవిష్కరణ, నవీకరణకు సంబంధించి నూతన సవాళ్లు ఎదురవుతున్నాయి. బీమా రంగం ఎక్కువగా డిజిటలైజేషన్ వైపునకు పయనిస్తోంది. భారతదేశంలో బీమా వ్యాప్తి సుమారు 4శాతం ఉండగా, ఇంటర్నెట్ యొక్క వ్యాప్తి 45శాతంగా ఉంది. భారతదేశంలో 139కోట్ల మందిలో సగం మంది ఇంటర్నెట్‌ను కలిగి ఉన్నారు. క్లిక్, కొనుగోలు' సౌలభ్యం ఆన్‌లైన్ కొనుగోలుకు గణనీయమైన ఊపు వస్తోంది. భారతదేశంలో ఆన్‌లైన్ బీమా మార్కెట్ 2024 నాటికి రూ.22,000 కోట్లకు పెరగగలదని అంచనా. బీమా ఉత్పత్తుల విక్రయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగం అనేది నేడు అనివార్యమైంది. స్టాండర్డ్ అండ్ పూర్ తాజా నివేదిక ప్రకారం ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో భారతదేశం రెండవ అతిపెద్ద బీమా సాంకేతిక మార్కెట్‌గా నిలిచింది. బీమా కంపెనీలు కస్టమర్లను తమ సాంకేతిక పరిజ్ఞానంతో ఆకట్టుకునే ప్రయత్నం

> బీమారంగ పరిశ్రమలో ఈ మధ్య జరుగుతున్న పరిణామాలను గమనిస్తే రాబోయే రోజులలో దేశీయ బీమా రంగంలో కంపెనీల మిళితాలు బాగా పెరుగుతాయని తెలుస్తోంది. ఇటీవల హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఎక్సైడ్ లైఫ్‌ను రూ.6687 కోట్ల ఒప్పందం మేరకు కొనుగోలు చేసింది. ఐసిఐసిఐ లాంబార్డ్, భారతి ఆక్సా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని కొనుగోలు చేసింది. అమెరికా ఆధారిత బీమా సంస్థ మెట్ లైఫ్, ఐజిఐ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఎర్గో లో 15.27శాతం వాటాను పొందింది. ప్రయివేటు బీమా కంపెనీల మెర్జర్స్ ప్రభుత్వ రంగ బీమా కంపెనీల మార్కెట్ ఆధిపత్యానికి పెద్ద సవాలుగా పరిణమిస్తోంది.

చేస్తున్నాయి. మెరుగైన డేటా విశ్లేషణలు, కృత్రిమ మేధస్సు (ఎఐ)ను ఉపయోగించటం ద్వారా, పాలసీదారుల అవసరాలకు అనుగుణంగా కంపెనీలు ఉత్పత్తు లను అభివృద్ధి చేస్తున్నాయి.

దేశీయ బీమా పరిశ్రమపై మిలీనియనల్స్ లేదా యువ ఉద్యోగులు ప్రభావం గణనీయంగా ఉంది. మొత్తం ఉద్యోగుల్లో వీరు 46శాతం దాకా ఉండడం విశేషం. అందువల్ల బీమా పాలసీలు అమ్మడంలో, పాలసీ సేవలు అందించడంలో కొత్త పద్ధతులు అవసరం. ఎందుకంటే... వారు ముఖాముఖీ సర్వీస్ కన్నా డిజిటల్ సర్వీస్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఫిజిటల్ మార్కెట్ ప్లేస్- భౌతిక శాఖలతో బాటు ఫోన్ ఆధారిత కాంటాక్ట్ సెంటర్లు, చాట్‌బాట్‌లు, వాట్సాప్, మొబైల్ యాప్‌లు, సామాజిక మాధ్యమాలు వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఈరోజు అనివార్యమయ్యాయి.

ఇప్పటికే మన ప్రభుత్వ రంగ బీమా సంస్థలు మరింతగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఇటు ఉద్యోగుల ప్రయోజనాలను, అటు సంస్థ ప్రయోజనాలను అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. ప్రపంచ దేశాలలో పదవి విరమణ చేసిన వారి పొదుపు ఎక్కువగా ఉన్న దేశాలలో మన దేశం ఒకటి. కాబట్టి ప్రభుత్వ బీమా రంగ పరిశ్రమ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈ దిశగా బీమా ఉత్పత్తులను అభివృద్ధి చేయాలి.

సెల్:9441797900

## ఖబరాస్తాన్ కోసం స్థలం కేటాయించాలని రాస్తారోకో

**నవతెలంగాణ-వైరా**

మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీలు ఖబరాస్థాన్ కోసం స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం వైరా-మధిర ఆర్అండ్‌బి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. గ్రామంలో ఖబరాస్తాన్ లేక శవాలను చెరువు కట్టపై ఖననం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ఏండ్లుగా గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, ఎమ్మెల్యేకి చెప్పుకొని వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోలేదని అన్నారు. గంట సేపు రాస్తారోకో చేయటం వలన వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచి పోయాయి. గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్నా, పట్టించుకునే వారు లేరని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నాయకులు అందలం ఎక్కితే చాలు మేము గుర్తుండమని అన్నారు. విషయం తెలుసుకున్న వైరా ఎస్ఐ శాఖమూరి వీరప్రసాద్, రెబ్బవరం వెళ్లి ముస్లిం మైనార్టీల నాయకులతో సంప్రదించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరి స్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సాదం రామారావు మాట్లాడుతూ గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఖబరాస్తాన్‌కు కేటాయించేందుకు ఎమ్మెల్యే ఎల్.రాములునాయక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా మన్నారు. కార్యక్రమంలో షేక్ లాల్ పాషా, సిరాజుద్దీన్, అంకుష్, మదార్, లతీఫ్, సైదుబాబు, పీర్ సాహెబ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దృష్టిలోపం ఉన్నవారికి కంటి వెలుగు వరం: డీఎంహెచ్ఓ

**నవతెలంగాణ-వైరా**

దృష్టిలోపం ఉన్న ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం వరం లాంటిదని డిఎంహెచ్ఓ మాలతి అన్నారు. వైరా మండలంలోని రెబ్బవరం గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, మండల వైద్యాధికారి ఉదయలక్ష్మి గ్రామ సర్పంచ్ సాధం రామారావు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి యాత్రను విజయవంతం చేయాలి

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్**

**నవతెలంగాణ- ఖమ్మం**

టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రారంభించిన హత్ సే హత్ యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ కోరారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ జోడోయాత్ర స్ఫూర్తితో నేరుగా ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర కామేపల్లి మండలానికి గురువారం రాత్రి చేరుకుందని తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కామేపల్లి మండలం లచ్చు తండా నుండి పాదయాత్ర ప్రారంభమై బర్లగూడెం, పొన్నేకల్లు, బండిపాడు, బంజర, గోవింద్రాల, పాత లింగాల మీదుగా సాగుతూ కొత్త లింగాల క్రాస్ రోడ్‌లో సాయంత్రం బహిరంగ సభ జరగనుందని అన్నారు. ఈ యాత్రకు ఖమ్మం జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ శ్రేణులు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, మహిళా, విద్యార్థి, యువజన విభాగం, మైనార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అందరూ పాల్గొని రేవంత్‌రెడ్డి యాత్రను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకేట అన్వేష్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావిద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పాలేరు పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, వైరా పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, జిల్లా మైనార్టీ నాయకులు హుస్సేన్, ఏలూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : కెవీపీఎస్

**నవతెలంగాణ- ఖమ్మం**

తెలంగాణా రాష్ట్ర ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాల కోసం ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని గురువారం ఛలో హైదరాబాద్ సందర్బంగా ముందస్తుగా బుదవారం రాత్రి కెవిపిఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తనను ఇంటి వద్ద పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి తెల్లవార్లూ ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఉంచుకొని అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం అని నందిపాటి మనోహర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో పేదల పక్షాన పోరాట ఆందోళన, నిరసన తెలియచేసే హక్కును ప్రభుత్వాలు హరించడం సరైనదికాదని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన చేసి తెలంగాణ రాష్టంలోని పేదలందరికి ఇండ్ల నిర్మాణం కోసం సొంత ఇంటి స్థలం ఉన్నవారికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## చెరువు ఆక్రమణలను తొలగించాలి

**నవతెలంగాణ - ఎర్రుపాలెం**

పెద్ద చెరువు శిఖరం భూమి ఆక్రమణలను తొలగించాలని చెరువు ఆయకట్టు రైతులు తాసిల్దార్ తిరుమల చారికి, ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన రైతు పెద్ద చెరువు శిఖరం భూమి ముంపు ప్రాంతంలో తన భూమి చుట్టూ చెరువులోకి వర్షపు నీరు పారుదల కాకుండా చెరువుకు మట్టితోలి అడ్డు కట్టలు వేసి పెన్సింగును ఏర్పాటు చేశారని అట్టి అడ్డుకట్టలను ఫెన్సింగ్‌ను తొలగించాలని తాసిల్దార్‌కు రైతులు వివరించారు. స్పందించిన తహసిల్దార్ ఇరిగేషన్ అధికారులతో ఫోను ద్వారా సంప్రదించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి అట్టి రైతుపై చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు రైతు లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, ఆయకట్టు రైతులు షేక్ బహదూర్ ఖాన్, తల్లపరెడ్డి సీతారామరెడ్డి, బండారు పల్లి రాజారావు, అనుమోలు కోటేశ్వరరావు, షేక్ జానీ, దివ్వెల నారాయణ, షేక్ సుల్తాన్, తదితర రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అల్పాహారం కోసం ఆర్థిక సహకారం

**నవ తెలంగాణ - బోనకల్**

మండల పరిధిలోనే బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నందున విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు గ్రామస్తులు పారుపల్లి జోగారావు 6 వేల రూపాయలు, పాఠశాల పూర్వ విద్యార్థి రావుల వెంకటకృష్ణ తన తండ్రి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం మూడు వేల రూపాయలను పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రామకష్టారావుకి గురువారం అందజేసి తమ దాతత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోతు రామకష్ణ సర్పంచ్ జేర్రిపోతుల రవీంద్ర పాల్గొన్నారు.

## పండిట్, పిఇటి పోస్టులకు పదోన్నతులను కల్పించాలి

**నవతెలంగాణ-కొణిజర్ల**

రాష్ట్ర ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిన పండిట్, పిఇటి పోస్టులకు పదోన్నతులు కల్పించి రాష్ట్ర వ్యాప్తంగా పండిట్, పిఇటిల ఆందోళనను విరమింపజేయాలని,ఈ పదోన్నతల షెడ్యూల్ లోనే పండిట్, పీఈటీ లకు పదోన్నతులు కల్పించాలని పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పిల్లల విద్యాభ్యాసానికి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని టీఎస్ యుటియఫ్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ రంజాన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దగోపతి పాఠశాల నందు పండిట్, పీఈటీలు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఫ్ మండల ప్రధాన కార్యదర్శి జిడిఎస్వీ రమణ ఉన్నత పాఠశాల పెద్దగోపతి ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు,కొత్త శ్రీనివాసరావు, రామారావు, జయరాజు,సుజాత, వెంకటేశ్వరరావు, పుల్లారావు, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) నాయకుల ముందస్తు అరెస్టు

**నవతెలంగాణ-తిరుమలాయపాలెం**

తెలంగాణ రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్లు, ఇల్ల స్థలం సొంత జాగా ఉన్నవారికి ఐదు లక్షల రూపాయలు ఇల్లు కట్టుకోవడానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం జరుగుతున్న చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా తిరుమలయపాలెం సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, రైతు సంఘం మండల అధ్యక్షులు తుళ్లూరు నాగేశ్వరరావు, సిపిఎం మండల సీనియర్ నాయకులు రావుల వెంకటరామిరెడ్డి, కొమ్ము నాగేశ్వరరావులను ముందుస్తుగా పోలీసులు అరెస్టు చేశారు.

**మధిర :** ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా మధిర టౌన్ నాయకులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, మధిర టౌన్ కమిటీ సభ్యులు తేలపోలు రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనపు మధులను ముందస్తు పోలీస్ అక్రమ అరెస్టు చేశారు.

## గుత్తికొండ నిర్మలకు మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత

**నవతెలంగాణ-తల్లాడ**

తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామంలోని గుత్తికొండ నిర్మలకు మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 5వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన గుత్తికొండ నిర్మల పెద్ద కుమారుడు గుత్తికొండ ఆదాం(35) తలసేమియా వ్యాధితో బాధపడుతూ ఇటీవల మరణించారు. గురువారం మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత పాత మిట్టపల్లి గ్రామంలోని వారి స్వగృహానికి వేళ్ళి గుత్తికొండ నిర్మల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహనరావు, సభ్యులు షేక్ అష్రిఫ్, కురుమిండ్ల



రవికిషోర్, బూర్గు లాలయ్య, గుత్తికొండ నిర్మల, గత్తికొండ వినోద్, గుత్తికొండ రేవతి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విధివిధానాల ఖరారుకు డిమాండ్

- వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఏకకాలంలో స్థలాలు ఇవ్వాలి..
- ఇళ్ల స్థలాల కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- జర్నలిస్టులపై కేంద్రప్రభుత్వ దాడులను అరికట్టాలి..
- సిద్ధిఖీ కప్పన్ పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకోవాలి..
- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి



**నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విధివిధానాలు ఖరారు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లా కొండలరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఏకకాలంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం పూనుకోవడం హర్షనీయమని జిల్లా కమిటీ అభిప్రాయపడింది. ఈ మేరకు కృషి చేసిన ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ డిపిఆర్ఓ గౌస్ పాషాలకు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం పోరాడిన సిపిఐ (ఎం) జిల్లా కమిటీ, రాష్ట్ర మహాసభలలో తీర్మానం చేసిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘానికి సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ముగ్గురు ముఖ్యమంత్రుల సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారంగా నెల రోజుల లోపులోనే పట్టాల పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుండడం విశేషమని పేర్కొన్నారు. అయితే ముందుగా ఇళ్ల పట్టాలకు సంబంధించిన విధివిధానాలపై స్పష్టతనిస్తే జర్నలిస్టుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసిన వారవుతారని తెలిపారు. జర్నలిస్టులపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేయిస్తుండడాన్ని సమావేశం ఖండించింది. హత్రాసులో దళిత బాలికను చెరిచి చంపిన అమానవీయ దాడిపై రిపోర్టింగ్ చేయడమే జర్నలిస్టు సిద్ధిఖీ కప్పన్ నేరమైందన్నారు. ఉపా చట్టం కింద దాదాపు రెండేళ్ల పాటు జైల్లో మగ్గిన సిద్ధిఖీ కప్పన్ ఇటీవల విడుదలవడం హర్షనీయమన్నారు. క్రూరమైన చట్టాలకు వ్యతిరేకంగా తన పోరాటం కొనసాగుతుందని కప్పన్ ప్రకటించడం విశేషం అన్నారు. ప్రశ్నించిన జర్నలిస్టులను కేంద్రం క్రూరమైన చట్టాలు పేరుతో అరెస్టు చేయడం సహేతుకం కాదన్నారు. సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు విష్ణు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సీహెచ్ నారాయణ, కోట రవికుమార్, శ్రీధర్, కె.శివారెడ్డి, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

**వ్యకాస జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరావు**

**నవతెలంగాణ- ఖమ్మం**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని కార్మికులకు, ఉపాధి కార్మికులకు, రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరావు, సిఐటియు రాష్ట్ర నాయకులు ఎర్రా శ్రీకాంత్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ అన్నారు. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం పత్తి మార్కెట్ ఎదుట కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు వ్యతిరేకంగా బ్లాక్ డే పాటించారు. ఎర్ర శ్రీని వాసరావు అధ్యక్షతన నిరసన సభలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 45 లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్లో వ్యవసాయ రంగానికి 60 వేల కోట్లు తగ్గించి, ఉపాధికి 30 వేల కోట్లు తగ్గించి, ఆహార భద్రతకి 90 వేల కోట్లు తగ్గించి, పేదలకు కార్మికులకు రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని వారు మండిపడ్డారు. కార్పొరేట్లకు 18 లక్షల కోట్లు రాయితీలు ప్రకటించిన మోడీ బిజెపి ప్రభుత్వం సామాన్యులకు,పేదలకు, రైతులకు, కార్మికులకు బడ్జెట్ కేటాయించడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ఉపాధికి, ఆహారభద్రతకి, కార్మికులకు, 40% బడ్జెట్ కేటాయించాలని, విద్య, వైద్యానికి 25 శాతం కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ. ఆల్ హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూక్యా శ్రీనివాసురావు, మద్ది సత్యం, పత్తిపాక నాగ సులోచన,



షేక్ హిమామ్, పగడాల మోహన్ రావు, సిఐటియు 3 టౌన్ కన్వీనర్ ఎర్ర మల్లికార్జున్ , సిఐటియు త్రీ టౌన్ కో కన్వీనర్ వేల్పుల నాగేశ్వరరావు, రంగు హనుమంత చారి, పాశం సత్యనారాయణ, సోమనబోయిన వెంకటేశ్వర్లు,పెద్దోజు ఉపేంద్ర చారి, షేక్ మస్తాన్, హెచ్ వెంకటేశ్వరరావు, నల్ల మాస వీరస్వామి, మచ్చ కృష్ణ, భాష బోయిన ఉపేందర్, హెచ్ మల్లేష్, సరికొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సమగ్ర చెరకు సాగు విధానం రూపొందించాలి

**తెలంగాణ చెరకు రైతు సంఘం**

**నవతెలంగాణ-వైరాటౌన్**

తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర చెరకు సాగు విధానం రూపొందించాలని తెలంగాణ చెరకు రైతు సంఘం డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ షుగర్ కెన్ కమీషనర్ కార్యాలయంలో రాష్ట్ర అదనపు కెన్ కమీషనర్ శ్రీనివాసరావుకు తెలంగాణ చెరకు రైతు సంఘం బందం కలిసి చెరకు సాగు రైతులు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా అఖిల భారత చెరకు రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు రవీంద్రన్, తెలంగాణ చెరకు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ



తెలంగాణ రాష్ట్రంలో చెరకు సాగు ఘననీయంగా పడి పోతుందని అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పంచదార రికవరీ 8.5 నుంచి 10 శాతంకు పెంచి చెరకు టన్ను ధర నామా మాత్రంగా పెంచడం జరుగుతుందని, మరోవైపు సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి రైతులకు చెరకు గిట్టుబాటు కావడం లేదని అన్నారు. తెలంగాణ ఏర్పాటు నాటికి ఉన్న పరిశ్రమలు కూడా మూత పడ్డాయని అన్నారు. చెరకు సాగుకు అవసరమైన యాంత్రీకరణ పూర్తి సబ్సిడీతో రైతులకు అందించాలని కోరారు. చెరకు నుంచి ఇంధానల్ తయారు చేయాలని, ఇతర రాష్ట్రాలలో లాగా రాష్ట్ర సలహా ధర ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్, చెరకు రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే లేకుంటే...మీ అడ్రస్ ఎక్కడుండేది?

**నవతెలంగాణ-వైరా**



వైరా ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ లేకుంటే మీ అడ్రస్ ఎక్కడ ఉండేదని బిఆర్ఎస్ బహిష్కృత నేతలపై బిఆర్ఎస్ పార్టీ వైరా మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, దిశా జిల్లా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జునరావులు విమర్శించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. పార్టీపై గెలిచి, ఉన్నత పదవులు అనుభవిస్తూ మరల అదే పార్టీకి వెన్నుపోటు పొడిచిన మీకు ఆ పదవులు అనుభవించడానికి అర్హత ఉందా? చిత్తశుద్ధి ఉంటే వెంటనే మీ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వైరా మార్కెట్ చైర్మన్ బీడీకే రత్నం, వైరా మునిసిపల్ వైస్‌చైర్మన్ ముల్లపాటి సీతారాములు, ఎంపీపీ వేల్పుల పావని, జిల్లా దిశా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జునరావు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్కే లాల్ మొహమ్మద్, సీనియర్ నాయకులు కౌన్సిలర్ విశ్వేశ్వరరావు, జిల్లా నాయకులు పసుపులేటి మోహన్‌రావు, జిల్లా నాయకులు మచ్చా బుజ్జి, సీనియర్ నాయకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి అమరనేని మాధవరావు, మిషన్ భగీరథ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల రవి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సాధం రామారావు, ఎంపిటిసి వెంకటరామిరెడ్డి, ,సీనియర్ నాయకులు కౌన్సిలర్ డాక్టర్ కోటయ్య, ఎంపిటిసి ఎర్రమల సౌజన్య, కోదండరామ దేవాలయ చైర్మన్ మిట్టపల్లి సత్యంబాబు, పులిగుట్ట చైర్మన్ మడుపుల సైదా తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న వ్యాపారిపై ట్రేడర్ గూండాల దాడి

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యాపారి
- చస్తే పారేస్తా..ఆస్పత్రి ఖర్చు భరించను: ట్రేడర్
- ఉస్మానియా ఆసుపత్రిలో పరామర్శించిన భట్టి

**నవతెలంగాణ- బోనకల్**

మొక్కజొన్న వ్యాపారిపై మొక్కజొన్నలను కొనుగోలు చేసిన ట్రేడర్ గూండాలు హైదరాబాదులో దాడి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపోలో ఆసుపత్రిలో వ్యాపారిని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. ఈ సంఘటన హైదరాబాదులోనే బడంగ్ పేట, మారుతీ నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన సంచలనంగా మారింది. ఈ విషయం తెలిసిన గోవిందాపురం ఎల్, లక్ష్మీపురం గ్రామాల రైతులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రస్తుతం ఈ సంఘ టన ఆ గ్రామాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటన పట్ల స్థానికులు వ్యాపారి కుటుంబ సభ్యులు, బాధిత రైతుల తెలిపిన వివరాల ప్రకారం..

లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇరుగు వెంకటేశ్వర్లు తనకు గల రెండున్నర ఎకరాల పొలాన్ని రెండేళ్ల క్రితం అమ్మాడు. ఆ వచ్చిన డబ్బులతో మొక్కజొన్న, పత్తి వ్యాపారం ప్రారంభించాడు. ఇందులో భాగంగా గత యాసంగిలో రైతుల నుంచి మొక్కజొన్నలను కొనుగోలు చేశాడు. లక్ష్మీపురం, గోవిందాపురం (ఎల్) గ్రామాలకు చెందిన 17 మంది రైతుల నుంచి గత ఏడాది ఐదు లోడుల మొక్కజొన్నలను కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన మొక్కజొన్నలను హైదరాబాద్‌లోని బడంగ్ పేట, మారుతి నగర్‌కు చెందిన చాట్ల నాగభూషణం అనే ట్రేడర్‌కు వెంకటేశ్వర్లు మొక్కజొన్నలను విక్రయించాడు. ఇందుకుగాను ట్రేడర్ నాగభూషణం 43 లక్షల రూపాయలను వెంకటేశ్వర్లుకు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బుల కోసం వెంకటేశ్వర్లు ఏడాది కాలం నుంచి హైదరాబాద్‌లోని నాగభూషణం చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. అయినా నాగభూషణం డబ్బులు చెల్లించడం లేదు. ఈ క్రమంలో ఇరుగు వెంకటేశ్వర్లు జరిగిన విషయాన్ని



రైతులకు వివరించాడు. దీంతో రైతులు కూడా ఇరుగు వెంకటేశ్వర్లతో కలిసి అనేక దఫాలు హైదరాబాదులోనే నాగభూషణం వద్దకు వెళ్లారు. అయినా నాగభూషణం వీరిని లెక్కచేయడం లేదు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం రైతులు పసుపులేటి హనుమంతరావు, పెంట్యాల రాధాకృష్ణ మరికొందరు రైతులు కలిసి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను హైదరాబాదులో కలిసి సమస్యను వివరించారు. దీంతో తమ్మినేని వీరభద్రం ఆనాటి డిజిపి మహేంద్రరెడ్డితో రైతుల సమస్యను వివరించి ట్రేడర్ నాగభూషణం వద్ద నుంచి రైతులకు డబ్బులు ఇప్పించాలని కోరారు. దీంతో డిజిపి స్పందించారు. తమ్మినేని రైతులను డీజీపీ వద్దకు పంపించారు. దీంతో డిజిపి రైతుల వద్ద నుంచి ఫిర్యాదును స్వీకరించి నాగభూషణలను అక్కడకు పిలిపించారు. దీంతో నాగభూషణం డబ్బులు ఇస్తానని అంగీకరించాడు. 3 నెలల కాలంలో 43 లక్షలకు గాను 20 లక్షల రూపాయలు సంబంధిత వ్యాపారి వెంకటేశ్వర్లకు, రైతులకు చెల్లించాడు. మిగిలిన 23 లక్షల మాత్రం చెల్లించలేదు. మిగిలిన డబ్బుల కోసం వెంకటేశ్వర్లు తిరుగుతూనే ఉన్నాడు. విసుకు చెందిన వెంకటేశ్వర్లు మీర్‌పేట పోలీస్ స్టేషన్లో నాగభూషణంపై నాలుగు నెలల క్రితం ఫిర్యాదు చేశాడు. తాను డబ్బులు ఇవ్వను... ఏమి చేసుకుంటావో చేసుకోపో అంటూ వెంకటేశ్వర్లను బెదిరిస్తూ వచ్చాడు. కేసు పెడితే జైలుకు వెళ్లి బెయిల్ తెచ్చుకుంటానని అంతకంటే నీవు నన్ను ఏమి చేయలేవని నాగభూషణం బెదిరిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన బాధిత రైతులు పెట్యాల రాధాకృష్ణ, కళ్యాణపు నాగేశ్వరరావు, దువ్వల కోటయ్య, భీమినేని రమేష్, కోసూరి శ్రీను, కళ్యాణపు శ్రీను, కొమ్ము వెంకటేష లను తీసుకొని ఇరుగు వెంకటేశ్వర్లు తన భార్య, పిల్లలతో కలిసి హైదరాబాదులోనే నాగభూషణం ఇంటికి వెళ్లారు. రైతులు నాగభూషణం ఇంటి బయట రోడ్డుపై ఉండగా వెంకటేశ్వర్లు అతని భార్య యశోద, ఇద్దరు కుమార్తెలు అనూష, శిరీష నాగభూషణం ఇంటి ముందు కూర్చున్నారు. ఈ సమయంలో నాగభూషణం ఇంట్లోనే ఉన్నాడు. వెంకటేశ్వర్లు కుటుంబం నాగభూషణంతో మాట్లాడుతుండగానే పావుగంట వ్యవధిలోనే 30 మంది గూండాలు మరో పది మంది మహిళలు వాహనాలలో ఆగ మేఘాల మీద దిగారు. ఇదే సమయంలో నాగభూషణం వెంకటేశ్వర్లను, భార్య, పిల్లలను కులం పేరుతో దూషిస్తుండగానే వచ్చిన రౌడీ మూకలు వీరిపై పడి పిడిగుద్దులు గుద్దుతూ, రాళ్లతో దాడులు చేశారు. కొద్ది సమీపంలో ఉన్న రైతులపై కూడా దాడి చేయడంతో పెంట్యాల రాధాకృష్ణ, కళ్యాణపు నాగేశ్వరరావులకు కూడా గాయాలయ్యాయి. అదేవిధంగా అనూషపై కూడా దాడి చేశారు. ఈ దాడిలో అనూషకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు తీవ్ర మనస్తాపం చెందిన వెంకటేశ్వర్లు వెంటనే పురుగుమందు తాగాడు. స్థానికులు, రైతులు, భార్య పిల్లలు ఆ వెంటనే వెంకటేశ్వర్లను అపోలో ఆసుపత్రికి తరలించారు. అపోలో ఆసుపత్రి వైద్యులు రోజుకి లక్ష రూపాయల ఖర్చవుతుందని కుటుంబ సభ్యులకు స్పష్టం చేశారు దీంతో రైతులు ఆ ఖర్చుని నాగభూషణం భరించాలని కోరారు. అందుకు నాగభూషణం తిరస్కరిస్తూ చస్తే పారేస్తానే తప్ప ఆసుపత్రి ఖర్చు పైసా పెట్టుకోనని తెగేసి చెప్పాడు. దీంతో మరో మార్గం లేక వెళ్లిన రైతుల సహాయంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వెంకటేశ్వర్లు చికిత్స పొందుతున్నాడు. అయితే పరిస్థితి విషమంగానే ఉన్నట్లు కొంత సమయం గడిచే వరకు తాము చెప్పలేమని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనను కాంగ్రెస్ నాయకులు సీఎల్పీ నేత మల్లు బట్టి విక్రమార్కకు తెలిపారు. దీంతో మల్లు భట్టి విక్రమార్క సహచర ఎమ్మెల్యేలతో కలిసి అపోలో ఆసుపత్రిలో ఇరుగు వెంకటేశ్వర్ల లను పరామర్శించారు. జరిగిన విషయాన్ని వెంకటేశ్వర్ల కుటుంబ సభ్యులను, రైతులను అడిగి బట్టి తెలుసుకున్నారు. రైతులకు న్యాయం జరిగే విధంగా సహకరిస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఈ సంఘటనను మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రస్తావించారు.

**నాగభూషణంపై 'మీర్‌పేట' పోలీస్ స్టేషనలో అట్రాసిటీ కేసు నమోదు**

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మొక్కజొన్న వ్యాపారి ఇరుగు వెంకటేశ్వర్లు, అతని కుటుంబ సభ్యులపై, రైతులపై దాడి చేసిన హైదరాబాద్‌కు చెందిన ట్రేడర్ చాట్ల నాగభూషణంపై ఇరుగు వెంకటేశ్వర్లు భార్య ఇరుగు యశోద రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేసింది. మొక్కజొన్న డబ్బులు అడగడానికి వెళ్లిన తనను, తన భార్య పిల్లలను కులం పేరుతో దూషిస్తూ ఇష్టానుసారంగా బూతులు తిడుతూ చాట్ల నాగభూషణం అతను అనుచరులు తమపై, తమ వెంట వచ్చిన రైతులపై దాడి చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నది. తాను ఆత్మహత్యయత్నానికి పాల్పడటానికి నాగభూషణం కారణమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై 'మీర్ పేట' సిఐ మహేందర్ రెడ్డిని వివరణ కోరగా యశోద ఫిర్యాదు మేరకు నాగభూషణంపై (క్రైమ్ నెంబర్ 221/ 2023) చీటింగ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఆరోగ్యం, పరిశుభ్రత గ్రామపంచాయతీల లక్ష్యం : సీఈవో

**నవతెలంగాణ- వేంసూరు**

గ్రామపంచాయతీలలో ఆరోగ్యం, సంపూర్ణ పారిశుద్ధం లక్ష్యంగా పనిచేయాలని సీఈవో వి.అప్పారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ,పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో డిఎల్‌పిఓ పుల్లారావు, ఎంపీడీవో జి.రమేష్, ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, మారోజు సురేష్, ఈఓఆర్‌డి రంజిత్ కుమార్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఐఐటీలో అర్హత సాధించిన అరవింద్

**నవతెలంగాణ - బోనకల్**

రావినూతల గ్రామానికి చెందిన బానోత్ రవి, రజిత దంపతుల చిన్న కుమారుడు అరవింద్. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జేఈఈలో మెయిన్ రిజల్ట్ లో 99.09 పర్సంటెజ్ తెచ్చుకొని నిట్‌లో సీట్‌తో పాటు ఐఐటీ ఎగ్జామ్‌కు కూడా అర్హత సాధించాడు. అరవింద్ 10వ తరగతి రావినూతల ఉన్నత పాఠశాల నందు, ఇంటర్ క్రిష్ణవేణి కాలేజీ ఖమ్మం నందు ఎంపీసీ చదువుతున్నాడు. ఇంటర్ కాలేజీ నుండే ఈ ర్యాంక్ వచ్చింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గూగులోతు రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు పంతు, టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బానోత్ శివలా నాయక్, సిఐటియు మండల కో కన్వీనర్ గుగులోతు నరేష్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు బానోత్ గోపి, ఐద్వా మండల ఉపాధ్యక్షురాలు గూగులోతు శారద, ఎంపీటీసీ కందిమల్ల రాధ తదితరులు అభినందనలు తెలిపారు.

## ఆరోగ్య కేంద్రానికి ఆర్థిక సహాయం

**నవతెలంగాణ-వేంసూరు**

మండల పరిధిలోని చోడవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లక్ష యాభై వేల రూపాయలతో కావలసిన పరికరాలు ఫర్నిచర్‌ను నోస్ ల్యాబ్ అధినేత భీమిరెడ్డి సత్యానారాయణరెడ్డి సహకారంతో గురువారం గడ్డం ప్రతాపరెడ్డి యాకూబ్ రెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా చోడవరం సర్పంచ్ గాయం సద్గుణావతి రాంబాబు మాట్లాడుతూ ఎర్రగుంటపాడు గ్రామంలో జన్మించి పారిశ్రామికవేత్తగా ఎదిగి మండలంలో కోట్ల రూపాయల వ్యయంతో పాఠశాలల అభివృద్ధికి పాటుపడుతు ప్రభుత్వ కార్యాలయాలు ఆరోగ్య కేంద్రాలకు కావాల్సిన ఫర్నిచర్‌ను అందజేస్తున్నారని భీమిరెడ్డి సత్యానారాయణరెడ్డికి మండల ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోపాలరావు, ఏఎన్ఎం రమాదేవి, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జర్నలిస్టుల ఆందోళన

**నవతెలంగాణ-వైరా**

ఎన్నో సంవత్సరాలుగా వైరా నియోజకవర్గ కేంద్రంలో జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహారదీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు జర్నలిస్టులు కూడా పోరాడారని, గుర్తు చేస్తూ జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వదలుచుకుంటే పెద్ద లెక్క కాదన్నారు. దీక్షలకు టీడీపీ మండల అధ్యక్షులు చెరుకూరి చలపతిరావు, ఎంఎల్ పార్టీ నాయకులు అర్జున్‌రావులు సంఘీభావం తెలిపారు. గురువారం దీక్షలో సూతకాని ప్రేమ్ చంద్, భూక్యా శ్రీను, హతాహల్లా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం

**నవతెలంగాణ - బోనకల్**

మండల పరిధిలోని ఆళ్ళపాడు గ్రామానికి చెందిన బెజవాడ ఐతం కుటుంబ కలహాలతో పురుగుమందు తాగి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఆళ్లపాడు గ్రామానికి చెందిన బెజవాడ ఐతంకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కుటుంబ కలహాలతో ఐతం తన పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో 108లో ఐతంను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రైతులకు నాణ్యమైన ఉచిత కరెంటును అందించాలి

**నవతెలంగాణ - ఎర్రుపాలెం**



రాష్ట్రంలో విద్యుత్ సరఫరా లోపాల వలన రైతుల కష్టాలు వర్ణాతీతంగా ఉందని, రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంటును సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులకు సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని రైతులతో కలిసి అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి గొల్లపూడి కోటేశ్వరరావు, రైతులు షేక్ జానీ, తల్లపురెడ్డి సీతారామిరెడ్డి, అనుమోలు కోటేశ్వరరావు, దివ్వెల నారాయణ, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

### డీఈవో సోమశేఖర శర్మ

**నవ తెలంగాణ-ఖమ్మంరూరల్**

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని డీఈవో సోమశేఖరశర్మ అన్నారు. మండలంలోని జలగంనగర్, ముత్తగూడెం ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్యాంసన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అజిత, రమేష్, ఉపాధ్యాయులు,



విద్యార్థులు పాల్గొన్నారు.

# గొల్లకురుముల డీడీలు పరిగణలోకి తీసుకోండి

- అసెంబ్లీలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర
- సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- ఏప్రిల్‌లో పథకాన్ని మళ్లీ మొదలెడతాం
- పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని



**నవతెలంగాణ-సత్తుపల్లి**

గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య గొల్లకురుముల సమస్యలపై మాట్లాడారు. గొర్రెల పంపిణీ పథకం గురించి సండ్ర ప్రభుత్వానికి కూలంకుశంగా వివరించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఈ పథకాన్ని పొందేందుకు చాలా మంది లబ్దిదారులు డీడీలు కట్టారని సభలో ప్రస్తావించారు. కొద్దికాలం క్రితమే సత్తుపల్లి మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అవతరించింది. సత్తుపల్లి మున్సిపాలిటీగా మారిన తరువాత ఆయా డీడీలను వెనక్కి పంపారన్నారు. దీంతో సత్తుపల్లి గొల్లకురుమలలో ఆందోళన నెలకొందన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీగా మారినప్పటికీ ఇంకా వ్యవసాయ ఆధారిత కుటుంబాలు అనేకం ఉన్నాయన్నారు. కావున అందరి సంక్షేమాన్ని పరిగణలోకి తీసుకుని డీడీలు స్వీకరించాల్సిందిగా సండ్ర విజ్ఞప్తి చేశారు. కేవలం సత్తుపల్లిలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధమైన సమస్యను అనేక మంది లబ్దిదారులు ఎదుర్కొంటున్నారన్నారు. అందరికి న్యాయం జరిగేలా చర్యలు ఎప్పటిలోగా తీసుకుంటారో సభ ద్వారా తెలియజేయాల్సిందిగా ఎమ్మెల్యే సండ్ర ప్రభుత్వాన్ని కోరారు.

**స్పందించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్...**

ఎమ్మెల్యే సండ్ర గొల్లకురుములపై వెలిబుచ్చిన సమస్యపై పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. ముఖ్యమంత్రి ఓ గొప్ప పథకానికి శ్రీకారం చుట్టారని, వాటిలో తప్పులు దొర్లకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే డీడీలు కట్టిన వారే కాకుండా రాష్ట్రంలో మిగిలిన గొల్లకురుమ సోదరులు కూడా డీడీలు కట్టవలసిందిగా కోరారు. తప్పనిసరిగా అందరికి పథకాన్ని వర్తింపజేసి కచ్చితంగా మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారంలో పథకాన్ని ప్రారంభించి నాలుగైదు నెలలోనే పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# కేంద్ర బడ్జెట్ ప్రతులు దగ్ధం



**నవతెలంగాణ-ముదిగొండ**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేక చర్యని నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం చిరుమర్రి బాణాపురం గ్రామంలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ప్రజలకు భారంగా మారిందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ భారత దేశాన్ని బడా బాబులకు కొమ్ముగాస్తు ప్రజావ్యతిరేకమైన చర్యలు చేపడుతున్నారని ఆయన విమర్శించారు.కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్య ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్, నాయకులు బట్టు పురుషోత్తం, కందిమల్ల తిరుపతి, మాదారపు శ్రీనివాసరావు, టీఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, పాలవాయి పాండురంగారావు, బండి శేఖర్, గండు ఉపేందర్, మోర రామకృష్ణ, గాలి కోటయ్య, మండేపూడి శ్రీనాథ్, దోమల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

**కొణిజర్ల :** కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులకు, వ్యవసాయ కార్మికులకు మొండి చేయి చూపించిందని రైతు సంఘం జిల్లా నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో గురువారం బ్లాక్ డే నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా నారాయణ, వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, దుగ్గం రామలక్ష్మణ్, వెంకన్న నాగులు పాల్గొన్నారు.

**సత్తుపల్లి :** దేశానికి వెన్నుముక లాంటి వ్యవసాయ రంగానికి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధించడం సిగ్గుచేటని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రావుల రాజబాబు విమర్శించారు. బుధవారం దేశవ్యాప్తంగా రైతులు పిలుపునిచ్చిన బ్లాక్‌డేలో భాగంగా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలో రైతులతో కలిసి బడ్జెట్ ప్రతులను రాజబాబు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ నాడు నల్లచట్టాలు తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించి అందరూ ప్రతిఘటించడంతో దారిమార్చుకుని నేడు బడ్జెట్‌లో కోతలు విధిస్తూ రహస్య ఎజెండాను అమలు చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు బడ్జెట్ కేటాయించడానికి చేతులు రానటువంటి సర్కార్ ఉండడం మనందరి దౌర్భాగ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో మోదీ రైతుల దెబ్బను కచ్చితంగా రుచి చూస్తారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు కుమారస్వామి, కంచర్ల వెంకటేశ్వరరావు, విష్ణువర్ధన్, నాగేశ్వరరావు, మేకల కృష్ణ, వంశీ, అనిల్ పాల్గొన్నారు.

# వెట్టిచాకిరి విముక్తికై పోరాడిన గండ్లూరి

### గండ్లూరి కిషన్ రావు వర్ధంతి సభలో పొన్నం



**నవతెలంగాణ-ముదిగొండ**

భూస్వామ్య పెత్తందార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నాడు సాగిన ప్రజాపోరులో పేద ప్రజల వెట్టి చాకిరి విముక్తి చేసి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన గండ్లూరి కిషన్ రావు కమ్యూనిస్టు త్యాగధనుడని సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలో బాణాపురంలో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో గండ్లూరి కిషన్‌రావు 47 వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణాపురం ప్రాంతంలో పేదవర్గాలపై భూస్వామ్య దాడులను ఎదుర్కొని గండ్లూరి కిషన్‌రావు అగ్రభాగాన నిలిచి పెచ్చుమానికలకు వ్యతిరేకంగా పాలేరులా వేతనాలు, కూలి రేట్ల కోసం ఉద్యమించారన్నారు. గ్రామంలో ప్రజా ప్రతినిధిగా ప్రజలకు, పార్టీకి అనేక సేవలందించారన్నారు. సిపిఐ(ఎం) జిల్లా నాయకులు మాదినేని రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైనదన్నారు. గండ్లూరి స్ఫూర్తితో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. అనంతరం గండ్లూరి స్థూపం వద్ద పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు వేల్పుల భద్రయ్య, పాలవాయి పాండురంగారావు, కూరపాటి శ్రీనివాసరావు, వత్సవాయి సైదులు, టీఎస్ కళ్యాణ్, కోలేటి ఉపేందర్, కందిమల్ల తిరుపతి, చింతకాయల రామారావు, మేడి రవి, ఎం.శ్రీను, వి.నరసింహా రావు, ఎం.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యసాధనకు చిత్తశుద్ధితో పనిచేయాలి

### మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**నవతెలంగాణ-నేలకొండపల్లి**

విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాలలో రాణిం చేందుకు, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలగా, చిత్తశుద్ధితో పనిచేయాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వసుంధర ఒకేషనల్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత కళాశాల విద్యార్థులు, యాజమాన్యం తుమ్మల నాగేశ్వరరావుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. కన్న తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, బండి జగదీష్, జూకూరి గోపాలరావు, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, వేగినాటి లక్ష్మీనరసయ్య, కాసాని నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ ఈగ అనిల్ కుమార్, కొమ్మూరి నరేష్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాగయ్య కుటుంబాకు సండ్ర పరామర్శ

**నవతెలంగాణ-కల్లూరు**

మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామ మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటమనేని వెంకటేశ్వరరావు తండ్రీ కాటమనేని నాగయ్య (85) అకాల మరణం చెందగా సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య గురువారం నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కాటమనేని వెంకటేశ్వరరావు ఓదార్చారు. అదే విధంగా వల్లభనేని శ్రీనివాసరావు, నేరెళ్లలక్ష్మణరావు చిత్రపటాలకు పూలమాలలు వేసిన నివాళులర్పించి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచ్ గొల్లమండల ప్రసాద్, జడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, ఎంపీపీ బీరవల్లి రఘు, రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వల్లపునేని శ్రీనివాసరావు ఉన్నారు.



# శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయం కమిటీ మూకుమ్మడి రాజీనామా

**నవతెలంగాణ - బోనకల్**

శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి దేవాలయం కమిటీ మూకుమ్మడిగా బుధవారం తమ పదవులకు రాజీనామా చేశారు. చావ భద్రయ్య అనుసరిస్తున్న నియంతృత్వ పోకడలు, దేవాలయ కమిటీ నిబంధనలకు విరుద్ధంగా అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కమిటీ రాజీనామా చేసినట్లు చైర్మన్ చావా జానకి ప్రసాద్ తెలిపారు. జానకి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయాన్ని గ్రామస్తులందరూ నిర్మింప చేశారు. అయితే దేవాలయ నిర్మాణం, నిర్వాహణకు సంబంధించి చాలా భద్రయ్యను గ్రామస్తులందరూ లెక్కలు అడిగారు. దీంతో చావా భద్రయ్య లెక్కలు చెప్పడం లేదు. దీంతో గ్రామస్తులందరూ దేవాలయ నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయి కమిటీ వేయాలని, ఆ కమిటీ ద్వారానే దేవాలయ నిర్వహణ బాధ్యతలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ విధంగా అన్ని కులాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 18 ఏప్రిల్ 2022న దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ద్వారానే అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని, ఎవరూ వ్యక్తిగత నిర్ణయాలు ఆధారంగా నిర్వహించడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఆ విధంగా రెండు సంవత్సరాల పాటు కమిటీ ఉండే విధంగా కమిటీని ఏకగ్రీవంగా వేసుకున్నట్లు తెలిపారు. అయితే మూడు నెలల క్రితం చైర్మన్ జానకి ప్రసాద్ గర్భగుడిలో ఫ్యాన్ పెట్టేందుకు తన సొంత ఖర్చులతో ఫ్యాన్ తీసుకువచ్చాడు. అయితే ఆలయ పూజారి కొద్దిరోజుల తర్వాత ఫ్యాన్ పెడదామని చెప్పటంతో ఆగిపోయారు. అయితే చావా భద్రయ్య ఎవరికీ తెలియకుండా గర్భగుడిలోకి వెళ్లి తాను తీసుకువచ్చిన ఫ్యాన్‌ని బిగించాడు. ఈ విధంగా అనేక పనులను కమిటీ నిబంధనలకు వ్యతిరేకంగా, అక్రమంగా నిర్వహిస్తూ వస్తున్నాడు. దీంతో కమిటీ సమావేశం నిర్వహించి భద్రయ్య చర్యలకు నిరసనగా దేవాలయ కమిటీ సభ్యులు రాజీనామా చేసినట్లు తెలిపారు. తాము దేవాలయానికి సంబంధించి ఏ కార్యక్రమాలు చేసినా చావా భద్రయ్య వివాదాలు సృష్టిస్తూ, దేవాలయ నిర్వహణ సక్రమంగా జరగ కుండా అడ్డంకులు సృష్టిస్తున్నాడని వారు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో చైర్మన్ చావా జానకి ప్రసాద్, కార్యదర్శి చిర్రా బాబు, కోశాధికారి రావెళ్ళ లక్ష్మయ్య, కమిటీ సభ్యులు నిమ్మ తోట ఖాసా, నీలకంఠం రాము, నిమ్మ తోట రమేష్, ఆముదాల రంగారావు, జిడుగు వెంకటేశ్వర్లు, చాపలమడుగు శ్రీనివాసరావు, జంగం రామారావు, సింగాల పుల్లయ్య తదితరులు ఉన్నారు.

## కులాల మధ్య చిచ్చు పెడుతున్న ఎమ్మెల్యే భట్టి

**నవతెలంగాణ - బోనకల్**

సిఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క కులాల మధ్య చూపెడుతున్నారని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు రావుల హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మ కంటి సైదులు విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1964 సంవత్సరంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 98 జీవో తీసుకువచ్చి మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో ఇతర కులాలు ఉండటానికి వీలులేదని, కేవలం చేపల వృత్తి చేసే కులాలు మాత్రమే ఉండాలని స్పష్టం చేసిందన్నారు. ఆ విధంగానే నేటి వరకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో చేపల వృత్తి చేసే కులాలు మాత్రమే మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యులుగా ఉంటూ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కానీ మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీ సమావేశంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో చేపల వృత్తి చేయని ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలను కూడా చేర్చాలని డిమాండ్ చేయటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమా వేశంలో ఆ సంఘం జిల్లా గౌరవ సలహాదారు ప్రతానపు రామనాథం, జిల్లా కార్యదర్శి ప్రతానపు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పగడాల హనుమంతురావు, జిల్లా కోశాధికారి గాదె రాంబాబు, ఖమ్మం 16వ డివిజన్ అధ్యక్షుడు నర్ల శేషయ్య, బోనకల్ మండల అధ్యక్షుడు గనపారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గూడ్స్ రైలు నుండి పడిపోయిన బొగ్గు

### గంటన్నర పాటు నిలిచిన రైళ్లు

**నవతెలంగాణ-చింతకాని**

ఓ గూడ్స్ రైలు డోర్ లాక్ ఓపెన్ కావడంతో పెద్ద ఎత్తున బొగ్గు రైలు పట్టాలపై పడిన ఘటన పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. బొగ్గు తరలిస్తున్న గూడ్స్ రైలు వందనపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రాగానే డోర్ లాక్ ఓపెన్ కావడంతో వేగన్‌లో ఉన్న బొగ్గు పట్టాలపై పెద్ద ఎత్తున పడిపోయింది. వేగంగా వెళ్తున్న రైలు నుంచి బొగ్గు పడిపోవడంతో ఆ ప్రాంతంలో నల్లటి పొగ కమ్ముకుంది సిబ్బంది జెసిబి సహాయంతో రైలు పట్టాలపై ఉన్న బొగ్గును బయటకు తరలించారు. విజయవాడ వైపు వెళ్లే కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను ఖమ్మం రైల్వే స్టేషన్‌లో గంటన్నర పాటు నిలిపివేశారు. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలో విజయవాడ వైపు వెళుతున్న రైళ్లని గంటన్నర సేపు ఆలస్యంగా నడిచాయి.

## కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా...

### పదిమంది గాయాలు..

**నవతెలంగాణ -కూసుమంచి**

మండలంలోని నేలపట్ల గ్రామ శివారులో కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నేలపట్ల గ్రామంలోని ఓ రైతు మిర్చి తోట ఏరేందుకు సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం చనుపల్లి గ్రామానికి చెందిన కూలీలు ఆటోలో వస్తుండగా ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడింది.ఈ ఘటనలో పదిమందికి గాయాలైనట్లు తెలిసింది. వీరిని 108 లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

## విద్యార్థులకు అల్పాహారం వితరణ

**నవతెలంగాణ- తల్లాడ**

తల్లాడ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు డి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ధారా విష్ణు మోహన్ రావు కుమార్తె వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు అల్పాహారం అందజేస్తున్నట్లు తెలిపారు.



## క్రమబద్దీకరణ చేసి పట్టాలందించాలి

### తహశీల్దార్‌కు సీపీఐ(ఎం) వినతి

**నవతెలంగాణ -కూసుమంచి**

నిరు పేదలకు ఇళ్ళు, స్థలాలకు రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా క్రమబద్దీకరణ చేసి ప్రభుత్వం తక్షణమే పట్టాలను పేదలకు అందించాలని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కర్ణబాబు డిమాండ్ చేశారు. మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో హైస్కూల్ వెనక నివాసం ఉంటున్న సుమారు 100 నుండి 150 పేద కుటుంబాలకు ఇళ్ల, స్థలాలను క్రమబద్దీకరణ పేరుతో ప్రభుత్వం నోటీసులు అందజేసిందన్నారు. దీంతో ఏమి చేయలేని పరిస్థితిలో పేదలు ఉన్నారు .ఒక్కొక్క ఇంటి స్థలానికి క్రమబద్ధకరణ పేరు తో సుమారు 2 లక్షల రూపాయల నుండి 5 లక్షల రూపాయల వరకు చలానాలు చెల్లించి ఇంటి స్థలాన్ని క్రమబద్దీకరణ చేసుకోవాలని ప్రభుత్వం నోటీసులు అందించడం జరిగిందన్నారు. ఈ విషయం బాధిత కుటుంబాలు సిపిఎం గ్రామ శాఖ దృష్టికి తీసుకురాగా, గురువారం గ్రామంలోని నిర్వాసితులతో(బాధిత కుటుంబ సభ్యులతో) కలిసి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మీనన్‌ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు గన్యానాయక్, సీనియర్ నాయకులు మురళి, సోమయ్య, కృష్ణంరాజు, నిర్వాసితులు సైదులు, మల్సూర్, కరుణాచారి, వీరభద్రం, పెద్ద మల్సూర్, సంతోష్, వీరబాబు, ఉప్పయ్య, పుల్లయ్య, లింగాచారి తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**నవతెలంగాణ- ఖమ్మం**

నగరంలోని వి.డి.ఓస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ 62 చెక్కులకు గాను రూ.25,13,500లను బాధితులకు అందజేశారు. రూ.5,13,500 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బాధితులకు పంపిణీ చేశారు. వివిధ అనారోగ్యాలతో బాధపడుతూ చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) కి రవాణా శాఖ మంత్రి సిఫార్సు మేరకు ధరఖాస్తు చేసుకున్న బాధితులకు మంజూరైన ఆర్థిక సహాయం 62 చెక్కులకు గాను రూ.25,13,500లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు లబ్ధి చేకూర్చే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. నేటి వరకు 4117 లబ్ధిదారులకు రూ.17,96,09,650 కోట్లును పంపిణీ చేసి వారిని ఆదుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొలు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోరెపల్లి శ్వేత, వైస్ చైర్మన్ అఫ్జెల్, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పోరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సినీ పరిశ్రమలో చోటు దక్కించుకున్న 'నారాయణపురం' వాసి

**నవ తెలంగాణ - బోనకల్**




రెబల్స్ ఆఫ్ తుపాకులగూడెం సినిమా ద్వారా తెరంగేట్రం చేసిన నటుడు ఊటుకూరు వంశీకృష్ణ బోనకల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన యువకుడు. తన వృత్తిరీత్యా టిసిఎస్‌లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పనిచేసిన ఊటుకూరు వంశీకృష్ణ నటనపై తనకు కలిగిన మిక్కిలి అభిలాషతో తుపాకులగూడెం సినిమాలో చోటు సంపాదించి తొలి సినిమా తెరంగేట్రం చేశారు. మణిశర్మ సంగీత సారథ్యంలో వచ్చినటువంటి ఈ సినిమా పాటలు అశేష జనాదరణను పొందిన విషయం విదితమే. ఫిబ్రవరి 3న ప్రపంచవ్యాప్తంగా రిలీజై అశేష ప్రేక్షకుల ఆదరాభిమానాలతో దూసుకుపోతున్న తుపాకులగూడెం సినిమా సక్సెస్ ఈవెంట్‌ని ఖమ్మంలోని సివి రామన్ కాలేజీలో ఇటీవల నిర్వహించారు. ఈ సినిమాని వీక్షించినటువంటి ఖమ్మం జిల్లా ఉన్నతాధికారులు కూడా వంశీకృష్ణ ప్రతిభను కొనియాడారు. నక్సల్స్ బ్యాక్ గ్రౌండ్‌తో మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీత సారథ్యంలో వచ్చినటువంటి ఈ సినిమా స్టోరీ ఓరియంటెడ్‌గా యువతకు ఒక మంచి సందేశాత్మక చిత్రంగా దూసుకెళ్తున్న శుభ సందర్భంలో ఈ సినిమాను అందరూ ఆదరించాలని పలువురు గ్రామస్తులు, స్నేహితులు ఆకాంక్షిస్తూ వంశీకృష్ణకు అభినందనలు తెలుపుతున్నారు.

## కారేపల్లి తహశీల్దార్‌గా తూమటి శ్రీనివాస్

**నవతెలంగాణ-కారేపల్లి**

కారేపల్లి నూతన తహసీల్దార్‌గా ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో ఈ-సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న తూమటి శ్రీనివాస్ నియమితులైనారు. దీనికి సంబంధించి గురువారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కారేపల్లి ఇంచార్జీ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ కే.లక్ష్మి 2 నెలల 10 రోజులుగా వ్యవహరిస్తున్నారు. తహసీల్దార్ బాధ్యతలను తూమటి శ్రీనివాస్ శుక్రవారం స్వీకరించటం జరుగుతుందని సమాచారం.

## యువతి అదృశ్యం కేసు నమోదు

**నవతెలంగాణ-కారేపల్లి**

కారేపల్లి మండలం కమలాపురానికి చెందిన యువతి(19) అదృశ్యం కాగా కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. కొత్తకమలాపురంకు చెందిన యువతి ఇల్లందులో డిగ్రీ చదువుతుంది. 8వ తేదిన పరీక్ష రాయటానికి వెళ్ళిన యువతి రాత్రి అయినా ఇంటికి రాలేదు. యువతి జాడ కోసం కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నం విఫలం కావటంతో యువతి మేనమామ కారేపల్లి పోలీసులకు పిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్న సమయంలోనే యువతి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను హైదరాబాద్‌లో స్నేహితుల దగ్గరకు వెళ్ళినట్లు తెలిపింది. పోలీసులు యువతిని ఇంటికి రప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

## జేఎన్టీయూహెచ్ ఫలితాల్లో ప్రియదర్శిని విద్యార్థుల ప్రతిభ

**నవతెలంగాణ- ఖమ్మంరూరల్**

జేఎన్టీయూహెచ్ విడుదల చేసిన మొదటి ఏడాది రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలో సాయిప్రభాత్ నగర్‌లోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ తెలిపారు. సీఎస్సీలో వి.రూప 93 శాతం, చరిష్మా 90.57 శాతం, సీఎస్ఎం విభాగంలో షేక్ లుబిన ఫర్దోజ్ 90.50 శాతం, సయ్యద్ రుక్సానా 89.88 శాతం, ఏఐడీ విభాగంలో బి.హరిస్మిత 83శాతం, కృష్ణశ్రావణి 80.38శాతం, ఈసీఈ విభాగంలో బి.స్వరూప 88.25 శాతం, బి.సీత 87.50శాతం, ఫర్హాన 86.74 శాతం మార్కులను సాధించారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థినిలకు కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.గోపాల్, అధ్యాపకులు నరసింహారావు, రమేశ్, కుమారస్వామి పాల్గొన్నారు.

## బెల్లం వేణుని వెంటనే అరెస్ట్ చేయాలి

**నవతెలంగాణ- ఖమ్మం**

బిఆర్ఎస్ ఖమ్మంరూరల్ మండలం అధ్యక్షులు బెల్లం వేణుని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ గురువారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు వారియర్ ఎస్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐక్యవేదిక చైర్మన్ డాక్టర్ కెవి కృష్ణారావు, కన్వీనర్ గుంతేటి వీరభద్రం, కో కన్వీనర్స్ పెరుగు వెంకటరమణ మాట్లాడుతూ ఇటీవల బహుజన వర్గానికి చెందిన దేవాదాయ శాఖలో అధికారిగా పనిచేస్తున్న రెంటాల సమతను నోటికి వచ్చినట్టు తన ఇష్టానుసారంగా మాట్లాడి, విచక్షణారహితంగా మనసుని గాయపరిచి, ఆత్మహత్యాప్రయత్నానికి కారణమైన బెల్లం వేణును వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ యాక్ట్ పెట్టి కఠినంగా శిక్షించాలని, పోలీస్ కమిషనర్ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో నాయకులు బద్రు నాయక్, రెహమాన్, బి పద్మ చారి, నకిరేకంటి సంజీవరావు, షేక్ మస్తాన్, దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, మాల మహానాడు నాయకులు దాసరి శ్రీనివాస్, కాకుమాని రామారావు, గాదరి బాబు, అఖిల్ , ఉపేంద్ర నాయక్, రమ్య, స్వరూప, అడ్వకేట్ నజీమా పాల్గొన్నారు.

## అక్రమంగా ప్రజాసంఘాల నాయకుల అరెస్టు

**నవతెలంగాణ-ముదిగొండ**

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ఉద్యమానికి ముందస్తుగా గురువారం ముదిగొండలో ప్రజాసంఘాలా నాయకులు 12 మందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు.అరెస్ట్ అయిన వారిలో సిపిఐ (ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శి బట్టు రాజు, మెట్టెల సతీష్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పూరిమెట్ల సాయిరాం, ఐద్వా మండల అధ్యక్షులు మందరపు పద్మ తదితరులు ఉన్నారు.

## పోడుకు హక్కు కల్పనకు సన్నాహాలు : ఎంపీపీ

**నవతెలంగాణ-కారేపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేదలకు పోడు హక్కు కల్పన ప్రక్రియ కు అధికారులు సన్నానలు వేగవంతం చేశారని కారేపల్లి ఎంపీపీ మాలోత్ శకుంతలకిషోర్ తెలిపారు. గురువారం ఖమ్మంలో పోడు హక్కుపై ఎస్‌డీఎల్‌సీ, డీఎల్సీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో పాల్గొన్న ఎంపీపీ కారేపల్లి మండలంలో అర్హులైన పేదలు పోడు హక్కు కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారని వారి దరఖాస్తులు పరిశీలించి హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఎఫ్‌డీవో లను కోరినట్లు తెలిపారు. పోడు దరఖాస్తులను పరిగణలోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారన్నారు. త్వరలోనే పోడుకు హక్కు పత్రాలు జారీ చేయటం జరుగుతుందన్నారు. హక్కు పత్రాల జారీకి వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## శివరాత్రి సందర్భంగా నీలాద్రికి ప్రత్యేక బస్సులు

**నవతెలంగాణ-సత్తుపల్లి**

ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని సత్తుపల్లి బస్టాండ్ నుంచి నీలాద్రి శివాలయానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మీ తెలిపారు. 18వ తేదీన ఉదయం 4 గంటల నుంచి ప్రతీ 5 నిమిషాలకు ఓ బస్సు నీలాద్రికి బయలుదేరనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30గా టిక్కెట్టు ధర నిర్ణయించామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అదేవిధంగా వీఎం బంజర నుంచి కూడా నీలాద్రికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు 9958225990, 7382859284 నెంబర్లకు సంప్రదించాల్సిందిగా కోరారు.

## దళితుల హక్కులను పకడ్బందీగా అమలు చేయాలి

### - వైఎస్ఆర్టీపీ సత్తుపల్లి మండల అధ్యక్షులు శ్రీరామ

**నవతెలంగాణ-సత్తుపల్లి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులను కాపాడడంలో పూర్తిగా విఫలమయ్యాయని, హక్కులను పకడ్బందీగా అమలు చేయాలని వైఎస్ఆర్టీపీ సత్తుపల్లి మండల అధ్యక్షులు శ్రీరామ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కార్ ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాలకు చేసిందేదిలేదన్నారు. ఇప్పటికీ మండల పరిధిలోని అనేక గ్రామాలలో ఇండ్లు లేక అనేక మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సత్తుపల్లి మండల పరిధిలో అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధే నా లక్ష్యం

**-ప్రతి పేదవాడికి ఇల్లు, విద్య, వైద్యం ఉచితంగా అందించడమే ధ్యేయం**

**- టిపిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు**

**నవతెలంగాణ-కొత్తగూడెం**

కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్దే నా లక్ష్యమని, ప్రతి పేదవాడికి ఇల్లు, విద్య, వైద్యం ఉచితంగా అందించడమే నా ధ్యేయమని టిపిసిసి ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ పెట్రోల్ డీజిల్ నిత్యావసర అధిక ధరలు పెంచి సామాన్యుని నడ్డి విరుస్తుందన్నారు. గత ఎనిమిదేళ్ళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలనతో విసుగు చెందిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలనతో మాత్రమే సంక్షేమ పథకాలు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఉంటుందని పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జెబి.శౌరి, టిపిసిసి సభ్యులు ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు మాళోత్ రాందాస్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల అర్జున్ రావు, వీరాపురం రామలక్ష్మణ్ రావు, పెగడ బిక్షపతి, కసనబోయిన భద్రం, గౌస్ ఏలూరి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ ఫీజులు రద్దు చేయాలి

**బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్**

**నవతెలంగాణ-కొత్తగూడెం**

ట్రేడ్ లైసెన్స్ పేరుతో మున్సిపల్ సిబ్బంది అడ్డగోలుగా వసూలు చేస్తున్న ఫీజులు వెంటనే రద్దు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు ప్లకార్డులతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యాపారస్తులను భయభ్రాంతులకు గురిచేస్తూన్నారని, ట్రేడ్ లైసెన్స్ పేరుతో నోటీసులు ఇస్తున్నారని, గత సంవత్సరం షాపులు ఏర్పాటు చేసుకున్న వారు కూడా 2019 నుండి ట్రేడ్ లైసెన్స్ రుసుము డబ్బులు చెల్లించాలని నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ప్రతీ షాప్‌కు హరితనిధి క్రింద సంవత్సరానికి రూ.100 కట్టాలనడం ఏంటని...? ప్రశ్నించారు. గతంలో ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించిన వారికి కూడా కట్టలేదని నోటీసులు జారీ చేయడం మున్సిపల్ అధికారుల పారదర్శక పాలనకు అద్దం అద్దం పడుతుందని ఎద్దేవా చేశారు. వీధుల్లో, బస్తీలో చిన్న చిన్న దుకాణాలు పెట్టుకున్న వారికి కూడా నోటీసులు ఇస్తున్నారని, ఒకవైపు వందల కోట్ల నిధులు తీసుకోచ్చమని ప్రకటనలు ఇస్తూ ఇంకోవైపు వేలకు వేలు వసూలు చేయడం సరైంది కాదని సూచించారు. ఈ పద్దతి మార్చుకోవాలని హెచ్చరించారు. లేని పక్షంలో భవిష్యత్తులో వ్యాపారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయి, నాగుల రవికుమార్, ఆట శ్రీకాంత్, రాంబాబు, సరోజ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**నవతెలంగాణ-మణుగూరు**

మండలంలోని తిర్లాపురం గ్రామపంచాయతీలో బొగ్గం మంగయ్య దశదిన కర్మలకు జెడ్పిటిసి పోషం నరసింహారావు హాజరై పదివేల ఆర్థిక సహాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల అధ్యక్షులు ముత్యం బాబు, పెండ్యాల నాగేశ్వరరావు, బొలిశెట్టి నవీన్, కంఠం సురేష్, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత స్థానానికి ఎదగాలి

**డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్**

**నవతెలంగాణ-కొత్తగూడెం**

పాఠశాల విద్యార్థులు నిరంతరం కష్టపడి చదువుతూ సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం తో ఉన్నత స్థానానికి ఎదగాలని కొత్తగూడెం డిఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఆకాంక్షించారు. గురువారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) భద్రాద్రి జిల్లా కమిటీ, జిల్లా విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తగూడెం సింగరేణి పాఠశాలలో జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్టా జిల్లా అధ్యక్షులు షేక్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ ఇంగ్లీష్ భాషతో పాటు అన్ని సబ్జెక్టులలో కూడా విషయ, జ్ఞానం రాణించిన వారు ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు సాధిస్తున్నరని అన్నారు. సైబర్ నేరాలు బాగా జరుగుతున్న ఈ రోజుల్లో జాగ్రత్త గా ఉండాలని, విద్యార్థులు సెల్ ఫోన్‌ల కు దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానం పెంచటంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఎల్టా చేస్తున్న సెవలను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం 1 వ పట్టణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖ ఏఎంఓ రాజ శేఖర్, ఎల్టా జిల్లా ప్రెసిడెంట్ షేక్ దస్తగిరి, కోశాధికారి జహంగీర్ షరీఫ్, రాష్ట్ర కౌన్సిలర్ కైసర్ బేగం, వీకేర్ హాస్పటల్ చైర్మన్ మహమూద్ పాష, రమాదేవి, జానకీ దేవీ, సాలుకు, తావుర్య, రాంచందర్ రావు, హరిబాబు, జయదాస్, సునీత, వెంకన్న, ప్రేమ్ కుమార్, మురళీధర్, ప్రశాంత్, సింగరేణి హెచ్ఎం సాయి సుజాత పాల్గొన్నారు.



## మానవత్వం చాటిన సివిల్ ఇంజనీర్

**- అగ్ని బాధిత కుటుంబానికి రూ.5000 నగదు అందజేత**

**- ఇంటి స్థలం ఏర్పాటుకు హామీ**

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

ఉన్నత చదువులు చదివి ఆర్థికంగా స్థిర పడ్డప్పటికి ఏజన్సీ ప్రాంత గిరిజన బిడ్డగా ఆపదలో ఉన్నవారికి తాను ఉన్నాంటూ అపన్న హస్తం అందిస్తూ భరోసా కల్పిస్తున్నారు సివిల్ ఇంజనీర్ కొర్సా వెంకటేశ్వరరావు. దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొర్సా వెంకటేశ్వరరావు ఇరిగేషన్ శాఖలో ప్రస్తుతం డిఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఏజన్సీ ప్రాంత ప్రజలు ముఖ్యంగా మండలంలో ఎవరికైనా అపద వస్తే ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు వారికి మనోధైర్యం కల్పిస్తున్నారు. మండలంలో సీతానగరం గ్రామంలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన శ్యామల వెంకటేష్ పట్ల ఆయన మానవత్వం చాటుకున్నారు. వెంకటేష్ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ఆయన గురువారం సీతానగరం గ్రామం వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ 5000 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో పాటు ఇంటిని నిర్మించుకునేందుకు ఇంటి స్థలం కొని ఇస్తానని బాధిత కుటుంబానికి ఆయన భరోసా ఇచ్చారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పర్ణశాల గ్రామపంచాయితీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మీ, ఏటిపి రాష్ట్ర కార్యదర్శి సవలం వీరస్వామి, ఏఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు, జిల్లా అధ్యక్షులు తెల్లం నర్సింహారావు, డివిజన్ అధ్యక్షులు సోంది మల్లూరు, పొడియం వెంకటరమణ, **మురళి, నరేష్, వెంకటేశ్, కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.**




www.praja.khammam@gmail.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

# భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం 10 ఫిబ్రవరి 2023




## జేఈఈ మెయిన్స్‌లో దుమ్ముగూడెం విద్యార్థులు ప్రతిభ

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

జేఈఈ మెయిన్ ఫలితాల్లో దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. కొండ సాయితేజ 78.5, మండలోజు యువశ్రీ కృష్ణసాయి 70.6, బొందిలి మురళీ కృష్ణ 59.6 పర్సెంటైల్‌తో తమ ప్రతిభ చాటారు. కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ వెంకటేశ్వర్లుతో పాటు అద్యాపకులు, విద్యార్థుల తల్లి దండ్రులు విద్యార్థులను అభినందించారు.

# అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి : ఐటీడీఏ పీవో

**నవతెలంగాణ- భద్రాచలం**

సర్వేంద్రియానం నయనం ప్రధానం, మానవాళి జీవితంలో నవ రంధ్రాలతోపాటు శరీరంలోని అన్ని అవయవాలు పని చేసినప్పుడే మనిషి తన దయనందన కార్యక్రమాలు సజావుగా చేసుకుంటాడని, దానిలో ముఖ్యమై నవి మెదడుతో పాటు రెండు కళ్ళు మాత్రమేనని వాటిని జాగ్రత్తగా చూసుకుంటే ఎటువంటి అనర్థాలు జరగవని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రూ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు కేంద్రంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ప్రతిరోజు ఏ పనులు చేయాలన్నా సరియైన దృష్టి పెట్టాలంటే కంటి చూపు కరెక్ట్ గా ఉన్నప్పుడే చేయగలుగుతామని, అందుకు కన్నులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రతి ఒక్కరు కండ్ల పరీక్ష చేయించుకొని దష్టిలోపం ఏమైనా ఉంటే,దానికి సంబంధించిన మందులు వాడి కళ్ళజోళ్ళు ప్రతిరోజూ వేసుకుంటే కండ్లకు సంబంధించిన పాయింట్లు త్వరగా తగ్గిపోయి కళ్ళజోళ్ళు ధరించవలసిన అవసరం కూడా ఉండదని అన్నారు. ఆహార నియమాలు కచ్చితంగా పాటించాలని ముఖ్యంగా ఆకుకూరలు, చిరుధాన్యాలు ప్రతిరోజు క్రమం తప్పకుండా తీసుకుంటే ఎటువంటి దృష్టిలోపం ఉండదని, అందుకు తగినట్లు ఆదివాసి గ్రామాల్లో పనిచేయుచున్న వైద్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గిరిజనులకు, ఆహార నియమాల గురించి వారికి తెలియజేయాలని అన్నారు. అనంతరం కంటి వెలుగుకి సంబంధించిన రికార్డులను పరిశీలించి కంటి వెలుగు కేంద్రాల గురించి గ్రామాలలో విరివిగా ప్రచారం చేయించాలని, కంటి వెలుగు కేంద్రాలకు జనం వచ్చేలా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని



అన్నారు. ఇప్పటివరకు ఇక్కడ జరుగుతున్న కేంద్రంలో ఎంతమంది కండ్ల పరీక్ష చేయించుకున్నారని డి.ఎం.అండ్.హెచ్.ఓని అడిగి తెలుసుకుని, ఐటిడిఏ చుట్టుపక్కల ఉన్న ప్రతి ఇంటి ఇంటికి తిరిగి ఈ కేంద్రం గురించి తెలియజేసి అందరికీ కండ్ల పరీక్షలు చేయించాలని తెలుపుతూ ఆర్థిక స్తోమత లేని నిరుపేదలైన గిరిజనులకు ఇటువంటి కండ్ల పరీక్షల గురించి తెలియదని, వారికి పూర్తి స్థాయిలో తెలియజేసి కంటి పరీక్షలు చేసి సరియైన మందులు ప్రతిరోజూ తీసుకోవలసిన ఆహారం గురించి తెలియజేసి కళ్ళజోళ్ళు అందించాలని కోరారు. ప్రభుత్వం మన జిల్లాకి ఇచ్చిన కంటి పరీక్షల ప్రగతి కంటే ఎక్కువ శాతం ప్రగతి సాధించేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కంటి వెలుగు కేంద్రాలకు ప్రజలు వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. అనంతరం కంటి వెలుగు కేంద్రంలోని కరపత్రాలను కళ్ళజోళ్లను పరిశీలించి, కంటి పరీక్ష చేయించుకున్న వారికి కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిఎంహెచ్ఓ శిరీష, కేంద్రం ఇంచార్జ్ వినయ్, పీఎంవో వినయ్ కుమార్, హెచ్‌వి సంధ్యా వాణి, ఏఎన్ఎంలు నాగమణి, విజయలక్ష్మి, డిఈఓ యాకూబ్ రెడ్డి, ఆశా వర్కర్లు రమాదేవి, పార్వతి, మలేరియా హెచ్ఇఓ కృష్ణయ్య, దుర్గయ్య, ఏడీఎంహెచ్వో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్యాకేజీలు దుష్ప్రచారమే..

**- విలువలకు కట్టుబడి ఉన్నాం**

**- మూడేళ్లుగా వార్డులో అభివృద్ధిని అడ్డకున్నారు**

**- చైర్మన్ ను గద్దె దింపాల్సిందే..**

**- బీఆర్ఎస్ పార్టీలోనే ఎమ్మెల్యే వెంటే ఉంటాం**

**- విలేకరుల సమావేశంలో వార్డ్ కౌన్సిలర్ మాధవి**

**నవతెలంగాణ-ఇల్లందు**

గత మూడు సంవత్సరాలుగా చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అభివృద్ధికి అనేక ఆటంకాలు కలిగిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేసినందునే ఆయన తీరును నిరసిస్తూ కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఇచ్చాం. కానీ ప్యాకేజీలు తీసుకున్నామంటూ దుష్ప్రచారాలు చేస్తూ మహిళా కౌన్సిలర్ల ఇండ్ల ఎదుట ధర్నాలు చేయడం సరికాదని ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు 7వ వార్డు కౌన్సిలర్ సామల మాధవి రవితేజ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్యాకేజీ లాంటివి తీసుకోకుండా విలువలకు కట్టుబడి ఉన్నామన్నారు. చైర్మన్ కు నచ్చిన వార్డ్ లోనే అభివృద్ధి చేసుకున్నారని కనీసం పారిశుద్ధ పనులు కూడా సిబ్బందిని చేయనివ్వడం లేదని అన్నారు. ఎన్నో రకాల అవమానాలకు గురిచేశారని అన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ హర్సింగ్ నాయక్, టీఆర్ఎస్ పార్టీ నేతల దృష్టికి సమస్యలు తీసుకెళ్లామన్నారు. అయినప్పటికీ మున్సిపల్ చైర్మన్ తీరు మార్చుకో లేదన్నారు. 24 వార్డులకు గాను 18మంది వార్డ్ కౌన్సిలర్సు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యామన్నారు. మున్సిపల్ చైర్మన్ గద్దె దిగితేనే మున్సిపాలిటీకి, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చైర్మన్ ను తొలగించే వరకు విశ్రమించమన్నారు.



## శ్రీ ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

**అలరించిన సినీ డాన్స్ హంగామా**

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**



మండలం కేంద్రమైన దుమ్ముగూడెం గ్రామంలో జరుగుతున్న గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి 22వ జాతర మహోత్సవములలో భాగంగా గురువారం అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నాల్గవ రోజు అమ్మవారి అలంకరణలో భాగంగా విజయవాడ వాస్తవ్యులు గోకంటి ప్రసాదరావు , సరిత దంపతులు అందజేసిన పట్టు చీరతో ఉదయం అలంకరణ, వెంకటాపురం వాస్తవ్యులు రాచూరి సత్యవతి కుటుంబ సభ్యులు అందజేసిన మధ్యాహ్నం అలంకరణ, దుమ్ముగూడెం వాస్తవ్యులు మాదిరెడ్డి నర్సింహారావు, లక్ష్మీ వారి కుటుంబ సభ్యులు అందజేసిన పట్టు చీరతో సాయంత్రం అలంకరణతో పాటు అభిషేకములు, పుష్పాలంకరణ, కుంకుపూజ వంటి విశేష పూజలు నిర్వహించారు. కాగా భక్తులు అందజేసిన విరాళాలతో సుమారు 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రాత్రి గం 8.30 లకు నిర్వహించిన సినీ డాన్స్ హంగామా ప్రేక్షకులను అలరించింది. జాతరలో ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ దోమల రమేష్ పర్యవేక్షణలో పోలీస్, సిఆర్‌పిఎఫ్ బలగాలు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దుమ్ముగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్నారు.



## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం

**రూ.2 లక్షలు ఆస్తి నష్టం...**

**నవతెలంగాణ - అశ్వారావుపేట**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మండలంలోని గుర్రాల చెరువులో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్రధాన అగ్నిమాపకుడు సుబ్బయ్య తెలిపిన వివరాల ప్రకారం గుర్రాల చెరువు కు చెందిన చుండ్రు దుర్గారావు డాబాలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు రేగాయి. పొరుగున ఉన్న ఒకరు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా స్పందించి వెంటనే మంటలు అదుపు చేసామని అన్నారు. ఈ ప్రమాదంలో కరెంట్ మీటర్, పిల్లల సర్టిఫికేట్ లు, భూమి పట్టా పుస్తకాలు, బ్యాంక్ ఖాతా పుస్తకాలు, దుస్తులు, టీవీ మొదలగు వస్తువులు దగ్ధం అయ్యాయని, వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉండొచ్చు అని తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎస్.హెచ్.ఓ ఎస్.ఐ రాజేష్ అగ్నిప్రమాదానికి గురైన గృహాన్ని పరిశీలించారు.

# గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**నవతెలంగాణ-భద్రాచలం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకుల పాఠశాలలలో ఇంగ్లీష్ మీడియంలో ఐదో తరగతిలో ప్రవేశానికి గిరిజన బాల, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు అభివృద్ధి చెందిన ఇతర వర్గాల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యను అందిస్తూ వారిలో సహజ సిద్ధమైన నైపుణ్యాలను వెలికితీస్తూ ఆ విద్యార్థులను 21వ శతాబ్దపు సవాళ్లను దీటుగా ఎదుర్కోవడానికి సిద్ధం చేయుటకు, గిరిజన గురుకుల సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇంగ్లీష్ మీడియంలో విద్యనభ్యసించడానికి ఈ పాఠశాలలను నెలకొల్పిందని ఆయన అన్నారు. ఈ పాఠశాలలో ప్రవేశం కోరు అభ్యర్థులు దరఖాస్తులు ఆన్లైన్లో సమర్పించాలని కోరారు. అభ్యర్థులు తమ అర్హతలను పరిశీలించుకొని 9, ఫిబ్రవరి 2023 నుంచి 6 మార్చి 2023 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక ఫోన్ నెంబర్ తో ఒక దరఖాస్తు మాత్రమే చేయాలని, వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేసినచో అట్టివారిపై సెక్షన్ 416 ఆఫ్ ఐపీసీ 860 ప్రకారము క్రిమినల్ చర్యలు చేపట్టబడునని, విద్యార్థుల ఎంపికకు పాత జిల్లా ఒక యూనిట్ గా పరిగణించబడుతుందని, ఇతర సమాచారం కొరకు హెల్ప్ లైన్ నెంబర్ 180042545678 ని లేదా ప్రాస్పెక్టస్ లో పేర్కొన్న సంబంధిత జిల్లా ప్రధాన చార్యులను ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఫోన్లో సంప్రదించవచ్చునని ఆయన అన్నారు. 2022 -23 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, విద్యార్థిని, విద్యార్థులు ఈ సంవత్సరం నాలుగో తరగతి చదువుతున్నట్లుగా ధ్రువీకరణ పత్రం అనగా బోనఫైడ్, స్టడీ సర్టిఫికెట్ ను అప్లోడ్ చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు.

**బ్యాక్ లాగ్ ఖాళీ ప్రవేశాల కోసం దరఖాస్తు ఆహ్వానం**

2023 -24 విద్యా సంవత్సరానికి 6, 7, 8వ తరగతిలో లభించే బ్యాక్ లాగ్ ఖాళీల (బిఎల్‌వి)లను భర్తీ చేయుటకు రాష్ట్రంలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో ప్రవేశం కొరకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలోని స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలురు) లకు ఖమ్మం నందు ఎనిమిదో తరగతిలో మాత్రమే రెగ్యులర్ ప్రవేశం కొరకు దరఖాస్తుల కోరుచున్నట్లు, దానికి సంబంధించిన పూర్తి వివరాలు ప్రోస్పెక్టస్ లో అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. అర్హత గల విద్యార్థులు ఆన్లైన్ దరఖాస్తులు



మాత్రమే అంగీకరించబడునని, వెబ్సైట్ ద్వారా ఈ నెల 9 నుంచి 7 మార్చ్ 2023 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ ప్రవేశాల కొరకు తెలంగాణ అంతట సూచించబడిన కేంద్రాలలో 16 ఏప్రిల్ 2023 ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 1 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడునని, ఈ పాఠశాలల్లో ఖాళీల వివరాలు, దానికి సంబంధించిన సమాచారం వెబ్‌సైట్‌లో చూసుకొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన అన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించిన డిఎంహెచ్ఓ

**నవతెలంగాణ-కరకగూడెం**



మండల పరిధిలోని చిరుమళ్ళ గ్రామపంచాయతీలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి శిరీష పరిశీలించారు. కంటి వెలుగులోని లబ్ధిదారులకు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. అందత్వ నిర్మూలనే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమం జరుగుతుందని నిరుపేదలకు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో అందుతున్న వైద్య వివరాలను వైద్యాధికారి మధుని అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆమె సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మధు కంటి వెలుగు వైద్యాధికారి బైరిశెట్టి నరేష్, కంటి వైద్య నిపుణులు, డాక్టర్ సంజీవరావు, గొంది వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ పాయం నరసింహారావు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

## 13న ఉచిత నేత్ర వైద్య శిబిరం

**నవతెలంగాణ - భద్రాచలం**

ఈ నెల 13న ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు భద్రాచలం పట్టణంలోపాత ఎల్.ఐ.సి ఆఫీసు ఎదురుగా గల ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యాలయంలో శరత్ మ్యాక్సీ విజన్ ఐ ఆసుపత్రి వరంగల్ వైద్యులచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు తెలిపారు. కేంద్రం ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, కోల్ మైన్ పెన్షనర్స్, హెల్త్ కార్డు కలిగిన వారందరు అర్హులని, పరీక్షల అనంతరం శుక్లాలు కలిగిన వారిని ఆసుపత్రి వారి వాహనంలో వరంగల్ తీసుకువెళ్లి ఆపరేషన్ చేసి తిరిగి కార్యాలయం వద్ద దింపుతారని పేర్కొన్నారు. వీరికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించి ఉచితంగా మందులు కూడా ఇస్తారని తెలిపారు. ఈ కేంద్రంకు వచ్చునపుడు తప్పనిసరిగా హెల్త్ కార్డు తీసుకు రావాల్సి వుంటుందని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ భద్రాచలం అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎల్‌వి ప్రసాద్, కోశాధికారి డి.కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షులు వై.మంగయ్య, నాళం నాగేశ్వరరావు, సుబ్బయ్య చౌదరి, శివప్రసాద్, కిష్టారావు, బదరీనాథ్ రామ్మోహన్రావు తదితరులు తెలిపారు.

## వార్డు విజిట్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**మున్సిపల్ కమిషనర్ రఘు**

**నవతెలంగాణ-కొత్తగూడెం**

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల పరిశీలన ద్వారా కొత్తగూడెం మున్సిపాలిటీలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు పేర్కొన్నారు. గురువారం రామవరం 10వ వార్డులోని నెహ్రూ బస్తి, లక్ష్మీ టాకీస్ ఏరియా, బర్మాక్యాంప్, నాగయ్య గడ్డ కాలనీలో వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ ఆధ్వర్యంలో వార్డు విజిట్ చేశారు. వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యల్లో కిన్నెరసాని మంచినీటి సరఫరాలో ఏర్పడిన అవాంతరాన్ని, అలాగే సైడ్ కాలువలు, రోడ్లు, ఓపెన్ జిమ్ మొదలైన సమస్యలను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరించగలిగే సమస్యలను పరిశీలించారు. తన కింది సిబ్బందికి ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధులతో ముడిపడి ఉన్న కొన్ని సమస్యలను వచ్చే మున్సిపాలిటీకి వచ్చే నిధుల ఆధారితంగా ఆ సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రభాకర్, ఏఈలు సాహితీ, రాము, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కలాం, మధుకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 12న ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ యూనియాన్ మహాసభ

**జయప్రదం చేయండి-సిఐటియూ**

**నవతెలంగాణ-కొత్తగూడెం**

కొత్తగూడెంలో ఈనెల 12 న ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ యూనియాన్ మహాసభ నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్‌లు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో అద్దె బస్సు డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రైవేటు హెయిర్ బస్ డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మహాసభను 12న సీఐటియూ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలో అద్దె బస్సులో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు జీతాల పెంపు కోసం, వారి సంక్షేమం కోసం ఈ మహాసభలో చర్చించబోతున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో పనిచేస్తున్న పర్మెనెంట్ డ్రైవర్లు వర్కర్స్‌తో సమానంగా హైర్ బస్ కార్మికులు పనిచేస్తున్నారని వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అద్దె బస్సుల ఓనర్లు, ప్రభుత్వం వెంటనే చర్చించి కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అద్దె బస్సుల ఓనర్లు, ప్రభుత్వం వెంటనే చర్చించి కార్మికుల సమస్యల పరిష్కరించాలని, రానున్న కాలంలో అద్దె బస్సు డ్రైవర్ల హెల్పర్ల సమస్యలపై ఐక్య పోరాటం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కె.నరసింహ, శ్రావన్ కుమార్, శ్రీకాంత్, సైదులు, రాము, కళ్యాణ్, పాషా, నగేష్, కలీల్, ప్రేమ్ కుమార్, శివ, రాజు, ఓం ప్రకాష్, రాజబాబు పాల్గొన్నారు.

## సూపర్ స్పెషాలిటీ మెడికల్ ఇనిస్టిట్యూట్ గా అభివృద్ధి చేయాలి

**డాక్టర్ ఎస్ ఎల్ కాంతారావు**

**నవతెలంగాణ-భద్రాచలం**

ఏరియా హాస్పిటల్ భద్రాచలం సూపర్ స్పెషాలిటీ మెడికల్ ఇన్స్టిట్యూట్ గా అభివృద్ధి చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు అభిప్రాయపడ్డారు. హైదరాబాదులోని రాజ్ భవన్లో రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర్య రాజన్ సమక్షంలో ఏజెన్సీ ప్రాంతంలోని వైద్య సేవలు కల్పించుట విషయంపై నిర్వహించిన మెడికల్ దర్బారులో... డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రస్తుతం 200 పడకల ఆసుపత్రిగా ఉందని, తెలంగాణ రాష్ట్రంతో పాటు పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ తదిత రాష్ట్రాల నుంచి కూడా రోగులు నిత్యం ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఇది గిరిజన ప్రాంతానికి మెడికల్ హబ్ గా ఉందని ఈ నేపథ్యంలో... సూపర్ స్పెషాలిటీ మెడికల్ ఇన్స్టిట్యూట్ గా సెంట్రల్ హెల్త్ మిషన్ ద్వారా గాని, రాష్ట్ర మెడికల్ బడ్జెట్ నుంచి గాని అభివృద్ధిపరిచి కొత్తగూడెంలోని మెడికల్ కాలేజీకి అనుసంధానం చేయాలని కోరారు. తద్వారా వెనకబడిన గిరిజన ప్రాంతం పేదరికంతో అల్లాడుతున్న ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా తలసేమియా, సికిల్ సెల్ వార్డ్ అభివృద్ధి చేయాలని కోరారు.



## బస్సులో ప్రయానించిన డీఎం

**నవతెలంగాణ-ఇల్లందు**

కొత్తగూడెం నుండి ఇల్లందుకు ఇల్లందు నుండి కొత్తగూడెంకు బస్సులో కొత్తగూడెం డిపో మేనేజర్ భాణాల వెంకటేశ్వర రావు గురువారం ప్రయానించారు. డ్యూటీలో ఉన్న కండక్టర్, డ్రైవర్‌తో మాట్లాడి కెఎంపిఎల్ గురించి అడిగి తెలుసుకొనన్నారు. ఎక్కువ డబ్బులు, ఆయిల్ ఆదా చేయాలని తెలియజేశారు. ప్రయాణికులతో మాట్లాడి బస్సులు అతి తక్కువ ఛార్జీలతో ప్రమాదాలు జరగకుండా క్షేమంగా మీ ఇంటికి చేరుస్తాయని తెలియ జేసినారు. అదేవిధంగా ఇల్లందు బస్టాండ్‌ను, నూతనంగా ప్రారంభం కాబోయే ఇల్లందు డిపో ను పరిశీలించారు. వారి వెంట ఇసనపల్లి శామ్యూల్, ఇల్లందు బస్టాండ్ ఇంచార్జి నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సారేపల్లి నాగశిరోమణికి ఘనమైన నివాళి

**నవతెలంగాణ-చంద్రుగొండ**

సారేపల్లి నాగ శిరోమణి మృతదేహానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని ఐలయ్య పూలమాలవేసి ఘనమైన నివాళి అర్పించారు. సాయి కృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని సారే పెల్లి శేఖర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, అన్నవరపు సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి, మండల కమిటీ సభ్యులు పెద్దని వేణు పాల్గొన్నారు.

## అటవీ హక్కుల సవరణ బిల్లు రద్దు చేయాలి

### సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్...

**నవతెలంగాణ-చంద్రుగొండ**

కేంద్ర ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం సవరణ బిల్లు రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు షేక్ ఉమ్మర్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జూనియర్ అసిస్టెంట్ రఘుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వరికుటి వెంకట్రావు, మండల నాయకులు భీముడు, అజ్మీరా బద్రు తదితరులు పాల్గొన్నారు.

## మిలీనియం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు

**నవతెలంగాణ-చంద్రుగొండ**

చుంద్రుగొండ రైతు వేదికలో ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, కంటి వెలుగు కోసం వచ్చిన వారికి మిలీనియం కొత్తగూడెం లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించినారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, మిలీనియం లయన్స్ క్లబ్ కొత్తగూడెం సెక్రటరీ గుప్తుల శ్రీనివాసరావు, కోశాధికారి మూడు బాలు నాయక్ ,సభ్యులు బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర బడ్జెట్‌లో రైతులకు నిధులు పెంచాలి

### బడ్జెట్ ప్రతులు తగలబెట్టిన రైతుసంఘం నాయకులు

**నవతెలంగాణ-ములకలపల్లి**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీరని అన్యాయం జరిగిందని రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ ఆరోపించారు. గురువారం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ములకలపల్లి మండల కేంద్రంలో రైతులతో కలిసి కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఊకంటి మాట్లాడుతూ. దేశానికి అన్నం పెట్టే రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేదా అని ప్రశ్నించారు. కేంద్రం రైతులను చిన్నచూపు చూస్తుందని, ఎరువులపై రైతులకు రావాల్సిన సబ్సిడీలను తగ్గించిందని, మోటార్లకు మీటర్లు, విద్యుత్ సవరణ చట్టాలను వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతులకు మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోపగాని లక్ష్మీనరసయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, ఖైరు ప్రసాద్, ముదిగొండ శ్రీను, కొయ్యల ముత్తయ్య శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ సబ్ స్టేషన్ ను ముట్టడించిన రైతులు

### త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా పై స్పష్టమైన హామీ ఇవ్వాలి

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

త్రీ పేస్ విదుత్య సరఫరాలో తరచూ ఏర్పడుతున్న అంతరాయాన్ని నిరసిస్తూ గురువారం మండల రైతులు ములకపాడు గ్రామంలో గల విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. త్రీ పేస్ విద్యుత్ ఉన్నప్పటికి సరఫరా చేయడంలో జరుగుతున్న అంతారాయం వలన కరెంట్‌పై ఆధారపడి వ్యవసాయ సాగు చేస్తున్న రైతుల పంటలు ఎండి పోతున్నాయని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం 24 గంటలు ఇస్తామంటున్న కరెంట్ ఇవ్వక పోగా ఇస్తున్న కరెంట్‌కు సమయ పాలన లేకుండా అందజేయడం వలన వ్యవసాయం దెబ్బ తినే ప్రమాదం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిఈ వేణుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక మీదట త్రీ ఫేస్ విద్యుత్‌ను సమయానుకూలంగా అందిస్తామని హామీ ఇవ్వడతంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు యలమంచి శ్రీనుబాబు, కొడాలి లోకేష్‌బాబు, ముళ్లపూడి చిన్నారావు, కారం పుల్లయ్య, యలమంచి వంశీకృష్ణ, రావులపల్లి పృధ్వీ, క్రాప వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

**నవతెలంగాణ-మణుగూరు**

మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్షులు టీవీఎం వి.ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికుల మూడవరోజు పాల్గొని మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకి జీవో నెంబర్ 60 ప్రకారం పెరిగిన జీతాలు 20 నెలల నుంచి ఇవ్వ ఇవ్వడం లేదన్నారు. అంతేకాకుండా గత మూడు నెలల నుండి జీతాలు రాక నానా అవస్థలు పడుతున్నారన్నారు. వీరందరికీ వారికి వచ్చే అరకొర జీతాలతో ఇల్లు గడవక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో పెరిగిన జీతాలు 20 నెలల నుండి రాక పోగా పని చేస్తున్నటువంటి మూడు నెలల నుండి జీతాలు రాకపోవడం వలన ఇల్లు కలవ లేదంటున్నారు. ఏమి చేయలేని పరిస్థితిలో ఎన్నిసార్లు కమిషనర్ విన్నవించుకున్నా వారు పట్టించుకోకపోవడం వలన సమ్మెకు దిగవలసి వచ్చిందన్నారు.

# కార్పొరేట్ కంపెనీల అనుకూల బడ్జెట్

**నవతెలంగాణ-చంద్రుగొండ**



కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు రైతులను బలిచ్చే విధంగా ఉందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య అన్నారు. గురువారం చంద్రుగొండ సెంటర్లో బడ్జెట్ కాగితాలను తగలబెడుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో ఎరువులు సబ్సిడీ 70 వేల కోట్ల రూపాయల తగ్గించటం, వ్యవసాయ పరిశోధనలకు నిధులు కేటాయించకపోవడం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మూసి వేయాలనే ఆలోచనతో కేంద్ర బడ్జెట్‌లో కేవలం లక్ష రూపాయలు మాత్రమే కేటాయించారని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసిఐ ద్వారా పత్తి ధర క్వింటాళ్లకు 12 వేల నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం అనుబంధ రంగాలకు నిధులు కేటాయింపు కోత పెట్టడం ద్వారా రైతులను కార్పొరేట్ కంపెనీల కోసం బలి చేసే విధానాన్ని అనుసరిస్తుందన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా పత్తి కొనుగోలు చేసే సంస్థను పూర్తిగా ఎత్తి వేసేందుకు కేవలం లక్ష రూపాయలు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారని అన్నారు, ఈ సీజన్లో అధిక వర్షాల వల్ల పత్తి దిగుబడి తగ్గి ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉంటే ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాల్సిన బాధ్యత నుంచి విస్మరించిందని అన్నారు. క్వింటాలకు 12 వేల రూపాయలు ధర నిర్ణయించి సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ విధానం రైతులకు అనుకూలంగా ఉందని ప్రచారం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో పంటల భీమా పథకానికి నిధులు కేటాయించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కొండపల్లి శ్రీధర్, రైతు సంఘం జిల్లా నాయకులు మామిళ్ళ వెంకటేశ్వర్లు, సంఘం మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి, సర్పంచ్ కాకా సీత, వ్యవసాయ కార్మిక సంఘం సంఘం మండల కార్యదర్శి పెద్దిని వేణు, రాయి రాజా, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, దాసరి సీతారాములు, నాగులు మీరా, అబ్దుల్ రెహమాన్ కాక హనుమంతరావు పాల్గొన్నారు.

# జెడ్పీ చైర్మన్ కోరం సుడిగాలి పర్యటన

**నవతెలంగాణ-ఇల్లందు**



ప్రజల సౌకర్యం కోసం కొమరారం మండలం, ఇల్లందు రెవెన్యూ డివిజన్ చేయాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మండలంలో గురువారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరారంను మండలంగా ప్రకటించాలని కోరుతూ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా చేపడుతున్న రిలే నిరాహారదీక్షకు మద్దతు తెలుపుతూ దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ కొమరారాన్ని మండలంగా ప్రకటించాలని గత ఎనిదేళ్లుగా పోరాటం సాగిస్తున్నారని, తాను ఎమ్మెల్యేగా ఉన్నటువంటి సమయంలో కూడా 2015 సంవత్సరం సెప్టంబర్ 21న అప్పటి జిల్లా కలెక్టర్ లోకేష్ కుమార్ సైతం వినతి పత్రం అందజేయటం జరిగిందని గుర్తుచేశారు. అనంతరం కొమరారం గ్రామ శివార్లలో గల సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బాలాజీ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో జిల్లా పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్ ను ప్రారంభించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నూతన హంగులతో నిర్వహించ బడుతున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థుల్లో చదువుపై ఉన్న నైపుణ్యాన్ని పరిశీలించి, మధ్యాన్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇటీవల మృతి చెందిన పట్టేటి నరసింహారావు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. జే.కే కాలనీ, సీ.ఈ.ఆర్ క్లబ్ నందు పట్టణానికి చెందిన మైనారిటీ నాయకులు అజ్జు గారి సోదరి నిఖా కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించారు. బొజ్జాయి గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎస్.ఎస్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన కల్తీ లక్ష్మయ్య రమాదేవి కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, ఎంపీడీఓ అప్పారావు, బాలాజీ నగర్ సర్పంచ్ స్వాతి, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు రాము, సురేందర్, రాంబాబు, నాయకులు మడుగు సాంబమూర్తి,బోళ్ళ సూర్యం, చిల్లా శ్రీనివాసరావు, పాల్గొన్నారు.




## బడ్జెట్ ప్రతులు దహనం

**నవతెలంగాణ-దమ్మపేట**

మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి ఒకటో తారీఖున పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బడ్జెట్ జీవో కాపీలను దగ్ధం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, కొలిగిపోగు శ్రీనివాసరావు, కొలిగిపోగు స్రవంతి, కూకలకుంట సీతారామయ్య, మళ్ళా సత్యం, నాగయ్య, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## పామాయిల్ హబ్‌గా దమ్మపేట, అశ్వారావుపేట

**నవతెలంగాణ-దమ్మపేట**

మండలంలోని పట్వారిగూడెం రైతు వేదికలో పామాయిల్ సాగులో యాజమాన్య పద్ధతులు, మండలంలో పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచుట గురించి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి మరియన్న మాట్లాడుతూ రాష్ట్రంలోనే అశ్వరావుపేట, దమ్మపేట మండలాలు పామాయిల్ సాగుకు హబ్ గా ఉన్నందుకు గర్వపడుతూ ఇంకా మండలంలో రైతులందరూ ముందుకు వచ్చి పామాయిల్ విస్తీర్ణం పెంచాలని కోరారు. ఇందుకు రైతులు అప్లికేషన్ ఫారాలు మీ పరిధిలో ఉన్న వ్యవసాయ విస్తీర్ణం అధికారులకు లేదా ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్లికేషన్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఏడీఏ అశ్వరావుపేట మాట్లాడుతూ రైతు సోదరులందరూ మొక్కల్లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, బాలకృష్ణ, ఏఈఓలు పాల్గొన్నారు.

## కోటయ్య మృతికి సీపీఐ(ఎం) సంతాపం

**నవతెలంగాణ-మణుగూరు**

సిపిఎం మండల కమిటీ సభ్యులు మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పల్లపు నాగేశ్వరరావు తండ్రి పల్లపు పెద్ద కోటయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయనకు అయిదు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కమిటీ ఆధ్వర్యంలో కుటుంబానికి సంతాపం తెలిపి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, బొల్లం రాజు, నాగలక్ష్మి, మాచారపు లక్ష్మణరావు, నంద ఈశ్వరరావు, గుర్రం నరసయ్య, కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

**నవతెలంగాణ- టేకులపల్లి**

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన టేకులపల్లి తడికలపూడి రహదారిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. టేకులపల్లి ఎస్.ఐ. భూక్య. శ్రీనివాస్ కథనం ప్రకారం అనిశెట్టి పల్లి వాగు నుండి ఇసుక రవాణా చేస్తున్న చంద్రుతండా పంచాయతీ ధర్మా తండాకు చెందిన ట్రాక్టర్ తడికలపూడి వైపు వెళుతుండగా సింగరేణి మండలంలోని పోలంపల్లి మోకాళ్ళ రామయ్య గుంపుకు చెందిన ఆర్య వేణు(18) తలకలపూడి గ్రామంలోని పెదనాన్న ఇంటికి వెళ్లి టేకులపల్లి వైపు వస్తుండగా రాళ్లవాగు సమీపంలో ఇసుక ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనమును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న వేణు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వాలీబాల్ కిట్ల పంపిణీ

**నవతెలంగాణ-మణుగూరు**

రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదేశాలతో వాలీబాల్ కిట్లను పంపిణీ చేసినట్లు టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఆడప అప్పారావు తెలిపారు. గురువారం మణుగూరు మున్సిపాలిటీ చెందిన పూలమార్కెట్ ఆటో యూనియన్, రాయిగూడంకు చెందిన యువతకు వాలీబాల్ కిట్లు అందజేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, నాయకులు వేముల లక్ష్మయ్య, బీఆర్ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గ యూత్, వర్కింగ్ ప్రెసిడెంట్ బోశెట్టి రవిప్రసాద్, మణుగూరు టౌన్ యువజన ప్రధాన కార్యదర్శి గుర్రం సృజన్, దేగల సంపత్, సొందే ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన వేతనాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

**మణుగూరు :** జీవో నెంబర్ 60 ప్రకారం పెరిగిన వేతనాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఆదేశించారని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. మణుగూరు మున్సిపల్ కార్మికులు పెరిగిన జీవో ప్రకారం పెరిగిన శాలరీస్ ఇవ్వాలని గత నాలుగు రోజులుగా చేస్తున్న సమ్మె నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ గురువారం జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె విషయాలను వివరించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఏప్రిల్ నెల నుండి పెరిగిన జీవో ప్రకారం 15,600 ఇవ్వవలసిందిగా మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారన్నారు.



## విద్యుత్ కోతలపై సబ్ స్టేషన్ ముందు ధర్నా

**నవతెలంగాణ- టేకులపల్లి**

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా టేకులపల్లి సబ్ స్టేషన్ ముందు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కమిటీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముందు గురువారం ధర్నా జరిగింది. అనంతరం అధికారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అనంతరం ధర్నాను ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు డి.ప్రసాద్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మ చారి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటలు కరెంటు ఇస్తున్నమని ప్రచారం చేసుకుంటూ 24 గంటలు కరెంటు కటింగ్ ఇస్తున్నారని ఎద్దేవ చేశారు. విద్యుత్తు కోతల వలన రైతాంగం, ఇతర కుటీర పరిశ్రమలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో రైతాంగం వరి, మొక్కజొన్న, మిర్చి తోటలకు నీరును కట్టుకోవాలంటే కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో అర్థం కాని పరిస్థితిలో ఉన్నదని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం 24 గంటల కరెంటును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అదనంగా విధించిన ఎసిడి బిల్లులను ఉపసంహరించుకుంటున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారని దాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏసిడి పేరుతో వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మండల నాయకులు జరుపల సుందర్, భూక్య పంతులు, భూక్య లాల్య బానోతు లింగ, ఈసం రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియాలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్లు

**నవతెలంగాణ-మణుగూరు**



సింగరేణి కాలరీస్ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎస్వికె శ్రీనివాస్ డైరెక్టర్ ఫైనాన్స్, పా ఎస్ బలరాం, ఐఆర్ఎస్ డైరెక్టర్ ప్రాజెక్ట్ ప్లానింగ్ జి వేంకటేశ్వర రెడ్డి, జి.ఎం (సీపీడీపీ) కార్పొరేట్ ఫ్రీ సీహెచ్ నరసింహ రావు తమ అధికారిక పర్యటనలో భాగంగా గురువారం ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్, ఏరియా ఉన్నత అధికారులతో కలిసి ముందుగా కొండాపురం భూగర్భ గనిని సందర్శించారు. అనంతరం జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశలో మణుగూరు ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకం, లక్ష్యాల సాధనపై ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్, ఏరియా ఉన్నత అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ముగ్గురు డైరెక్టర్లు తమ సూచనలను తెలియజేశారు. మణుగూరు ఏరియా బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతలో సింగరేణి మొత్తంలో మంచి గుర్తింపు ఉందన్నారు. ఒరవడిని కొనసాగిస్తూనే భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏరియాలో సత్వహంగ కొత్త గనులకు సంబంధించిన నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సంవత్సరపు వార్షిక లక్ష్యమైన 116 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అధిగమించి ఉత్పత్తిలో, బొగ్గు రవాణాలో ఈ వార్షిక లక్ష్యాన్ని సాధించడమే కాకుండా రానున్న 2023- 24 వార్షిక లక్ష్య సాధనకు గాను ఇప్పటి నుండే ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పవర్‌ను, యాంత్రిక శక్తిని పూర్తి స్థాయిలో వినియోగించుకొని పని గంటలను 13.5 గంటల నుండి 16.00 గంటలకు పెంచడం ద్వారా లక్ష్యాలను సులువుగా సాధించగలగాలని సూచించారు. కార్మికుల సౌకర్యాలకు, సంక్షేమానికి, కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందించడానికి యాజమాన్యం సిద్ధంగా ఉన్నదన్నారు. కాబట్టి వెల్ఫేర్ విషయంలో మరింత చొరవ తీసుకోవాలని సూచించారు. 2023 -వార్షిక లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు 116 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని అధిగమించేందుకు మాన్ పవర్ ను యంత్ర సామగ్రిని ఉపయోగించుకోవాలన్నారు. 16 గంటల్లో పనిని పెంచడం ద్వారా లక్ష్యాలను సాధించుచున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు డి.లలిత్ కుమార్, జి.నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, సర్వే రెడ్డి, లక్ష్మీపతి గౌడ్, శ్రీనివాసచారి, ఎస్ రమేష్, వెంకట్రావు, సురేష్ వెంగళరావు మేరీ కుమారి రాముడు అనురాధ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# పినపాక ఏజెన్సీ గ్రామాల రోడ్లకు 2 కోట్ల 30 లక్షలు నిధులు

- ఫిబ్రవరి చివరి కల్లా సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తాం
- భారాస అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి

**నవతెలంగాణ-పినపాక**



ఫిబ్రవరి నెల చివరి కల్లా పినపాక మండలంలో గ్రామ గ్రామంలో వీధి వీధిలో సీసీ బీటి రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని పినపాక మండల భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి తెలిపారు. గురువారం బయ్యారం క్రాస్ రోడ్ లోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పినపాక మండలంలోని మారుమూల గ్రామాల రోడ్ల కొరకు పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు 2 కోట్ల 30 లక్షల రూపాయలను మంజూరు చేయించారన్నారు. నీళ్ల నిధులు నియామకాలు సంక్షేమం అభివృద్ధి అనే నినాదంతో పినపాక నియోజకవర్గం స్థానిక శాసనసభ్యులు రేగా కాంతారావు సారథ్యంలో రాష్ట్రంలోనే ముందు స్థానంలో నిలిచిందన్నారు. పినపాక మండలానికి ఫైర్ స్టేషన్ సైతం మంజూరు అయిందన్నారు. మరికొద్ది రోజుల్లో మండల వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అడుగడుగున రోడ్ల నిర్మాణం జరుగుతుందని, మట్టి రోడ్డు అనేది కనిపించదని అన్నారు. పినపాక మండలాన్ని అభివద్ధి మార్గంలో నడిపిస్తూ, ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి నిరంతరం శ్రామికుడిలా కృషి చేస్తున్న విప్ రేగా కాంతారావుకు, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు ముఖ్యమంత్రి కేసీఆర్ కు పినపాక మండల ప్రజల తరపున సతీష్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల ఎంపీపీ గుమ్మడి గాంధీ, పార్టీ సీనియర్ నాయకులు కోలేటి భవాని శంకర్, పిఏసిఎస్ చైర్మన్ రవి శేఖర్ వర్మ వైస్ చైర్మన్ బత్తుల వెంకటరెడ్డి, భారాస మండల ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి సత్తిబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ పటేల్ భద్రయ్య, రైతుబంధు అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దాట్ల వాసుబాబు, అమరారం ఎంపీటీసీ ఖాయం శేఖర్, అమరారం సర్పంచ్ మొగిలిపల్లి నరసింహారావు, జానంపేట సర్పంచ్ బాడిశ మహేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సోంపల్లి తిరుపతి పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

### ఎంపీపీ గుమ్మడి గాంధీ

**నవతెలంగాణ-పినపాక**

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గుమ్మడి గాంధీ కోరారు. గురువారం కిష్టాపురం పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంధత్వానికి గురైన అన్ని ప్రాంతాల ప్రజలకు అత్యున్నత నాణ్యత కల్గిన వైద్యం పైసా ఖర్చు లేకుండా అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. గ్రామాల్లో ఇంటింటి కంటి సర్వే చేపట్టామని, కంటి బాధితులంతా కంటి పరీక్ష శిబిరానికి వచ్చేలా స్థానిక ఉద్యోగులు, విద్యావంతులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఖాయం శేఖర్, సర్పంచ్ సుతారి సుశీల, జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శృతి, ఉప సర్పంచ్ మొగిలిపల్లి రమాదేవి, నాగరాజు, నరసింహారావు, నరేష్, ఉండం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## జుట్టు రాలుతుందా..?



ప్రస్తుతకాలంలో జుట్టు రాలే సమస్య అందరినీ వేధిస్తుంది. అయితే డెలివరీ అయిన తర్వాత ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటుంది. ప్రసవం తర్వాత చాలా మంది మహిళలు జుట్టు రాలే సమస్యతో బాధపడుతున్నారు. అప్పటి వరకు ఒత్తుగా, పొడవుగా ఉండే జుట్టు.. డెలివరీ తర్వాత ఊడిపోవటం చూసి కొందరు భయపడి పోతుంటారు. కానీ ఈ సమస్యతో అంతగా భయపడాల్సిన పనిలేదు. ఇది పూర్తిగా సాధారణం. గర్భధారణకు ముందు, డెలివరీ తర్వాత మీ జుట్టు పెరుగుదలకు ఆటంకం కలిగించే హార్మోన్ హెచ్చు తగ్గుల కారణంగా కొందరిలో ఇలా జరుగుతుంటుంది. కానీ ఇది శాశ్వత సమస్య మాత్రం కాదు. ప్రసవం తర్వాత మొదటి కొన్ని నెలల వరకు మాత్రమే ఉంటుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మీ జుట్టు యధాస్థితికి చేరుకుంటుంది.

- గర్భధారణ తర్వాత శరీరాన్ని తిరిగి బలోపేతం చేయడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రసవానంతర విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉన్న పోషకాహారాన్ని తినాలి. జుట్టు రాలడాన్ని ఎదుర్కోవడంలో ఇవి చాలా సహాయపడతాయి.
- అలాగే హైడ్రేటెడ్‌గా ఉండటానికి రోజంతా పుష్కలంగా ద్రవాలను తీసుకోవటం ఉత్తమం. అలాగే వీలైనంత వరకు ఒత్తిడికి దూరంగా ఉండాలి. మెడిటేషన్ చెయ్యడం వలన ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. ఇది హార్మోన్ల అసమతుల్యతను నియంత్రించడంలో సహాయపడుతుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.
- డెలివరీ తర్వాత మీరు ఎక్కువ పోషక పదార్థాలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలాగే జుట్టు రాలి పోవడం సమస్య తగ్గిపోతుంది. ఆకు కూరలు, మోరంగడ్డలు, తాజా పండ్లు వంటివి ఎక్కువగా తీసుకోవటం మంచిది. ఆహారంతో పాటుగా హెయిర్ కేర్ ట్రీట్మెంట్ తీసుకోవడం కూడా మంచి పద్ధతి. ఎక్కువ రెస్ట్ తీసుకోవడం, మంచి నిద్ర పొందడం కూడా చాలా ముఖ్యం. మంచి నిద్రతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టొచ్చు.

## ఇలా సేదతీరండి...



ఇంటా బయటా బాధ్యతలు నెరవేర్చే సమయంలో ఒక్కోసారి ఒత్తిడికి లోనవుతుంటాం. ఆయా పనుల్లో ఆటంకాలు ఎదురైతే.. అనుకున్న రీతిలో చేయలేకపోతే మరేవో సమస్యలెదురైతే.. నిరాశా నిస్పృహలు తప్పవు. మరి ఆ బాధ, భయాల నుంచి బయటపడేదెలా? మనకు మనమే ధైర్యం చెప్పుకొని, ఉపశమనం పొందాలి. సమస్యల్ని అధిగమించాలి. అందుకు నిపుణులు సూచిస్తున్న కొన్ని మార్గాలు చూడండి...

- దుఃఖం కలిగినప్పుడు కాసేపు ఆ విషయాన్ని పక్కనపెట్టి ఒక మంచి పుస్తకం చదవండి, లేదా చక్కని సినిమా చూడండి.

– కొంతసేపు ప్రకృతిని ఆస్వాదించండి. కుదరకపోతే మబ్బుల్ని చూస్తూ కూర్చోండి, ప్రశాంతంగా ఉంటుంది.

- దీర్ఘంగా ఊపిరి పీల్చుకుని కొంతసేపు నిలిపి.. అంతే దీర్ఘంగా శ్వాస వదలాలి. ఇలా అరగంటసేపు శ్వాస మీద ధ్యాస పెట్టారంటే మీలో ఎంత మార్పు వస్తుందో మీకే అర్థమవుతుంది. అరగంటసేపు వ్యాయామం చేయండి.
- వాట్సప్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాలను వదిలేసి ఒకసారి ఆప్తులకు ఫోన్ చేసి మాట్లాడండి.
- బొమ్మలేయడం, పాట పాడటం, నృత్యం, ఎంబ్రాయిడరీ, మిమిక్రీ లాంటివేమైనా సరే.. మీకు ఇష్టమైన కళలో కొంతసేపు సాధన చేస్తే సరి.
- బంధు మిత్రులెవరినైనా ఇంటికి ఆహ్వానించండి. లేదా మీరే వారింటికి వెళ్లండి. కాసేపు ఇష్టమైన వారితో ముచ్చటిస్తే తిరిగి రీఛార్జవుతారు.
- కొంతసేపు పడుకోండి. సేదతీరాక ఆలోచించండి.

# లత... కేరాఫ్ సక్సెస్

**సక్సెస్... ఇది ఏ ఒక్కరి సొత్తు కాదు. అలా అని అంత సులభంగా ఎవరి వద్దకూ వచ్చి చేరదు. విజయం సాధించడాలంటే కష్టపడాల్సిందే. శ్రమనే నమ్ముకుని అంచలంచలుగా ఎదిగిన మహిళలెందరో మన కండ్ల ముందు ఉన్నారు. వారిలో లత నడుకుడ ఒకరు. ఏడవ తరగతి మాత్రమే చదువుకున్న ఆమె ఇప్పుడు ఏకంగా రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తుంది. నాలుగు గార్మెంట్స్ షోరూమ్స్ నడిపిస్తుందంటే దాని వెనక ఎంతటి శ్రమ దాగివుందో అర్థం చేసుకోవచ్చు. ఈ సక్సెస్ వెనక ఉన్న సీక్రెట్ ఏమిటో, ఎవరెవరు ఉన్నారో మనం ఇప్పుడు తెలుసుకుందాం.**

జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం, యూసఫ్‌నగర్ గ్రామంలో సాదాసీదా కుటుంబంలో పుట్టింది లత. అది చిన్న పల్లెటూరు కావడంతో ఏడవ తరగతి వరకే చదువుకుంది. ఆ తర్వాత చదువుకోవాలంటే చాలా దూరం బస్సులో ప్రయాణం చేయాలి. అందుకే తండ్రి వద్దని చదువు అక్కడితో ఆపేశాడు. ఖాళీగా ఉండటంతో 2001లో టైలరింగ్‌కి వెళ్లడం మొదలుపెట్టింది. రెండేండ్లు కష్టపడి నేర్చుకుంది. టైలరింగ్‌కి ఫీజు కట్టడానికి డబ్బులు లేకపోతే తన దగ్గర ఉన్న అరతులం కమ్మలు వాళ్లకి ఫీజు కింద ఉంచుకోమని చెప్పింది.

### కష్టపడితేనే ఫలితం

2003 నుండి ఇంట్లోనే బ్లౌజులు, డ్రెస్సులు కుట్టడం మొదలుపెట్టింది. తాను కుట్టడమే కాకుండా మరికొందరికి టైలరింగ్ నేర్పించి వాళ్ళు ఇచ్చిన ఫీజుతో కమ్మలు విడిపించుకుంది. అలా మొదలైన ఆమె ప్రయాణం ఇప్పుడు ఒక్కసారి వెను తిరిగి చూసుకుంటే ఇదంతా సాధించిన తనేనా అన్న ఫీలింగ్ వస్తుందట. ఏది ఏమైనా కష్టపడితేనే ఫలితం అన్నదానికి మన లత ఓ మంచి ఉదాహరణ.

### భర్త ఉద్యోగం పోయింది



2005లో లతకి పెండ్లి అయింది. భర్త దేవేందర్‌తో కలిసి నిజామాబాద్‌కి వచ్చేసింది. అక్కడ రెండేండ్లు ఖాళీగా ఉంది. భర్త హోంగార్డుగా పని చేసేవారు. కొన్ని కారణాలవల్ల భర్త ఉద్యోగం పోవడంతో కాస్త దిగులు పడింది. ఎంత ప్రయత్నించినా భర్తకు మరో ఉద్యోగం దొరకలేదు. లత నిరుత్సాహ పడకుండా ధైర్యం తెచ్చుకుంది. కాలానికి ఎదురీది పోరాడింది. భర్త తెచ్చే ఆ మూడువేల రూపాయల జీతం కూడా పోవడంతో ఒక కొత్త ఆలోచన చేసింది.

### అప్పు చేసి... కుట్టుమిషన్ కొని

తనకు వచ్చిన విద్య టైలరింగ్ కాబట్టి అదే మళ్ళీ మొదలుపెట్టాలనుకుంది. తన ఆలోచనను భర్తకి చెప్పింది, ఇద్దరు ఆలోచించుకున్నారు. తనకు తెలిసిన ఒక బట్టల షాపు ఓనర్ దగ్గరికి తీసుకువెళ్ళాడు. అతను పని ఇచ్చి ఇంట్లోనే కుట్టమనేవాడు. ఎలాగో అప్పు చేసి కుట్టు మిషన్ కొన్నారు. నెలకు ఏడు వేలు సంపాదించేది. పాప పుట్టింది, ఖర్చులు పెరిగాయి, అవసరాలూ పెరిగాయి. దాంతో దేవేందర్ తనకు తెలిసిన స్కూల్స్‌కి వెళ్లి ఆర్డర్స్ తెచ్చేవాడు. ముందుగా స్కూల్ బెల్టులు, టైలు, ఐడి కార్డులు ఆర్డర్ తెచ్చేవాడు. అలా మొదలైన ఆర్డర్స్ దినదినాభివృద్ధి చెందాయి. రాను రాను టైలరింగ్ బాగా డెవలప్ అయ్యింది. స్కూల్ యూనిఫామ్ ఆర్డర్స్ రావడం మొదలయ్యాయి.

### ఉచిత టైలరింగ్ శిక్షణ

లత బిజీ అయిపోయింది. అంతేకాదు పదిమందికి నేర్పించడం, పని ఇచ్చి కుట్టమనడం మొదలుపెట్టింది. ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన పేరిట ఎంతో మందికి టైలరింగ్ ఉచితంగా నేర్పించింది. కుట్టు మిషన్ కొనుక్కోవడానికి కూడా డబ్బు లేని వారికి తానే సాయం చేసి సంపాదన వచ్చిన తర్వాత తన అప్పు తీర్చమని చెప్పేది. లత చేసే ప్రతి పనికీ భర్త దేవేందర్ అండగా ఉండి ఫుల్ సపోర్ట్ చేసేవాడు. చిన్నగా మొదలైన ఆమె ఉచిత ట్రైనింగ్ పథకం రాను రాను అభివృద్ధి చెంది 50 మంది నుండి వంద మంది వరకు కుట్టు పని నేర్చుకున్నారు. భర్త అన్ని స్కూల్స్ తిరుగుతూ ఆర్డర్స్ తెస్తూ ఉంటే లత మాస్టర్స్‌ని పెట్టుకొని టైలరింగ్‌ని అభివృద్ధి చేసింది.



### కరోనా మొదలవడంతో...

ఉచితంగా ఆడవారికి శిక్షణ ఇవ్వడం, ఇంటింటికీ ఒక కుట్టు మిషన్ ఇవ్వడంతో వర్కర్స్ పెరిగారు. దాంతో డ్వాక్రా మహిళా గ్రూపులో చేరి లోను తీసుకొని మంగళసూత్రం కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి బిజినెస్ డెవలప్ చేశారు ఆ భార్యాభర్తలు. పగలు రేయి కష్టపడి పనిచేయడం అలవాటు చేసుకున్నారు. ఇంతలో కరోనా మొదలైంది. మాస్కులు అవసరం పడ్డాయి అందరికీ. అనుకోని విధంగా ఆ జిల్లా కలెక్టర్ , మునిసిపాలిటీ కమిషనర్ వల్ల గవర్నమెంట్ ఆర్డర్ లత చేతికి వచ్చింది. 15 రోజులలో లక్ష మాస్కులు కుట్టి ఇవ్వమని ప్రాజెక్టు డైరెక్టర్ జరుపుల రాములు ఆర్డర్ ఇచ్చారు. ఇది లత జీవితంలో అనుకోని మార్పు.

### బంగారం మొత్తం తాకట్టు పెట్టి

పెద్ద ఆర్డర్... కాకపోతే పెట్టుబడి 12 లక్షలు పెట్టాలి. దాంతో తన బంగారాన్నీ, అత్తగారి బంగారాన్నీ తల్లి బంగారాన్నీ మొత్తం తెచ్చి పెట్టుబడి పెట్టి మూడు రోజుల్లో ఆ మొత్తాన్ని సంపాదించుకొని ఆ ఆర్డర్‌ని ఎలాగో కష్టపడి దక్కించుకున్నారు. 15 రోజుల్లో లక్ష మాస్కులు పూర్తి చేసి ఇచ్చారు. మూడు లక్షలు లాభం వచ్చింది. అంత మొత్తం కండ్ల చూడడం అదే మొదటిసారి. అందులో ఒక లక్ష మాత్రమే వాళ్ళు ఉంచుకొని మిగతా రెండు లక్షలతో పేద వర్కర్లకు పప్పులు, బియ్యం, నూనె లాంటి రేషన్ ఇచ్చారు. ఆమె సేవాగుణం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ప్రభుత్వం దృష్టిలో ఒక గొప్ప వ్యక్తి అయిపోయింది లత.

### WE HUB సహకారంతో

అప్పటి నుండి అన్నీ పెద్ద ఆర్డర్సే వచ్చేవి. 2020లో పీపీ కిట్స్ కుట్టమని ఆర్డర్ ఇచ్చింది గవర్నమెంట్. అదే సమయంలో WE HUB సహకారంతో ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యింది. అకౌంటింగ్, మార్కెటింగ్, టాక్స్‌లు ఇలా మొత్తం వ్యాపారానికి సంబంధించిన కిటుకులు అన్నీ నేర్పించారు అక్కడ. ఇది తన వ్యాపారంలో మరింత అభివృద్ధికి దోహదపడింది. కరోనా సమయంలో గ్రామంలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్న ఆశా వర్కర్స్‌కు బ్లౌజులు కుట్టే ఆర్డర్ మళ్లీ లతకే వచ్చింది. 20వేల బ్లౌజెస్ ఒక నెలలో పూర్తి చేయాలని టార్గెట్ ఇచ్చారు. కొన్ని లత కట్ చేసేది మరికొన్ని వర్కర్స్‌తో చేయించేది. ఆ సమయంలోనే ఓ న్యూస్ ఛానల్ వాళ్ళు లత ఇంటర్వ్యూ తీసుకోవడం, ఓ ఇంగ్లీష్ పత్రికలో లత గురించి ఆర్టికల్ రావడంతో అందరి దృష్టిలో పడింది.

### ప్రభుత్వ సహకారంతో...

జిల్లాలో ఉన్న అన్ని గవర్నమెంట్ స్కూల్ యూనిఫామ్ ఆర్డర్లు లతకే ఇస్తామని గవర్నమెంట్ సహకారం అందించింది. దాంతో మూడు లక్షల యూనిఫామ్స్‌కి ఆర్డర్ వచ్చింది. నాలుగు నెలల ప్రాజెక్టు అది. వెంటనే వర్క్ మొదలు పెట్టింది లత. 2000 మంది వర్కర్స్‌తో నాలుగు బ్రాంచ్‌లు ఓపెన్ చేసింది. 'శ్రీలత లేడీస్ టైలర్ అండ్ గార్మెంట్స్' పేరుతో అంచలంచలుగా ఎదిగిన లత స్ఫూర్తిదాయక జీవితం అందరికీ ఆదర్శం.

### ట్రస్టును ప్రారంభించి

లత పట్టుదల చూసిన కేఎంసి అనే సంస్థ పది లక్షల రూపాయల విలువ గల మెటీరియల్ అప్పుగా ఇచ్చారు. ఒకప్పుడు తినడానికి తిండి లేక కష్టపడ్డ లతా, దేవేందర్లు ఇప్పుడు ఎందరికో ఉపాధి కల్పిస్తున్నారు. పేదలకు సహాయం చేయడం ఈ దంపతుల మరో ప్రత్యేకత. మీ ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటని ప్రశ్నిస్తే 'జ్ఞానోదయం' అనే ట్రస్టును స్థాపించి రోడ్డుపై అడుక్కునే ప్రతి ఒక్కరికి మంచి బట్టలు కుట్టించి ఇవ్వాలని ఒక ఆలోచన, అంతేకాదు ఒక గవర్నమెంట్ స్కూలుని అడాప్ట్ చేసుకొని వారిని చదివించి మంచి ప్రయోజకులను చేయాలని వారి ఆశయం. ఇప్పుడు వారి టౌన్ లెవల్లో ఫెడరేషన్ అధ్యక్షురాలు లత. ఇంతకంటే విజయం ఏముంటుందండి. తాజాగా కంటి వెలుగులో కూడా లత వర్క్ చేస్తుంది. లత జీవితం ఇప్పుడు ఎందరికో స్ఫూర్తిదాయకం. భవిష్యత్‌లో ఆమె మరెన్నో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుందాం.



లత గార్మెంట్స్ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

– ముచ్చర్ల రజనీ శకుంతల,
9246207774

---

# జైలుకైనా పోతాం.... జాగాలను వదలం



(మొదటిపేజీ తరువాయి)

పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న దన్నారు. 23 జిల్లాల్లో, 47 పోరాట కేంద్రాల్లో, నిలువ నీడలేని పేదలు ప్రభుత్వ భూముల్లో 28వేల మంది దాకా గుడిసెలేసుకున్నారనీ, సెంటు భూమి కూడా లేనివారు 78 పోరాట కేంద్రాల్లో, 11వేల ఎకరాల ప్రభుత్వ భూమిలో సాగుచేసుకుంటున్నారనీ, వాటికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి జాగా, ఇల్లులేని పేదలకు ఒక్కొక్కరికి 120 గజాల జాగాతోపాటు, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే లోపే, సర్కారు వీటన్నింటిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం గొప్పగా చెబుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నగం కూడా పూర్తి కాలేదని వీరయ్య ఈ సందర్భంగా చెప్పారు. కట్టినిండ్లను పేదలకు ఇవ్వాలన్నారు. నిర్మాణంలో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. తమకు ఇండ్లు, ఇండ్ల జాగాలు కావాలని పోరాటం చేస్తున్న పేదలపై జక్కులొద్దితో పాటు అనేక చోట్ల లాఠీ ఛార్జ్ చేశారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారని చెప్పారు. కష్టజీవులైన ఈ పేదలు గొంతెమ్మ కోర్కెలు కోరటం లేదన్నారు. మంది సొమ్ము అడగటం లేదని చెప్పారు. మిగులు భూములు, శిఖం భూమినే అడుగుతున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యేలోపు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉధతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

### అసెంబ్లీలో రూమ్ లేదని ఆందోళన.. పోతినేని



పేదలు, అందునా మహిళలు బట్టలు మార్చుకోటానికి చాటు లేదనీ, కన్నార్పటానికి, సేదదీరటానికి కనీసం గుడిసె లేదని ఆందోళన చేస్తుంటే.. వీటిపై మాట్లాడాల్సిన బీజేపీ శాసన సభ్యులు అసెంబ్లీలో తమకు టిఫిన్ చేయటానికి రూమ్ లేదంటూ ఆందోళన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అదానీ, అంబానీలకు రూ.19లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం పేదలకు ఎన్ని ఇండ్లు కట్టించిందో చెప్పాలన్నారు. బీజేపీ హయాంలో భూ స్వాములకు, పెట్టుబడి దారులకే ప్రయోజనం జరుగుతున్నదని వాపోయారు.



### రాజీవ్ గృహకల్ప ఇండ్లను పేదలకు పంచాలి... జూలకంటి



గత ప్రభుత్వాలు నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇండ్లను అర్హులైన పేదలకు పంచాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పలు సార్లు అధికార్ల దృష్టికి తీసుకుపోయామని గుర్తు చేశారు. 75ఏండ్ల స్వతం త్ర భారతంలో ఇప్పటికీ ఇంటి జాగా కోసం, ఇండ్ల కోసం ఆందోళన చయాల్సిన దుస్థితి రావటం బాధాకర మన్నారు. అధికారంలో ఉన్న వారు దోచుకుని దాచుకోవటం తప్ప, పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల ఇబ్బడి ముబ్బడిగా నిత్యావసరాల ధరలు పెరుగుతుంటే పేదలెట్లా బతుకుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులను హోల్ సెల్‌గా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు.

### ఐక్యంగా ఉంటే..ఫలితం వస్తుంది.. హైమావతి

ఇండ్లు సాధించుకునే వరకు పోరాటాన్ని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బి హైమావతి ఆపొద్దన్నారు. ఐక్య పోరాటాల ద్వారానే విజయాలు సిద్ధిస్తాయని చెప్పారు. సర్కారు మాటలు నీటి మూటలుగా ఉన్నా యన్నారు. ఎన్నికల సమయంలో పేదల కిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిని ముందస్తు అరెస్టు పేరుతో నిర్బంధించటమేంటని ప్రశ్నించారు.

### పేదల గోస ప్రభుత్వ పెద్దలు వినాలే.. పాలడుగు భాస్కర్



పేదల గోస ప్రభుత్వ పెద్దలు వినాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ చెప్పారు. 'మేం ప్రయి వేటు జాగాలను కబ్జా చేయలే..ప్రభుత్వ భూమిలోనే గుడిసెలేసుకున్నం' ఇది నేరం కాదు..అయినా పేదలపై దౌర్జన్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. పేదలు తల దాచుకునేందుకు గుంట భూమివ్వరు గానీ.. ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలు, ప్రగతి భవన్‌కు, రింగు రోడ్లకు మాత్రం భూములెక్కడివని ప్రశ్నించారు. బడా బాబులకు కార్పొరేట్లకు కార్పెట్లు పరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

### ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: చుక్కారాములు



పేదలు ప్రభుత్వ భూముల్లో వేసుకున్న ఇండ్లు ఒదిలిపెట్టి పోవటానికి సిద్ధంగా లేరని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు చెప్పారు. పట్టాలు ఇచ్చేంత వరకు పోరాటం ఆగదన్నారు. ప్రభుత్వానికి పేదల గొంతు వినపడాలనే ధర్నా చౌక్ నుంచి నినదిస్తున్నామని చెప్పారు.

### రాజీపడేదే లేదు..: టి సాగర్



కష్టజీవులైన నిరుపేదలు తాము ఉండటానికి ప్రభుత్వ భూముల్లో ఇండ్లేసుకుంటే.. వాటికి పట్టాలిచ్చి, ఇండ్లు కట్టించాల్సింది పోయి, వారిపై సర్కారు పోలీసులతో జులాం చేయిస్తున్నదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ తెలిపారు. పేదలు చేస్తున్న పోరాటంలో విజయం సాధించే వరకు పోరాటం ఆగదనీ, రాజీపడేదే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పాడై పోతున్నాయన్నారు. పీఎంఏవైలో కోటి 20లక్షల ఇండ్లను ఇచ్చామంటున్నారనీ, ఈ రాష్ట్రానికి ఎన్నిండ్లు ఇచ్చారో..? ఎక్కడ ఇచ్చారో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు.

### పట్టించుకునేవారే కరువయ్యారు.. : జి నాగయ్య



సెంటు భూమి లేని పేదలు తమకు తల దాచుకునేందుకు గుంట భూమి కావా లని అడిగితే ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అనేక సార్లు అధికారులను కలిసి అర్జీలిచ్చామన్నారు. పేదలంతా ఒక్కటై దండు కట్టి ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతారని చెప్పారు.

### డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేయాలి: డీజీ నర్సింహారావు



అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను తక్షణం పూర్తి చేసి పేదలకు కేటాయించాలని పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ నర్సింహారావు డిమాండ్ చేశారు. పేదలు ఇంటి కిరాయిలు కట్టలేక, ఇండ్ల స్థలాలు లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారని చెప్పారు.

### పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం..

పేదలకు న్యాయం చేసే వరకు పోరాటం ఆపేది లేదనీ, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, సాగు భూములకు పట్టాలు, పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేశ్, జీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, మత్స్య కార్మికుల, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెల్లెల బాలకృష్ణ, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేశ్, భూపాల్, ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, బుర్రి ప్రసాద్, కోట రమేశ్ పి.శ్రీకాంత్, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి అంటే.. పేదల బతుకులు మారటం..: ఎండీ అబ్బాస్



పేదల బతుకులు మారకుండా దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందబోదని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ చెప్పారు. ఇప్పటికీ 50శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని చెప్పారు. అందరికీ విద్యా వైద్యం, తిండి, బట్ట, ఇండ్లు ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

### పూర్తయినా కేటాయించలే..: వెంకట్రాములు



ప్రభుత్వం ఇస్తామంటూ సాగదీస్తున్న డబుల్ బెడ్‌రూమ్‌లను పేదలకు ఎందుకు కేటాయించటం లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రశ్నించారు. పేదలు గుడిసెలేసు కుంటే ఎందుకు ఖాళీ చేయమం టున్నారో అర్థం కావటం లేదన్నారు. వారికి ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని చెప్పారు.

## మోగిన ఎమ్మెల్సీ నగారా

న్యూఢిల్లీ :తెలుగురాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. తెలంగాణలో ఒక ఉపాధ్యాయ, ఒక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదల అయింది. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటేపల్లి జనర్దన్ రెడ్డి పదవీ కాలం మార్చి 29తోనూ, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సయ్యద్ అస్సాన్ జాఫ్రి పదవీకాలం మే1తో ముగియనున్నది. అలాగే ఏపీలో 14 ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు మార్చి 16 వెల్లడిస్తారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసుల రెడ్డి, కడప, అనంతపురం, కర్నూల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, కడప, అనంతపురం, కర్నూల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. అనంతపురం, కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీలు గుణపాటి దీపక్ రెడ్డి, బీటెక్ రవి (మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి)ల పదవీ కాలం మార్చి 29తో ముగియనున్నది. నెల్లూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, పశ్చిమ గోదావరి స్థానిక సంస్థల ఎమ్మెల్సీలు అంగర రామ్మోహన్, మంతెన వెంకట సత్యనారాయణ రాజు, తూర్పు గోదావరి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ చిక్కల రామచంద్రరావు, శ్రీకాకుళం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామ రాజు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బిఎన్ రాజ సింహులు, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కెఈ ప్రభాకర్ పదవీ కాలం మే 1తో ముగియనుంది.రెండు రాష్ట్రాల్లో నోటిఫికేషన్ తేదీతో పాటు ఎన్నికల తేదీ, ఫలితాల వెల్లడి ఒకే రోజున జరగనున్నది.

ఎన్నికల షెడ్యూల్

| | |
|---|---|
| నోటిఫికేషన్ | ఫిబ్రవరి 16 |
| నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ | ఫిబ్రవరి 23 |
| నామినేషన్ల పరిశీలన. | ఫిబ్రవరి 24 |
| నామినేషన్ల ఉపసంహరణ. | ఫిబ్రవరి 27 |
| పోలింగ్ | మార్చి 13 |
| ఎన్నికల ఫలితాలు | మార్చి 16 |

## అమృత కాలం కాదు..విష కాలం

(మొదటిపేజీ తరువాయి)

పోరాడుతున్న లెఫ్ట్ ఫ్రంట్‌తో చేతులు కలపాలని మేము వారికి (టిప్రా మోతా) చెప్పాము. కానీ వారు స్పందించలేదు.ఈ ఎన్నికల్లో తమకు, వామపక్ష–కాంగ్రెస్ కూటమికి మధ్య విభేదాలతో బీజేపీ లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నది" అని ఇంతక ముందు త్రిపురను పాలించిన రాచరిక కుటుంబానికి చెందిన టిప్రా మోతాను ఉద్దేశిస్తూ ఆమె అన్నారు.

త్రిపురలో ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. బీజేపీ ఎలాగైనా మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి మత, 'విద్వేష' రాజకీయాలకు ఇప్పటికే తెర లేపింది. అయితే, బీజేపీ వైఫల్యాలను ప్రజలకు తెలియపరుస్తూ సీపీఐ(ఎం) పార్టీ ప్రచారంలో ముందుకెళ్తున్నది.

## ఉత్తరాఖండ్‌లో పేపర్ లీక్ నిరసనపై లాఠీచార్జ్..

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేస్తున్నాము" అని పన్వార్ అన్నారు.

ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. పోలీసు చర్యను ఖండించింది. యువత గళాన్ని బలవంతంగా అణచివేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించింది. యువతపై దాడులను నిరసిస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తమ పార్టీ ప్రదర్శలను చేపడుతుందని కాంగ్రెస్ తెలిపింది. యువత తప్పుదోవ పట్టొద్దనీ, నియామక పరీక్షలు పారదర్శకంగా జరపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అంతకముందు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ నిరసనకారులను కోరారు.

## కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి - సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. గురువారం ఆమె అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. కంటి పరీక్షలు చేయించుకుని డాక్టర్లు సూచించిన కండ్లద్దాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు అనేది ప్రపంచంలోనే అతి పెద్ద సామాజిక కంటి పరీక్షల కార్యక్రమని అని తెలిపారు. సీఎస్‌తో పాటు రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్సీలు తాత మధు, కౌశిక్ రెడ్డి కూడా కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో ఉన్నారు.

## ఆర్టీసీపై చర్చ వాయిదా

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

శాసనసభలో టీఎస్‌ఆర్టీసీపై చర్చను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వాయిదా వేశారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, పెద్ది సుదర్శన్ రెడ్డి, కాలె యాదయ్య, అంజయ్య యెల్లనమోని టీఎస్‌ఆర్టీసీ సరకు రవాణా, కొరియర్ సర్వీసులు, సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడానికి తీసుకుంటున్న చర్యలు, సబర్బన్ బస్సుల పెంపుదల అంశాలపై ప్రభుత్వానికి రాతపూర్వకంగా ప్రశ్నలు అడిగారు. అయితే ఈ అంశంపై ప్రభుత్వ వినతి మేరకు చర్చను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటిం చారు. ఇదే అంశంపై శాసనమండలిలో ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి టీ హరీశ్‌రావు స్పందించి, సమాధానం చెప్పిన విషయం తెలిసిందే.


మంత్రి కేటీఆర్‌తో 'భీమదేవరపల్లి బ్రాంచి' చిత్ర బృందం

## మంచి సందేశాత్మక చిత్రం

ఏబి సినిమాస్, నిహాల్ ప్రొడక్షన్స్ పతాకంపై అంజి వల్గుమాన్, రాజవ్వ సుధాకర్ రెడ్డి, డా॥కీర్తి లత గౌడ్, అభిరామ్, రూప శ్రీనివాస్, సాయి ప్రసన్న నటీనటులుగా రమేష్ చెప్పాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. డాక్టర్ బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సిబిఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, నాయకులు అద్దంకి దయాకర్ ఈ చిత్రంలో నటించటం విశేషం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్ర టీజర్‌ను గురువారం మంత్రి కేటీఆర్ విడుదల చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్ర టీజర్‌ను చూసి చాలా ఇంప్రెస్ అయ్యాను. మంచి మెసేజ్ ఉన్న సినిమా అని అర్థం అవుతోంది. పూర్తి సినిమాను తప్పకుండా చూస్తాను' అని తెలిపారు.
'ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దర్శకుడు రమేష్ చెప్పాల మంచి విషయాన్ని కామెడీ వేలో చెప్పడంతో జనాలకి ఈ సినిమా ఈజీగా రీచ్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం. సినిమాని త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత డా॥ బత్తిని కీర్తీ లత గౌడ్ అన్నారు.

## సినిమాగా ఇదీ దాసరి చరిత్ర


నట్టికుమార్

దాసరి లాంటి పెద్దలు చేసిన మంచి పనులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాల్సిన కొంతమంది నేటి సినీ పెద్దలు అలాంటి వాటికి తిలోదకాలు ఇచ్చే స్థితికి చేరుకోవడం దారుణమని నిర్మాత నట్టి కుమార్ విమర్శించారు.
గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, '7 లక్షల మెడిక్లెయిమ్ పాలసీని కౌన్సిల్‌లోని ప్రతీ సభ్యుడికీ అందజేయాలి. నిధులు తక్కువగా ఉంటే కనీసం 5 లక్షల పాలసీ అయినా అందరికీ వర్తింపచేయాలి. సినీ పరిశ్రమ నిలబడటానికి దాసరి లాంటి పెద్దలు కారణం. అందుకే ఆయన సినీ జీవిత ప్రయాణాన్ని పలు అంశాలతో నేటి తరానికి అందించాలన్న సంకల్పంతో 'ఇదీ దాసరి చరిత్ర' పేరుతో ఓ సినిమాను తీయాలని నిర్ణయించుకున్నాను. అయితే ఇది బయోగ్రఫీ కాదు. మే 4న దాసరి బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రారంభిస్తాం. ఏపీ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీ ఇంతవరకు సినీ పరిశ్రమ వారితో ఎలాంటి మీటింగ్ పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అలాగే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చిన్న నిర్మాతల కంటే పెద్దవాళ్లతోనే సత్ సంబంధాలు కలిగి ఉంటున్నారు. ఆయన కూడా అందరినీ కలుపుకుపోవాల్సిన అవసరం ఉంది. రాబోయే నిర్మాతల మండలి ఎన్నికల్లో స్వార్థపూరితంగా వ్యవహరించే వ్యక్తులకు ఓట్లు వేయవద్దని కోరుతున్నాను. ఇకనైనా మంచి మార్పు కోసం అందరూ ముందుకు రావాలి' అని తెలిపారు.

# నవచిత్రం

## అందర్నీ మెప్పించే అమిగోస్


అషిక రంగనాథ్, కళ్యాణ్‌రామ్

కళ్యాణ్‌రామ్ త్రిపాత్రాభినయంలో నటించిన చిత్రం 'అమిగోస్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నూతన దర్శకుడు రాజేంద్రరెడ్డి దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది.
ఈ నేపథ్యంలో గురువారం చిత్ర బృందం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో హీరో కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ, సినిమా అవుట్‌పుట్ పై అందరం చాలా నమ్మకంతో ఉన్నాం. ఓ మంచి కాన్సెప్ట్‌తోపాటు ఈ సినిమాలో నేను మూడు పాత్రల్లో నటించటం చాలా సంతోషంగా ఉంది. మూడు పాత్రలను చేసే విషయంలో అన్ని రకాల సవాళ్ళను ఎదుర్కొన్నాను. నూతన దర్శకుడు రాజేంద్రరెడ్డి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. అలాగే మా నిర్మాతలు సినిమా నిర్మాణంలో ఎక్కడా రాజీపడలేదు. నేడు మీ ముందుకు రాబోతున్న ఈ సినిమా తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు.
'ఇలాంటి మంచి సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా కోసం కళ్యాణ్‌రామ్ ఎంతో కష్టపడ్డారు. ఆయనతో నటించటం చాలా గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమా ఫలితం కోసం అందరం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాం' అని నాయిక అషిక రంగనాథ్ అన్నారు.
నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ మాట్లాడుతూ, 'బింబిసార' వంటి ఘన విజయం సాధించిన తర్వాత కళ్యాణ్‌రామ్ నటించిన సినిమా కావడంతో ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఆ అంచనాలకు మించి ఈ సినిమా ఉంటుందని కచ్చితంగా చెప్పగలం. కళ్యాణ్‌రామ్ కెరీర్‌లోనే కాకుండా మా బ్యానర్‌లోనూ మరో మంచి సినిమా అవుతుంది' అని చెప్పారు.

## పేద విద్యార్థుల చదువు కోసం పోరాటం


సంయుక్త మీనన్, ధనుష్, వెంకీ అట్లూరి, సూర్యదేవర నాగవంశీ

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ద్విభాషా చిత్రం 'సార్' (తెలుగు)/ 'వాతి'(తమిళం).
శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు.
ధనుష్, సంయుక్త మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 17న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల ఏఎంబీ సినిమాస్‌లో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.
ఈ సందర్భంగా కథానాయకుడు ధనుష్ మాట్లాడుతూ, 'ఇది నాకు చాలా ప్రత్యేకమైన రోజు. ఇది నా మొదటి తెలుగు సినిమా. చాలా సంతోషంగా ఉంది. ఒకప్పుడు తెలుగు సినిమా, తమిళ సినిమా, కన్నడ సినిమా, హిందీ సినిమా అనేవాళ్ళు. కానీ ఇప్పుడు ఇండియన్ సినిమా అనడం సంతోషించదగ్గ విషయం. ఈ కథ చాలా బాగుంటుంది. పేద విద్యార్థుల చదువు కోసం ఓ మాస్టారు చేసే పోరాటమే ఈ సినిమా. నాకు ఇంతమంచి సినిమా ఇచ్చినందుకు వెంకీ అట్లూరికి ధన్యవాదాలు. అలాగే చినబాబు, నాగవంశీకి, త్రివిక్రమ్‌కి, సంయుక్త మీనన్, హైపర్ ఆది, మా టీమ్ అందరికీ ధన్యవాదాలు' అని అన్నారు.
'లాక్‌డౌన్ సమయంలో ఈ కథ రాసుకుని, వంశీకి నెరేట్ చేస్తే, ఆయనకు నచ్చింది. లాక్ డౌన్ కావడంతో అప్పుడు హీరోలు పెద్దగా కథలు వినే ధైర్యం చేయలేదు. కానీ ధనుష్ మాత్రం కథ చెప్పడానికి రమ్మన్నారు. ఈ సినిమా ఆయన చేసినా, చేయకపోయినా ఆయనకు కథ చెప్పానన్న సంతృప్తి నాకు చాలు అనుకున్నాను. కానీ ఆయన కథ వినగానే ఈ సినిమా చేస్తున్నాను అనడంతో నాకు ఆ ఆనందంలో మాటలు రాలేదు. నాకు ఈ అవకాశమిచ్చిన వంశీకి, ధనుష్‌కి జీవితాంతం రుణపడి ఉంటాను. ఓ మంచి సినిమా చేశామనే సంతృప్తి ఉంది' అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.
నాయిక సంయుక్త మీనన్ మాట్లాడుతూ,'ఇందులో ఓ మంచి పాత్ర పోషించినందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా అందరినీ అలరిస్తుంది' అని అన్నారు. ఈ వేడుకలో ఈ చిత్రంలో నటించిన స్టూడెంట్స్, టీమ్‌తో కలిసి 'మాస్టారు.... మాస్టారు' గీతాన్ని హీరో ధనుష్ ఆలపించడం విశేషం.




# ఆటలు



## ఫార్ములా-ఈ రయ్ రయ్

- నేడు ఫార్ములా ఈ ప్రాక్టీస్ రేసు
- సిద్ధమైన హైదరాబాద్ స్ట్రీట్‌సర్క్యూట్



నవతెలంగాణ-హైదరాబాద్

ప్రతిష్టాత్మక ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ రేసుకు రంగం సిద్ధమైంది. సుమారు దశాబ్దకాలం అనంతరం భారత్ ఓ ఎఫ్ఐఏ ఫార్ములా రేసుకు ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్‌లో జరుగనున్న తొలి ఫార్ములా-ఈ రేసు కావటంతో మోటార్‌స్పోర్ట్స్ వర్గాల్లో విపరీత ఆసక్తి కనిపిస్తోంది. 11 జట్లు, 22 మంది డ్రైవర్లు నేటి నుంచి హైదరాబాద్ స్ట్రీట్‌సర్క్యూట్‌పై రయ్‌రయ్ అనిపించనున్నారు. ఫార్ములా-ఈ రేసులో భారత్‌కు చెందిన మహీంద్రా జట్టుకు హైదరాబాద్ గ్రాండ్ ప్రీ ఆతిథ్య రేసుగా నిలువనుంది. ఫార్ములా-ఈ రేసుతో మోటార్‌స్పోర్ట్స్‌కు సరికొత్త జోష్‌తో పాటు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

**నేడు ప్రాక్టీస్ రేసు**

ఫార్ములా-ఈ రేసు కోసం 2.835 కిలోమీటర్ల హైదరాబాద్ స్ట్రీట్‌సర్క్యూట్ సిద్ధమైంది. ఇప్పటికే 11 జట్ల జెన్ 3 రేసింగ్ కార్లు గ్యారేజ్‌లకు చేరుకున్నాయి. నేడు సాయంత్రం 4.25-5.15వరకు వరకు తొలి ప్రాక్టీస్ రేసు జరుగనుంది. ప్రధాన రేసులో పాల్గొనే రేసర్లు సహా ప్రతి జట్టులోని యువ రేసర్లు సైతం ప్రాక్టీస్ రేసులోకి దిగే అవకాశం ఉంది. 50 నిమిషాల జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో రెండు గ్రూపులు 25 నిమిషాల చొప్పున ట్రాక్‌పై దూసుకెళ్లనున్నాయి.
ఉచిత ప్రవేశం : ఫార్ములా-ఈ ఈవెంట్‌కు రూ.1000 నుంచి రూ.1,25,000 వరకు టికెట్లను వివిధ విభాగాల్లో అందుబాటులో ఉంచారు. టికెట్లు కొనుగోలు చేయని అభిమానులు ఫార్ములా-ఈ మజా ఆస్వాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ అవకాశం కల్పించింది. నేడు ప్రాక్టీస్ రేసును టికెట్ లేకుండా ఉచితంగా వీక్షించే అవకాశం ఇచ్చింది.

## 'మల్లయుద్ధ' రెజ్లింగ్ చాంపియన్‌షిప్ ఆరంభం



- ఉత్సాహంగా తొలి రోజు కుస్తీ పోటీలు


**హైదరాబాద్ :** ముఖేశ్ గౌడ్ మెమోరియల్ 'మల్లయుద్ధ' రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు గురువారం ఎల్బీ స్టేడియంలో ఘనంగా ఆరంభమయ్యాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన రెజ్లింగ్ క్రీడాకారులను గుర్తించి, జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధమయ్యేందుకు అవసరమైన ఉపకార వేతనాలు అందించే బహత్తర లక్ష్యంతో శ్రేష్ఠ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కుస్తీ పోటీలను మాజీ మంత్రి, బిజెపీ జాతీయ ఉపాధ్యక్షులు డికె అరుణ ప్రారంభించారు. ' ముఖేశ్ గౌడ్ రెజ్లర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టారు. ఆయన స్మారకార్థం రూ.35 లక్షల నగదు బహుమతితో కుస్తీ పోటీలను ఈ స్థాయిలో నిర్వహించటం అభినందనీయం. శ్రేష్ఠ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర రెజ్లర్లు ఉన్నత స్థాయికి చేరుకోవాలని' డికె అరుణ ఆకాంక్షించారు. శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విక్రమ్ గౌడ్‌తో కలిసి డికె అరుణ పోటీలను ప్రారంభించారు. తొలి రోజు పురుషుల అండర్-15, అండర్-17 విభాగాల్లో కుస్తీ పోటీలు జరిగాయి. 17 విభాగాల్లో 700 మంది రెజ్లర్లు పోటీపడుతున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఫిబ్రవరి 12న ముగియనున్నాయి.

## రవీంద్రజాలం

జామ్తాలో టీమ్ ఇండియా జాతర. బంతితో రవీంద్ర జడేజా (5/47) ఐదు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టగా.. బ్యాట్‌తో కెప్టెన్ రోహిత్ శర్మ (56 బ్యాటింగ్) అజేయ అర్థ సెంచరీతో దండెత్తాడు. కీలక టాస్ ఓడినా.. అటు బంతితో, ఇటు బ్యాట్‌తో అదరగొట్టిన టీమ్ ఇండియా నాగ్‌పూర్‌లో తొలి రోజు పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే కుప్పకూలగా, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 77/1తో కొనసాగుతుంది.

- జడేజా ఐదు వికెట్ల ప్రదర్శన
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 177/10
- రోహిత్ అజేయ అర్థ సెంచరీ
- భారత్ తొలి ఇన్నింగ్స్ 77/1

నవతెలంగాణ-నాగ్‌పూర్



రవీంద్ర జడేజా (5/47) పునరాగమనంలో మాయ చేశాడు. లంచ్ తర్వాత ఆసీస్‌ను ఖతం చేసిన జడేజా..బోర్డర్-గవాస్కర్ తొలి టెస్టులో భారత్‌కు ఆరంభ ఆధిక్యత అందించాడు. జడేజాకు తోడు అశ్విన్ (3/42) మెరవటంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే కుప్పకూలింది. ఓ దశలో 2/2 నుంచి 84/2తో కోలుకున్న ఆస్ట్రేలియా.. చివరి ఐదు వికెట్లను 15 పరుగులకే చేజార్చుకుంది. మార్నస్ లబుషేన్ (49, 123 బంతుల్లో 8 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (37, 107 బంతుల్లో 7 ఫోర్లు), అలెక్స్ కేరీ (36, 33 బంతుల్లో 7 ఫోర్లు), పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (31, 84 బంతుల్లో 4 ఫోర్లు) ఆస్ట్రేలియాకు గౌరవప్రద స్కోరు అందించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (56 బ్యాటింగ్, 69 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్థ సెంచరీతో కదం తొక్కాడు. కెఎల్ రాహుల్ (20, 71 బంతుల్లో 1 ఫోర్) రోహిత్‌తో కలిసి శుభారంభం అందించాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి అశ్విన్ (0 బ్యాటింగ్) జతగా రోహిత్ అజేయంగా నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో మరో 100 పరుగుల వెనుకంజలో నిలిచింది.

**సెషన్ 1 : షమి, సిరాజ్ దూకుడు**

టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు పిచ్ నుంచి పరుగులు రాబట్టే ఆలోచనలో ఉన్న ఆస్ట్రేలియాకు పేసర్లు షాక్ ఇచ్చారు. మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్ తొలి మూడు ఓవర్లలోనే ఆసీస్‌ను కంగారు పెట్టారు. డెవిడ్ వార్నర్ (1) వికెట్‌ను షమి గాల్లో ఎగరేయగా.. ఖవాజ (1)ను సిరాజ్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. 2/2తో ఆస్ట్రేలియా కష్టాల్లో పడింది. మార్నస్ లబుషేన్ (49), స్టీవ్ స్మిత్ (37) ఈ దశలో కంగారూలను నిలబెట్టారు. మూడో వికెట్‌కు 82 పరుగుల విలువైన భాగస్వామ్యం జోడించారు. ఆరంభంలోనే ఓపెనర్లను అవుట్ చేసిన టీమ్ ఇండియా.. ఆ తర్వాత వికెట్ కోసం చెమటోడ్చింది. భారత బౌలర్లను స్మిత్, లబుషేన్ పరీక్షించారు. లంచ్ విరామ సమయానికి ఆస్ట్రేలియా 76/2 వద్ద నిలిచింది.

**సెషన్ 2 : స్పిన్ మాయజాలం**

ఉదయం సెషన్లో పేసర్ల దెబ్బ నుంచి కోలుకున్న ఆస్ట్రేలియాను.. లంచ్ తర్వాత స్పిన్నర్లు వేటాడారు. వరుస బంతుల్లో మార్నస్ లబుషేన్ (49), మాట్ రెన్షా (0)లను వెనక్కి పంపిన జడేజా.. భారత్‌ను రేసులోకి తీసుకొచ్చాడు. జడేజా మాయజాలంతో ఆసీస్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. స్టీవ్ స్మిత్ (37)ను సైతం తెలివిగా అవుట్ చేసిన జడేజా.. పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (31), టాడ్ మర్ఫీ (0)లను సైతం సాగనంపి పునరాగమనంలో ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అశ్విన్ సైతం వికెట్ల వేటలో జతకలవటంతో ఆస్ట్రేలియా 63.5 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. అలెక్స్ కేరీ (36) వికెట్‌తో టెస్టుల్లో అశ్విన్ 450 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. టీ విరామ సమయానికి 174/8తో నిలిచిన ఆస్ట్రేలియా.. మూడో సెషన్ ఆరంభంలోనే చివరి రెండు వికెట్లు చేజార్చుకుంది.

**సెషన్ 3 : రోహిత్ శర్మ అర్థ సెంచరీ**

ఆస్ట్రేలియా బ్యాటర్లు తంటాలు పడిన పిచ్‌పై భారత కెప్టెన్ రోహిత్ శర్మ (56 నాటౌట్) అజేయ అర్థ సెంచరీ సాధించాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే పాట్ కమిన్స్‌పై మూడు బౌండరీలు బాదిన రోహిత్ శర్మ ధనాధన్ ఆరంభాన్ని అందించాడు. సుమారు ఏడాది తర్వాత టెస్టు మ్యాచ్ ఆడుతున్న రోహిత్ శర్మ జామ్తా పిచ్‌పై కదం తొక్కాడు. వైస్ కెప్టెన్ కెఎల్ రాహుల్ (20)తో కలిసి తొలి వికెట్‌కు 76 పరుగులు జోడించాడు. తొలి రోజు మరో ఏడు బంతుల్లో ముగియనుండగా కెఎల్ రాహుల్ వికెట్ కోల్పోయాడు. అరంగేట్ర స్పిన్నర్ టాడ్ మర్ఫీ (1/13) ఆసీస్‌కు బ్రేక్ సాధించాడు. నైట్‌వాచ్‌మన్ రవిచంద్రన్ అశ్విన్ (0 నాటౌట్) తోడుగా రోహిత్ శర్మ అజేయంగా నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 77/1 పరుగులతో కొనసాగుతుంది.

**స్కోరు వివరాలు :**

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ :** డెవిడ్ వార్నర్ (బి) షమి 1, ఉస్మాన్ ఖవాజ (ఎల్బీ) సిరాజ్ 1, మార్నస్ లబుషేన్ (స్టంప్డ్) భరత్ (బి) జడేజా 49, స్టీవ్ స్మిత్ (బి) జడేజా 37, మాట్ రెన్షా (ఎల్బీ) జడేజా 0, పీటర్ హ్యాండ్‌కాంబ్ (ఎల్బీ) జడేజా 31, అలెక్స్ కేరీ (బి) అశ్విన్ 36, పాట్ కమిన్స్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 6, టాడ్ మర్ఫీ (ఎల్బీ) జడేజా 0, నాథన్ లయాన్ నాటౌట్ 0, స్కాట్ బొలాండ్ (బి) అశ్విన్ 1, ఎక్స్‌ట్రాలు : 15, **మొత్తం : (63.5 ఓవర్లలో ఆలౌట్) 177.**
**వికెట్ల పతనం :** 1-2, 2-2, 3-84, 4-84, 5-109, 6-162, 7-172, 8-173, 9-176, 10-177.
**బౌలింగ్ :** మహ్మద్ షమి 9-4-18-1, మహ్మద్ సిరాజ్ 7-3-30-1, రవీంద్ర జడేజా 22-8-47-5, అక్షర్ పటేల్ 10-3-28-0, రవిచంద్రన్ అశ్విన్ 15.5-2-42-3.
**భారత్ తొలి ఇన్నింగ్స్ :** రోహిత్ శర్మ నాటౌట్ 56, కెఎల్ రాహుల్ (సి,బి) టాడ్ మర్ఫీ 20, రవిచంద్రన్ అశ్విన్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 1, మొత్తం : (24 ఓవర్లలో ఓ వికెట్) 77.
**వికెట్ల పతనం :** 1-76.
**బౌలింగ్ :** పాట్ కమిన్స్ 4-1-27-0, స్కాట్ బొలాండ్ 3-1-4-0, నాథన్ లయాన్ 10-3-33-0, టాడ్ మర్ఫీ 7-0-13-1.

### నేడు కీలకం!

భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టులో రెండో రోజు కీలకం కానుంది. జామ్తా స్పిన్ స్వర్గధామం. తొలి రోజు మధ్యాహ్నం నుంచే బంతి గింగిరాలు తిరుగుతోంది. జడేజా, అశ్విన్‌లు చివరి 8 వికెట్లు పంచుకున్నారు. ఆస్ట్రేలియా 200 పరుగులైనా చేయకుండానే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు అమోఘంగా రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు సైతం మెప్పించే దిశగా సాగుతున్నారు. సుదీర్ఘ విరామం అనంతరం టెస్టు మ్యాచ్ ఆడుతున్న రోహిత్ శర్మ ధనాధన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. తొలి రోజు మూడో సెషన్లో 24 ఓవర్లలోనే భారత్ 77 పరుగులు చేసి మంచి స్థితిలో కొనసాగుతుంది.
అయితే, తొలి టెస్టులో రెండో రోజు ఆట ఫలితాన్ని శాసించనుంది. ఈ పిచ్‌పై పరుగులు చేయటం అంత సులువు కాదు. ఆ విషయం ఆస్ట్రేలియా బ్యాటింగ్‌తోనే అర్థమైంది. ఆసీస్ సైతం ఓ దశలో 84/2తో నిలిచినా.. వరుస వికెట్లతో చతికిల పడింది. ప్రస్తుతం భారత్ మంచి స్థితిలోనే నిలిచినా.. తొలి ఇన్నింగ్స్‌లో 250-300 పరుగులు చేయటం అత్యవసరం. రెండో ఇన్నింగ్స్‌లో 150 పైచిలుకు టార్గెట్‌ను ఛేదించటం సైతం జామ్తా పిచ్‌పై శక్తికి మించిన పని అవుతుంది. ఈ సంగతి భారత డ్రెస్సింగ్‌రూమ్‌కు బాగా తెలుసు. తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగుల లోటు అధిగమించి.. మరో 150 పరుగుల ఆధిక్యమైనా సొంతం చేసుకోవాలి. అప్పుడే నాగ్‌పూర్ టెస్టును గుప్పిట నిలుపుకోవచ్చు. విరాట్ కోహ్లి, చతేశ్వర్ పుజారా స్పిన్ ఆడటంలో ఇబ్బందులు పడటం భారత్‌కు ఆందోళనకరం. రిషబ్ పంత్ తరహాలో ధనాధన్ దంచుడు బాధ్యత సూర్యకుమార్ యాదవ్ తీసుకునే అవకాశం ఉంది. కె.ఎస్ భరత్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ సైతం పూర్తి స్థాయి బ్యాటర్ బాధ్యతలు పోషించగలరు. ఇది భారత్‌కు ప్రధాన బలం. నేడు వీలైనంత ఆధిక్యం సాధిస్తేనే రెండో ఇన్నింగ్స్‌లో కఠిన పిచ్‌పై లక్ష్యాన్ని సులువుగా ఛేదించేందుకు వీలుంటుంది. రోహిత్ అండ్ కో నేడు ఏం చేస్తుందో చూడాలి.

### భరత్, సూర్యకుమార్ అరంగేట్రం



నాగ్‌పూర్‌లో టెస్టులో ఇద్దరు క్రికెటర్లు అరంగేట్రం చేశారు. తెలుగు తేజం శ్రీకర్ భరత్, సూర్యకుమార్ యాదవ్‌లు తొలి టెస్టు తుది జట్టులో నిలిచారు. మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి నుంచి ఈ ఇద్దరు టెస్టు క్యాప్‌లు అందుకున్నారు. పంత్ పోషించిన వికెట్ కీపర్, డ్యాషింగ్ బ్యాటింగ్ బాధ్యతలను భరత్, సూర్య పోషించనున్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886